
బుధవారం
25•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 180
• పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యుత్ దీపాల అలంకరణలో వెలిగిపోతున్న మెదక్ మహాదేవాలయం
- ఫొటో: మాదూరి కుమార్ గౌడ్, మెదక్ జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు

"జీసస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని.. ప్రేమ, విశ్వాసంతో ముందుకు సాగాలి
- గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్


"కరుణ, జాలికి ప్రతిరూపమైన జీసస్ ప్రపంచానికి ప్రేమానురాగాలను చాటిచెప్పారు
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

2

# ఎన్పీఆర్ సవరణ!

## మోదీ సర్కార్ తాజా నిర్ణయం • అసోం మినహా అన్ని రాష్ట్రాల్లో అమలు

- వచ్చే ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య వివరాల సేకరణ
- రక్షణ దళాధిపతి పదవికి ఆమోదం
- రైల్వేలో సమూల మార్పులకు గ్రీన్‌సిగ్నల్
- దివాళా చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు సమ్మతి
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:** వివాదాస్పద జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ), పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర క్యాబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. అసోం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జాతీయ జనాభా పట్టికను (నేషనల్ పాపులేషన్ రిజిస్టర్-ఎన్పీఆర్)ను సవరించాలని (అప్‌డేట్ చేయాలని) నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఎన్పీఆర్ సవరణకు రూ.3,941.35 కోట్లు, 2021 జనగణనకు రూ.8,754.23 కోట్లు కేటాయించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2021 జనాభా లెక్కల సేకరణ తొలి విడుత ప్రక్రియతోపాటే వచ్చే ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య ఎన్పీఆర్ ప్రక్రియనూ చేపట్టనున్నారు. కాగా, రక్షణ దళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్) పదవికి కూడా మంత్రివర్గం సమ్మతి తెలిపింది. రైల్వేల పునర్వ్యవస్థీకరణతోపాటు దివాళా చట్ట సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను కూడా ఆమోదించింది. క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రులు ప్రకాశ్ జవదేకర్, పీయూష్ గోయల్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

**ఎన్నార్సీతో ఎన్పీఆర్‌కు సంబంధం లేదు..**

ఎన్నార్సీతో ఎన్పీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ స్పష్టంచేశారు. ఎన్పీఆర్ సవరణకు ప్రభుత్వం ప్రజల నుంచి ఎలాంటి పత్రాలు కానీ, బయోమెట్రిక్ వివరాలను కానీ సేకరించబోదని తెలిపారు. స్వీయ ధ్రువీకరణ కింద ప్రజలిచ్చిన సమాచారాన్నే తాము తీసుకుంటామని చెప్పారు. దేశంలోని ప్రతి పౌరుడికి సంబంధించిన సమగ్ర గుర్తింపు డాటాబేస్‌ను (వివరాలను) రూపొందించడమే ఎన్పీఆర్ ప్రధాన ఉద్దేశమని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్' అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ డాటాబేస్‌లో జనాభా

మిగతా 5వ పేజీలో

# 2020@ కృత్రిమ మేధ

## 2న అధికారికంగా ప్రకటించనున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వం.. 2020 సంవత్సరాన్ని కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సంవత్సరంగా ప్రకటించనున్నది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ జనవరి 2న అధికారికంగా ఈ ప్రకటన చేస్తారని, ఈ కార్యక్రమానికి నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్, మీఐటీవై సంస్థ కార్యదర్శి ప్రకాశ్ సాహ్నీ హాజరవుతారని రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన ప్రోత్సాహకాలతోపాటు తెలంగాణ ఏఐ స్ట్రాటజీ ఫ్రేమ్‌వర్క్ డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు ఈ నెల 18న హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించామని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ఏఐ నిపుణుల సహకారంతో రూపొందించే ఈ డాక్యుమెంట్‌ను పలు దఫాల సంప్రదింపుల తర్వాత ఖరారుచేస్తామని జయేశ్‌రంజన్ వివరించారు. బ్లాక్‌చైన్ ఫ్రేమ్‌వర్క్ డాక్యుమెంట్, డ్రోన్ ఫ్రేమ్‌వర్క్ డాక్యుమెంట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఆచరణలోకి తీసుకొచ్చిందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డాటా ఎనలిటిక్స్ ద్వారా 2021 నాటికి దేశంలో 8 లక్షల ఉద్యోగాలను సృష్టించవచ్చని భావిస్తున్నామన్నారు. 2020లో తెలంగాణ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తుందని, దీన్ని నాస్కామ్ అమలుచేస్తుందని జయేశ్‌రంజన్ తెలిపారు.



# సమృద్ధిగా జలసిరులు

## కృష్ణా, గోదావరి బేసిన్ల ప్రాజెక్టుల్లో తగ్గని నీటినిల్వ

- నేటికీ తెలుగు రాష్ట్రాల పరిధిలో 650.42 టీఎంసీల నిల్వలు
- గతేడాది ఇదే సమయంలో కేవలం 362 టీఎంసీలే
- శ్రీశైలం, సాగర్‌లో ఎండీడీఎల్ ఎగువన అందుబాటులో 248 టీఎంసీలు
- వేసవిలోనూ మిషన్ భగీరథ, హైదరాబాద్‌కు తాగునీరు పుష్కలం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలోని ఆయకట్టుకు రెండుకార్ల (సీజన్లు)కు నీళ్లివ్వడం గతేడాది వరకు గగనంగా ఉండేది. కానీ, ఈ ఏడాది వానకాలం సీజన్ ముగిసి.. యాసంగి నాట్లు జోరుగా కొనసాగుతున్నప్పటికీ కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతూనే ఉన్నాయి. రెండు తెలుగురాష్ట్రాల్లో మంగళవారం వరకు ఉన్న నిల్వలను పరిశీలిస్తే రానున్న వేసవిలోనూ తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండబోదని తెలుస్తున్నది. ప్రధానంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన భారీఎత్తున నిల్వలు ఉండటం రెండురాష్ట్రాలకు అనుకూల పరిణామం. గతేడాది ఇదే సమయంలో ఉన్న నీటిమట్టంతో పోలిస్తే ఈసారి రెట్టింపు కంటే అధికంగా నిల్వ ఉన్నది. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో యాసంగి సీజన్ వచ్చినా ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల పరిధిలోనే కాకుండా ఎగువన కర్ణాటకలోనూ ఇదే జలశోభ కనిపిస్తున్నది. కృష్ణా, గోదావరి బేసిన్లలోని అన్ని ప్రాజెక్టుల నుంచి కాల్వల ద్వారా సాగునీటి విడుదల కొనసాగుతున్నది. తెలంగాణ, ఏపీ పరిధుల్లో కృష్ణా, గోదావరిపై 13 ప్రాజెక్టులు ఉండగా.. వీటి నీటినిల్వ సామర్థ్యం దాదాపు 805.02 టీఎంసీలు. మంగళవారం ఉదయంనాటికి కూడా అన్ని ప్రాజెక్టుల్లో 650.42 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. అంటే పూర్తిస్థాయి సామర్థ్యంలో సుమారు 81 శాతం నిల్వలు ఇప్పటికీ ఉండటం విశేషం. గతేడాది ఇదే సమయంలో కేవలం 361.92 టీఎంసీల నిల్వ (45శాతం) మాత్రమే ఉన్నది. కృష్ణాబేసిన్‌లో ఎగువన జూరాల నుంచి దిగువన ప్రకాశం బరాజ్ వరకు పూర్తిస్థాయి నిల్వసామర్థ్యం 586.36 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 483.17 టీఎంసీలు (82.40శాతం) నీటి నిల్వలు ఉన్నాయి. మంగళవారం కూడా శ్రీశైలం జలాశయానికి 9,861 క్యూసెక్కుల

మిగతా 3వ పేజీలో



ఓ కారు ముగిసినా కళకళలే!

# తెలంగాణను చూసి నేర్చుకుంటాం

## కేటీఆర్ శుభాకాంక్షల ట్వీట్‌కు జేఎంఎం నేత హేమంత్ సొరేన్ స్పందన

Hemant Soren @HemantSorenJMM
Thank you @KTRTRS ji. Looking forward to meet soon and learn from your amazing works in Telangana

KTR@KTRTRS
Delighted that JMM, the party & @HemantSoren JMM the leadership that fought for statehood for Jharkhand have been elected by people to lead Jharkhand again. Congratulation Hemant Ji

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణను చూసి నేర్చుకుంటామని జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్‌సొరేన్ పేర్కొన్నారు. జార్ఖండ్ ఎన్నికల్లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి విజయం నేపథ్యంలో హేమంత్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర మంత్రి కే తారకరామారావు ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఉద్యమానికి మద్దతు ఇచ్చిన తొలివ్యక్తి జేఎంఎం అధ్యక్షుడు శిబు సొరేన్ అని గుర్తుచేశారు. కేటీఆర్ ట్వీట్‌కు కృతజ్ఞతలు తెలిపిన హేమంత్. 'త్వరలోనే సీఎం కేసీఆర్‌ను, మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు, తెలంగాణలో జరుగుతున్న అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి నేర్చుకునేందుకు ఎదురుచూస్తున్నాను' అంటూ రీట్వీట్ చేశారు.

### జార్ఖండ్ సీఎంగా హేమంత్ సొరేన్

- 29న ప్రమాణ స్వీకారం
- జేఎంఎం శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన హేమంత్..
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన గవర్నర్

5



### 1.18 లక్షల కోట్లు

ఇదీ..ఈ ఏడాది పెరిగిన ముకేశ్ అంబానీ సంపద

రూ.4.33 లక్షల కోట్లకు చేరిక

బ్లూంబర్గ్ బిలియనీర్స్ సూచీ తాజా నివేదిక 9




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 100.00 | రిటైల్ లైవ్ | 122.00 |
| డ్రెస్డ్ | 177.00 | స్కిన్‌లెస్ | 201.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 435.00 | రంగారెడ్డి | 435.00 |
| మెదక్ | 435.00 | కరీంనగర్ | 438.00 |
| వరంగల్ | 438.00 | డజన్ ధర | 69.00 |

# మే 5 నుంచి 11 వరకు టీఎస్ ఎంసెట్

## మే 2న ఈసెట్.. 20, 21 తేదీల్లో ఐసెట్.. అన్నీ ఆన్‌లైన్‌లోనే

- పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు లేవు
- ప్రవేశాల్లో ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 10 శాతం రిజర్వేషన్
- ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశపరీక్షల తేదీలు ఖరారయ్యాయి. అన్ని పరీక్షలు మే నెలలోనే జరుగనున్నాయి. ప్రవేశ పరీక్షల తేదీలను మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి విడుదల చేశారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం టీఎస్ ఎంసెట్‌ను వచ్చే ఏడాది మే 5 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. ఇందులో ఇంజినీరింగ్ కోర్సులకు మే 5, 6, 7 తేదీల్లో, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు మే 9, 11 తేదీల్లో పరీక్షలను ఖరారుచేశారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ప్రవేశ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగనున్నాయి. టీఎస్ ఈసెట్, లాసెట్, ఎడ్‌సెట్, పీజీఈసెట్, పీఈసెట్ వంటి అన్ని రకాల ప్రవేశపరీక్షలు మే నెలలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని, జూలై నెలాఖరులోగా

మిగతా 2వ పేజీలో

# పోటీకి పిల్లల పేచీ లేదు!

## పిల్లలెందరున్నా పోటీచేయొచ్చు.. కొత్త చట్టం ప్రకారం నిబంధనలు సవరించిన ఎస్‌ఈసీ

### మున్సిపోల్స్‌కు వేగంగా ఏర్పాట్లు.. మున్సిపల్ కమిషనర్లతో ఎస్‌ఈసీ నాగిరెడ్డి వీడియో కాన్ఫరెన్స్.. వార్డుల విభజన అధికారం కలెక్టర్లదే

పోలింగ్‌కు సంబంధించిన అంశాలపై చర్చ.. 27న జిల్లా కలెక్టర్లు, 28న రాజకీయపక్షాలతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

త్వరలో జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఆశావహులకు ప్రధాన అడ్డంకి పోయింది. ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్నవారు పోటీచేయడానికి అనర్హులన్న నిబంధనను రాష్ట్ర ఎన్నికలసంఘం తొలిగించింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన మున్సిపల్ చట్టాన్ని అనుసరిస్తూ.. కొత్త చట్టం మేరకు ఎన్నికల నిబంధనల్లో మార్పులుచేశారు. దీని ప్రకారం ఎంతమంది పిల్లలున్నా.. మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేయడానికి అర్హత ఉంటుంది. 'ఇద్దరు పిల్లల' నిబంధన ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో వర్తించదని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి నేతృత్వంలో మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్, ముసాయిదా ఓటర్ల జాబి తా తయారీ, వార్డుల ఓటర్లు, ఫొటో ఓటర్ల జాబితా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రిటర్నింగ్ అధికారులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. దీంతో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఈ విషయంపై ఇచ్చిన హామీ నెరవేరినట్లయింది. కొత్త చట్టం రూపొందిస్తున్న సమయంలోనే మంత్రి కేటీఆర్ ఎన్నికల నిబంధనల్లోని సంతానం అంశంపై హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇద్దరు పిల్లలుంటే పోటీకి అనర్హులన్న నిబంధనను చట్టంలో తొలిగించారు. దీంతో జనవరిలో 120 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లలో జరుగుతున్న ఎన్నికల్లో పిల్లలెందరున్నా పోటీచేసేందుకు ఆశావహులకు అవకాశమేర్పడింది.

| | | |
|---|---|---|
| మున్సిపాలిటీలు | : | 120 |
| కార్పొరేషన్లు | : | 10 |
| ఓటర్లు | : | 79,92,234 |
| పోలింగ్ కేంద్రాలు | : | 8,056 |

**చకచకా ఏర్పాట్లు**

జనవరి ఎనిమిదో తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానున్న నేపథ్యంలో మొత్తం ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడానికి సన్నాహాలుచేస్తున్నారు. గతంతో పోలిస్తే మున్సిపాలిటీలు పెరుగటం, ఓటర్ల సంఖ్య కూడా రెండింతలు కావడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వార్డుల విభజన, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేసింది. షెడ్యూలు విడుదల కావడంతో ఆయా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో హడావుడి మొదలైంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో పలుమార్లు వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించిన ఎస్‌ఈసీ.. ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించింది. ఈ నెల 27న మరోసారి

మిగతా 2వ పేజీలో


## గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచానికి ప్రేమ, మానవత్వం నేర్పిన కరుణామయుడు జీసస్ అని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కొనియాడారు. జీసస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని.. ప్రేమ, విశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కరుణ, జాలికి ప్రతిరూపమైన జీసస్ ప్రపంచానికి ప్రేమానురాగాలను చాటిచెప్పారని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## 2 నుంచి పల్లె ప్రగతి-2

### జిల్లాలవారీగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె ప్రగతి' రెండో విడుత కార్యక్రమాన్ని జనవరి 2 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలవారీగా ఆదేశాలు జారీచేసింది. పల్లె ప్రగతి-2లో భాగంగా జనవరి 2న నిర్వహించే గ్రామసభల్లో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నారు. 3న గ్రామపంచాయతీ పరిధిలో నాటిన మొక్కలను పరిశీలించి.. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవాటిని నాటుతారు. 4న అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు, మార్కెట్లను శుభ్రం చేస్తారు. 5న గ్రామస్థులంతా శ్రమదానంతో వీధులు శుభ్రపరిచి ప్లాస్టిక్, వ్యర్థపదార్థాలను ఏరివేస్తారు. 6న మహిళలు, స్వయంశక్తి గ్రూపుల ఆధ్వర్యంలో, 7న ట్రాక్టర్, జేసీబీ యజమానుల ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించి రోడ్లపక్కనున్న పిచ్చిమొక్కలు, చెత్త, పెంటకుప్పలు తొలిగించడంతోపాటు తొలివిడుత పల్లె ప్రగతిలో గుర్తించిన బావులను పూడ్చివేస్తారు. 8, 9, 10 తేదీల్లో చికెన్‌సెంటర్లు, స్లాటర్‌హౌస్‌లను శుభ్రంచేయడంతోపాటు శిథిలమైన గృహాలను తొలిగిస్తారు. జనవరి 11న అన్ని వీధులను శుభ్రంచేసి గ్రామసభలు నిర్వహిస్తారు.

## కరీంనగర్-సిర్పూర్‌టౌన్ రైలు నేటినుంచి రద్దు

### కాజీపేట-బల్లార్షా ప్యాసింజర్ పాక్షికం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రతా పనుల నిర్వహణ కారణంగా కరీంనగర్- సిర్పూర్‌టౌన్ డెమూ రైలును బుధవారం నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు రద్దుచేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. దీంతోపాటు కాజీపేట-బల్లార్షా ప్యాసింజర్ రైలును మార్చి 31 వరకు పాక్షికంగా రద్దుచేస్తున్నట్టు తెలిపింది. ప్రయాణికులు మార్పులను గమనించాలని కోరింది.



## గణతంత్ర పరేడ్‌లో తెలంగాణ శకటం

- లిఖితపూర్వకంగా ధ్రువీకరించిన రక్షణశాఖ
- సంస్కృతి ఉట్టిపడేలా శకటం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో నిర్వహించే పరేడ్‌కు తెలంగాణ రాష్ట్ర శకటం ఎంపికయ్యింది. ఈ విషయాన్ని రక్షణశాఖ లిఖితపూర్వకంగా ధ్రువీకరిస్తూ, శకటం తయారీపై పలు సూచనలు చేసిందని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శకటాన్ని తొలిసారిగా 2015 రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రదర్శించగా మళ్లీ ఈ ఏడాది అవకాశం లభించిందని, ఎంపిక ప్రక్రియలో మంత్రి కే తారకరామారావు ఇచ్చిన సూచనలు చాలా ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌తోపాటు సమాచార, ప్రజాసంబంధాల ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ శకటాన్ని వారసత్వ సంపద, సంస్కృతి ఉట్టిపడేలా రూపొందించనున్నారు.

## అసిస్టెంట్ రిజిస్ట్రార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నియామకాలు

ఈ నెల 30 నుంచి జనవరి 20 వరకు దరఖాస్తులు ఆహ్వానించిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ మంగళవారం ప్రకటించింది. ఈ నెల 30 నుంచి జనవరి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నామని, మరిన్ని వివరాలకు టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నది.

## 30న హెల్త్ అసిస్టెంట్లకు ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పురపాలక పరిపాలన- పట్టణాభివృద్ధిశాఖలో హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు మూడో విడుత ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ మంగళవారం ప్రకటించింది. అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు నాంపల్లిలోని ప్రతిభాభవన్‌కు రావాలని, వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్, సంబంధిత పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

### ముహూర్తం

సూర్యోదయం: 6.46 గంటలకు

సూర్యాస్తమయం: 5.40 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం చతుర్దశి ఉదయం 11.18 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: జ్యేష్ఠ సాయంత్రం 4.41 వరకు, తదుపరి మూల, అమృతఘడియలు: ఉదయం 8.00 నుంచి 9.35 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.13 నుంచి 1.35 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.51 నుంచి మధ్యాహ్నం 12.35 వరకు, వర్జ్యం: అర్ధరాత్రి 12.45 నుంచి 2.21 వరకు.

### లోకం పోకడ




# ప్లాంటిక్స్‌యాప్ @ కోటి

- శాస్త్ర, సాంకేతిక వినియోగంతో వ్యవసాయం కొత్తపుంతలు
- సలహాలు, సూచనలతో అభివృద్ధిపథంలో రైతులు
- ఒక్క ఇమేజ్‌తో పంట చివరిదాకా పూర్తిసమాచారం






హైదరాబాద్, నమస్తేతెలంగాణ:

వ్యవసాయపరిశోధన, శాస్త్రసాంకేతికపరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్నది. వ్యవసాయం, అనుబంధరంగాల్లో మొబైల్ టెక్నాలజీ ప్రాధాన్యం సంతరించుకుంటున్నది. ఇక్రిశాట్, ఐసీఏఆర్‌వంటి సంస్థలు ఈ సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. వాతావరణమార్పుల నేపథ్యంలో పెట్టుబడివ్యయం పెరగడం.. పంటసాగులో చీడపీడలు, తెగుళ్లు ఉధృతమవడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జర్మనీ సాంకేతికపరిజ్ఞానంతో ప్లాంటిక్స్ యాప్‌ను ఆవిష్కరించింది. పంటలసాగులో సలహాలు, సూచనలు అందిస్తున్న ఈ యాప్ అతికొద్దికాలంలోనే రైతుల ఆదరణ చూరగొన్నది. 2015లో జర్మనీలోని బెర్లిన్‌లో పీట్‌జీఎంబీహెచ్ సంస్థకు వచ్చిన ఒక వినూత్న ఆలోచన మొగ్గ తొడిగింది. అది కార్యరూపం దాల్చి వ్యవసాయరంగంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమార్గం చూపేలా ఇక్రిశాట్ ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ రూపాంతర శ్రీకాంత్ సహకారంతో ప్లాంటిక్స్ యాప్స్‌ను రూపొందించారు. 2017 అమరావతి వేదికగా ఈ యాప్‌ను ఆవిష్కరించగా.. ఆంగ్లం, హిందీ, స్పానిష్, అరబిక్, పోర్చుగీస్, జర్మనీ తదితర భాషలు, భారత్‌లో తెలుగుతోసహా 10 ప్రాంతీయభాషల్లో రైతులకు ఈ యాప్ సేవలందిస్తున్నది. రెండేండ్ల వ్యవధిలోనే కోటిమంది రైతులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. నెలకు 12 లక్షల మంది దీనిసేవలను వినియోగించుకుంటున్నారు. బెర్లిన్‌లో 13 మందితో ప్రారంభమైన ప్లాంటిక్స్‌యాప్ నిర్వహణలో ఇప్పుడు 120మందికి పైగా శాస్త్రవేత్తలు సేవలందిస్తూ.. ఎప్పటికప్పుడు కొత్తదనం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. సెల్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్లు వినియోగించుకుని కుగ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతులు కూడా అభివృద్ధి చెందాలనేది ప్లాంటిక్స్ లక్ష్యమని డాక్టర్ రూపాంతర శ్రీకాంత్ తెలిపారు. యాప్‌ను ఆవిష్కరించిన కొత్తలో రైతులకు అవగాహనలేకపోవడంతో వందలసంఖ్యలోనే డౌన్‌లోడ్ చేసుకోగా.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 10 మిలియన్ల మందికిపైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. తెలంగాణ, ఏపీరాష్ట్రాల్లో 4.5 లక్షల మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్ వ్యవసాయాధికారులకు అన్నిపంటలపై పూర్తి అవగాహన ఉండదని, ఈ యాప్‌ద్వారా అవసరమైన సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకోవచ్చని డాక్టర్ రూపాంతర శ్రీకాంత్ తెలిపారు. ఇది అటు రైతులకు, ఇటు అధికారులకు గైడ్‌లా ఉపయోగపడుతున్నదన్నారు.

### చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగం

వ్యవసాయ అనుబంధయాప్‌లతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగం. ప్లాంటిక్స్‌లో ఎన్నో విశిష్టతలున్నాయి. రసాయనిక సాగుచేస్తున్న లేదా సేంద్రియ విధానంలో పంటలు పండిస్తున్న రైతులకు అవసరమైన పరిష్కారాలు ఈ యాప్‌లో దొరుకుతాయి. వేరుకుళ్లు తెగులు, సాగులో బయోలాజికల్ ప్రాక్టిస్‌కు సంబంధించిన విషయాల్లో సరైన సలహాలు అందుతాయి. యాప్ ద్వారా అందుతున్నసేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు తెలియని విషయాలు తెలుసుకోవచ్చు. నిరక్షరాస్యులైన రైతులకు యాప్‌లపై అవగాహన కల్పించేందుకు యువత ముందుకురావాలి.

**- పురుషోత్తమరావు, ఆదర్శ సేంద్రియ రైతు**

### అవసరమైన మేరకే సమాచారం

రైతు ఏ పంట వేస్తున్నారు? ఎప్పుడు వేస్తున్నారు? అనేది ఒక ఇమేజ్ డౌన్‌లోడ్ చేస్తే చాలు పంటకాలం మొత్తంలో ఏ సమయంలో ఏఏ యాజమాన్య పద్ధతులు పాటించాలనేది యాప్ సూచిస్తుంది. శాస్త్రవేత్తల సూచనల ప్రకారం పంటసాగు చేస్తున్నారా? లేదా? అనేది కూడా పరిశీలిస్తుంది. గతంలో సీఎస్ఐఆర్ కూడా వ్యవసాయ సమాచారం రైతులకు అందించేది. కానీ, అందరికీ అన్నిరకాల సమాచారం ఇవ్వడంతో రైతులు చాలా నష్టపోయారు. వరి రైతుకు గతంలో వారానికి ఐసీటీ ద్వారా 28 మెసేజ్‌లు రావడం పెద్ద వైఫల్యంగా చెప్పవచ్చు. దీంతో రైతు మెసేజ్‌లు చూడటమే మానేశారు. కానీ, ప్లాంటిక్స్‌యాప్ ద్వారా రైతుకు అవసరమైన పంటకు సంబంధించిన సమాచారం మాత్రమే లభిస్తుంది. క్రిమికీటకాలు, చీడపీడల పర్యవేక్షణ, పోషకాహారలోపాలు, ప్రకృతి వైపరీత్యాల బారినపడి దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనావేయడం, సెన్సింగ్, పునరుద్ధరణ వంటి అంశాల్లో ప్రభుత్వం, ప్రైవేటుభాగస్వామ్యంతో ప్లాంటిక్స్ పనిచేస్తుంది. ఆహార, పౌష్టికాహార భద్రత సవాల్‌గా మారడం, పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతింటున్న తరుణంలో ఎన్నోసమస్యలు సవాళ్ల పరిష్కారానికి కృత్రిమ మేథస్సు వరంగా మారింది. దేశంలో, ప్రత్యేకించి తెలుగురాష్ట్రాల రైతులకు ప్లాంటిక్స్‌యాప్ గొప్ప వరమని ఇక్రిశాట్ శాస్త్రవేత్త శ్రీకాంత్ తెలిపారు. ప్రతిరోజూ 75 వేల మంది రైతులు 8 భాషల్లో మెసేజ్‌లు పంపుతున్నారని.. వారికి క్షణాల్లో సమాధానాలు లభిస్తున్నాయన్నారు. ప్లాంటిక్స్ అందిస్తున్న సేవలను ప్రధాని మోదీ అభినందించారని చెప్పారు. యాప్‌ద్వారా 120 రకాల పంటలకు సంబంధించి పరిశీలించవచ్చని తెలిపారు.

# మే 5 నుంచి టీఎస్ ఎంసెట్


మొదటిపేజీ తరువాయి...


అన్ని కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ముగించేలా షెడ్యూల్ రూపొందించామని విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం.. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూఎస్) విద్యార్థులకు ప్రవేశాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించే విధానాన్ని వచ్చే విద్యాసంవత్సరం నుంచి తప్పనిసరిగా అమలుపరుస్తామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకున్నదని తెలిపారు.

### జేఎన్టీయూహెచ్‌కే ఎంసెట్, ఈసెట్ నిర్వహణ బాధ్యత

పరీక్షల నిర్వహణ బాధ్యతలు గతంలో ఏ వర్సిటీలకు అప్పగించామో.. ఈసారి కూడా వాటికే అప్పగించినట్టు చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. టీఎస్‌ఎంసెట్, టీఎస్ ఈసెట్ బాధ్యతలు జేఎన్టీయూహెచ్‌కు, టీఎస్ పీఈసెట్ బాధ్యతలు మహాత్మాగాంధీ యూనివర్సిటీకి, టీఎస్ ఐసెట్ బాధ్యతలు కాకతీయ యూనివర్సిటీకి, టీఎస్ ఎడ్‌సెట్, టీఎస్ లాసెట్, టీఎస్ పీజీలాసెట్‌తోపాటు టీఎస్ పీజీఈసెట్ బాధ్యతలు ఉస్మానియా యూనివర్సిటీకి ఇచ్చినట్టు పేర్కొన్నారు.

### త్వరలోనే కన్వీనర్ల నియామకం

సెట్ కన్వీనర్ల నియామకం పూర్తికాలేదని, అందుకు ఇంకా సమయం ఉన్నదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కన్వీనర్ల పేర్లను పంపించాల్సిందిగా ఆయా వర్సిటీలకు విద్యామండలి నుంచి లేఖలు రాస్తామని చెప్పారు. యూనివర్సిటీ వీసీ ప్రతిపాదించినవారిని కన్వీనర్లుగా నియమిస్తూ విద్యామండలి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ సంక్రాంతి పండుగ తర్వాత ఉంటుందని ఆయన వెల్లడించారు.

**2020-21 ప్రవేశపరీక్షల తేదీల వివరాలు**

| టీఎస్ సెట్స్ | యూనివర్సిటీ | తేదీలు |
|---|---|---|
| ఈసెట్ | జేఎన్టీయూహెచ్ | మే 2, 2020 |
| ఎంసెట్ (ఇంజినీరింగ్ ) | జేఎన్టీయూహెచ్ | మే 5-7, 2020 |
| (అగ్రికల్చర్, ఫార్మసీ) | | మే 9, 11, 2020 |
| పీఈసెట్ | మహాత్మాగాంధీ వర్సిటీ | మే 13, 2020 |
| ఐసెట్ | కాకతీయ యూనివర్సిటీ | మే 20, 21, 2020 |
| ఎడ్‌సెట్ | ఉస్మానియా యూనివర్సిటీ | మే 23, 2020 |
| లాసెట్ | ఉస్మానియా యూనివర్సిటీ | మే 25, 2020 |
| పీజీలాసెట్ | ఉస్మానియా యూనివర్సిటీ | మే 25, 2020 |
| పీజీఈసెట్ | ఉస్మానియా యూనివర్సిటీ | మే 27-30, 2020 |




టీఎస్‌ఎంసెట్, ఇతర ప్రవేశపరీక్షల తేదీల వివరాలను ప్రకటిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి



వెదురు సాగుపై అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్. చిత్రంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పారిశ్రామికవేత్త మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడా ఉన్నారు.

## కలపకు ప్రత్యామ్నాయం వెదురు

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమీప భవిష్యత్‌లో కలప దొరకడం కష్టతరంగా మారనున్నందున వెదురు సాగుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ తెలిపారు. వెదురుసాగుపై విస్తృతంగా చర్చించేందుకు త్వరలో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. వెదురుసాగు కోసం మంగళవారం నాంపల్లిలోని హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఎదురయ్యే కలప కొరతకు వెదురు ఉత్పత్తి ఒక్కటే పరిష్కారన్నారు. రాష్ట్రంలో వెదురుసాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం వెదురు సాగవుతున్న పరిస్థితులు, భవిష్యత్‌లో వెదురు సాగుకు ఉన్న అనుకూల అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, పారిశ్రామికవేత్త మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కెనడాకు చెందిన సుధీర్ కోదాటి, ఆస్కి డైరెక్టర్ అచలేందర్‌రెడ్డి, అమెరికాకు చెందిన శ్రీనివాస్ గోగినేని, నేషనల్ బంబూ మిషన్ ప్రతినిధులు వినోద్‌కుమార్‌తో భేటీ అయ్యారు.

# పటిష్ఠ చట్టాలతోనే అన్యాయాలకు చెక్

- మోసాలకు పాల్పడే వ్యాపారులపై కఠినచర్యలు
- వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పటిష్ఠ చట్టాలతోనే వ్యాపారుల అక్రమాలకు, అన్యాయాలకు అడ్డుకట్టవేయడం సాధ్యమవుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మోసాలకు పాల్పడే వ్యాపారులపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్నదని చెప్పారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కమలాకర్ మాట్లాడుతూ.. హక్కులు, బాధ్యతల పట్ల వినియోగదారుల్లో చైతన్యం పెరిగినప్పుడే మోసాలకు త్వరితగతిన అడ్డకట్టవేయడం సులువవుతుందనే విషయాన్ని విస్మరించకూడదన్నారు. వినియోగదారులకు మరింత రక్షణ కల్పించేందుకు కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని, ఆన్‌లైన్ అమ్మకాలు, టెలీషాపింగ్, మల్టీ లెవల్ మార్కెటింగ్ లాంటివన్నీ ఈ చట్టం పరిధిలోకి వస్తాయని తెలిపారు. వినియోగదారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రముఖ రచయిత బండి సత్యం రాసిన పాటను మంత్రి కమలాకర్ ఈ సందర్భంగా ఆవిష్కరించాచు.

### వినియోగదారులకు అండగా చట్టాలు

వినియోగదారులు మోసాలకు గురికాకుండా ఉండేలా అనేక హక్కులు, చట్టాలు ఉన్నాయని, వీటి గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పౌరసరఫరాల కమిషనర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. వినియోగదారుల వివాదాల పరిష్కార వేదికలు అతితక్కువ ఖర్చుతో సత్వర న్యాయాన్ని పొందే వీలుకల్పిస్తున్నాయని, పౌరసరఫరాల భవన్‌లోని వినియోగదారుల వ్యవహారాల విభాగమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు.

### వస్తు, సేవల విలువను బట్టి ఫిర్యాదులు..

తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల, పరిష్కారాల కమిషన్ ప్రెసిడెంట్ జస్టిస్ ఎమ్మెస్కే జైస్వాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కేంద్రంలో ఇప్పటివరకు 6,955 కేసులు నమోదయ్యాయని, వీటిలో 3,813 కేసులను పరిష్కరించామని తెలిపారు. జిల్లా ఫోరాల్లో 96,502 కేసులకుగాను 91309 కేసులు పరిష్కరించామన్నారు. వస్తువు లేదా సేవ విలువ రూ.కోటిలోపు ఉంటే జిల్లా ఫోరంలో, రూ.10 కోట్ల వరకు ఉంటే రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కేంద్రంలో, రూ.10 కోట్లు దాటితే జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేయాలని వివరించారు.

### రవీంద్రభారతిలో..

వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతి సమావేశ మందిరంలో మరో కార్యక్రమం జరిగింది. 'ఎటర్నింగ్ పాయింట్ ఫర్ ఇండియన్ కన్జ్యూమర్ -కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019' థీమ్‌తో నల్సార్ యూనివర్సిటీ కన్జ్యూమర్ లా చైర్, తెలంగాణ వినియోగదారుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు రాష్ట్ర వినియోగదారుల వివాదాల, పరిష్కారాల కమిషన్ ప్రెసిడెంట్ జస్టిస్ ఎమ్మెస్కే జైస్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎం విజయ్‌కుమార్, బాలలింగయ్య రూపొందించిన 'వినియోగదారుల రక్షణ' (హక్కులు-బాధ్యతలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.




జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల

## పోటీకి పిల్లలపేచీ లేదు


మొదటిపేజీ తరువాయి...


జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహిస్తామని నాగిరెడ్డి ప్రకటించారు. 28న అన్ని రాజకీయ పక్షాలతో భేటీ అవుతామన్నారు. ఎన్నికల అధికారులకు పలు దఫాలుగా శిక్షణ ఇచ్చామని.. జనవరి 1, 2019 ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకొని ఒక్కో పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్ల చొప్పున ఉండేలా జాబితా సిద్ధంచేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

### వార్డుల విభజన బాధ్యత కలెక్టర్లదే

రిజర్వేషన్ల ఖరారు అంశంలోనూ రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటరు జాబితా తయారుచేసిన తర్వాత వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్లు చేపట్టాలని సూచించింది. మున్సిపాలిటీలవారీగా వార్డుల రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారుచేసి ప్రకటించాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్ల రిజర్వేషన్లను రాష్ట్రస్థాయిలో చేపట్టాలని సూచించారు. జిల్లాల నుంచి జాబితా అందిన తర్వాత సీడీఎంఏలో చైర్మన్లు, మేయర్ల రిజర్వేషన్లు పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు.

### 79 లక్షల మంది ఓటర్లు

రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 120 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్ల పరిధిలో 79,92,434 మంది ఓటర్లున్నట్లు అధికారులు తెలిపారు. వీరికోసం 8,056 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాల అనుసంధానం సైతం పూర్తయినట్లు చెప్పన్నారు. రాష్ట్రంలోని జహీరాబాద్, మణుగూరు, పాల్వంచ, మందమర్రి, సిద్దిపేట, అచ్చంపేట, నకిరేకల్, బాదేపల్లి మున్సిపాలిటీలకు ప్రస్తుతం ఎన్నికలు జరుగటం లేదు. వరంగల్, హైదరాబాద్, ఖమ్మం గ్రేటర్లకు కూడా పదవీకాలం ఉండటంతో ఎన్నికలు నిర్వహించడం లేదని ఎస్ఈసీ వివరించింది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలతోనే ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చినందున మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నాగిరెడ్డి ఆదేశించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా అధికారులు రాజకీయ కార్యక్రమాలకు వెళ్లరాదని సూచించారు. కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వం తరుపున ఎలాంటి బ్యానర్లు పెట్టవద్దన్నారు.

### పోలీస్‌శాఖ సన్నద్ధం

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల నిర్వహణకు పోలీస్‌శాఖ సన్నద్ధమవుతున్నది. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేలా శాంతిభద్రతల అంశాలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది. ఆయా జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో సున్నితమైన ప్రాంతాలు గుర్తించడం, అవసరమైన బందోబస్తు ప్రణాళికలు తయారు చేసుకోవడంపైనా కసరత్తు ప్రారంభించినట్టు శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్ తెలిపారు.

## బాబును మరోసారి నమ్మితే అమాయకత్వమే

ఎంపీ విజయసాయిరెడ్డి ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానుల విధానంపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతోపాటు ఆ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలకు వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ట్వీట్ చేశారు. 'తూళ్లూరు రైతులు ఇంకోసారి చంద్రబాబును నమ్మితే అంతకంటే అమాయకత్వం ఉండదు. తన బంధువర్గాల రియల్‌ఎస్టేట్ వ్యాపారాల కోసం ఒకసారి వారిని ఫణంగా పెట్టాడు. మళ్లీ వారినే అడ్డం పెట్టుకుని డ్రామాలు ఆడిస్తున్నాడు. ఎవరికీ అన్యాయం జరగదు. బాబును దూరం పెడితే అన్నీ పరిష్కారమవుతాయి. రాజధాని మౌలిక సదుపాయాల పేరుతో రూ.1.09 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి తన బంధువులు, బినామీల భూముల ధరలు పెంచాలని చంద్రబాబు స్కెచ్ వేశాడు. అలా జరిగి ఉంటే వాటి విలువ 6-7 లక్షల కోట్లకు చేరేది. వికేంద్రీకరణతో ప్లాన్లన్నీ బెడిసికొట్టాయని సామూహిక శోకాలు పెడుతున్నారు' అని విజయసాయిరెడ్డి ట్విట్టర్‌లో విమర్శలుచేశారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో చలి కాగుతున్న వలస కూలీలు

## 48 గంటల్లో ఓ మోస్తరు వానలు

- తెలంగాణపై ఉపరితల ద్రోణి ప్రభావం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కోమోరిన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్రమట్టానికి 2.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందని, దాని ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే 48 గంటల్లో ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలో కూడా తేలికపాటి వానలు పడవచ్చని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, ఈశాన్య దిశల నుంచి కూడా శీతల గాలులు వీస్తున్నాయి.

## 4న హజ్ యాత్రికుల డ్రా

- హజ్‌కమిటీ చైర్మన్ మసి ఉల్లాఖాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హజ్‌యాత్ర-2020కి సంబంధించిన డ్రా ప్రక్రియ జనవరి 4న నిర్వహించనున్నట్టు హజ్‌కమిటీ చైర్మన్ మహ్మద్ మసి ఉల్లాఖాన్ పేర్కొన్నారు. మంగళవారం హజ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ పరిధిలోని 6,421 దరఖాస్తులతో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా 10,613 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హోంమంత్రి మహమూద్ అలీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో డ్రా ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో హజ్ కమిటీ సభ్యులు అబు తల్హా అమ్జద్, మహ్మద్ అబ్దుల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



# పౌరసేవలు భేష్

- మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో పట్టణాల్లో ఆన్‌లైన్ సేవలు
- కలెక్టర్ల పర్యవేక్షణలో సిబ్బందిలో పెరిగిన జవాబుదారీతనం
- అనుమతుల మంజూరులో పెరిగిన వేగం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలోని పట్టణాల్లో అధికార వికేంద్రీకరణ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో జిల్లాలు పెద్దగా ఉన్నప్పుడు పట్టణవాసులకు పౌరసేవలు ఆశించినంత స్థాయిలో లభించేవికావు. ఈ వాస్తవిక సమస్యను గుర్తించిన సీఎం కేసీఆర్.. జిల్లాల సంఖ్యను 33కి పెంచడంతో మున్సిపాల్టీల అభివృద్ధిపై కలెక్టర్లు దృష్టిసారిస్తున్నారు. కలెక్టర్లతోపాటు, మున్సిపల్ కమిషనర్లతో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఎప్పటికప్పుడు సమావేశాలను నిర్వహించి వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. పౌరసేవలను ఆన్‌లైన్‌లో అందజేసే ప్రక్రియను వేగవంతంచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పురపాలక సిబ్బందికి సూచిస్తున్నారు. ఏ సమస్యనైనా తక్షణమే పరిష్కరించడంతోపాటు మున్సిపల్ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులొచ్చినా అండగా ఉంటానని మంత్రి కేటీఆర్ భరోసా నింపుతున్నారు. ఫలితంగా మున్సిపాల్టీల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణ పెరుగడంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. గతంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ ఆలస్యమయ్యేది. ప్రజలు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సివచ్చేది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది నిర్దేశిత గడువులోపే ఆన్‌లైన్‌లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీచేయడాన్ని అలవర్చుకున్నారు.

### వేగంగా అనుమతులు

పట్టణాల్లో భవననిర్మాణాలకు అనుమతులు లభించడం గతంలో ప్రహసనంగా ఉండేది. ప్రస్తుతం ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కలెక్టర్లు క్రమంతప్పకుండా మున్సిపల్ కార్యాలయాలను సందర్శిస్తుండటంతో పురపాలక సిబ్బందిలో జవాబుదారీతనం పెరిగింది. దీంతో పౌరసేవలు మెరుగ్గా లభిస్తున్నాయి. శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులకు స్థలాలు సులభంగా దొరుకుతున్నాయి. పారిశుద్ధ్య వాహనాల కొనుగోలు కూడా సులువవడంతో అధిక శాతం పట్టణాల్లో శానిటేషన్ మెరుగైంది. కొత్త మున్సిపాల్టీల్లో ఎల్‌ఈడీ బల్బులు అమర్చే ప్రక్రియ వేగవంతమైంది.

# పురపోరులో సత్తాచాటుతాం

- అభివృద్ధిని చూసి ప్రజలు టీఆర్‌ఎస్‌కే ఓట్లేస్తారు
- జుక్కల్ అభివృద్ధికి రూ. 250 కోట్లు ఖర్చు
- కామారెడ్డి జిల్లా పర్యటనలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- పల్లె ప్రగతి రెండో విడతపై అవగాహన సదస్సుకు హాజరు



గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, విప్ గంప గోవర్ధన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జనవరిలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి గెలుపు నల్లేరు మీద నడకేనని రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పురపాలక సంఘాల్లో అభివృద్ధి జరిగిందని.. కండ్లముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసే ప్రజలు టీఆర్‌ఎస్‌కు ఓట్లేస్తారని చెప్పారు. మంగళవారం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో పర్యటించిన మంత్రి.. లింబూర్ నుంచి పోతంగల్, కుర్లా గ్రామాలకు రూ.28కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం గడిచిన ఐదేండ్లలో రూ.250 కోట్ల వరకు ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. రహదారి విస్తరణ పనులకు రూ.28 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. భిక్కనూర్ మండలం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం జరిగిన పల్లెప్రగతి రెండో విడత కార్యక్రమం అవగాహన సదస్సుకు మంత్రి హాజరయ్యారు. సమావేశానికి ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ, ముగ్గురు డీఈలు గైర్హాజరు కావడంపై మంత్రి తీవ్రంగా స్పందించి మెమోలు జారీచేయాలంటూ జేసీ యాదిరెడ్డిని ఆదేశించారు. కొనుగోలుచేసిన ట్రాక్టర్లను పలు గ్రామ పంచాయతీలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో కలిసి మంత్రి ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్, ఎంపీ బీబీపాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీఎం కేసీఆర్‌తో మైనార్టీ నేతల భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును బుధవారం నాడు ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీతోపాటు ఆలిండియా ముస్లిం యాక్షన్ కమిటీ ప్రతినిధులు కలువనున్నారు. దేశవ్యాప్త ఆందోళనలకు కారణమైన పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌పై ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

## ఎన్‌కౌంటర్ మృతుల రీపోస్ట్‌మార్టంపై హైకోర్టుకు ఎయిమ్స్ ప్రాథమిక నివేదిక

- వారంరోజుల్లో పూర్తిస్థాయి రిపోర్ట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిశ కేసు నిందితుల మృతదేహాలకు రీపోస్ట్‌మార్టం నిర్వహించిన ఎయిమ్స్ నిపుణుల బృందం హైకోర్టుకు మంగళవారం ప్రాథమిక నివేదికను సమర్పించింది. దీనితోపాటు పోస్ట్‌మార్టం సందర్భంగా చిత్రీకరించిన వీడియో సీడీని కూడా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు అందజేసింది. రీపోస్ట్‌మార్టం నిర్వహించి, ఒక్కొక్క మృతదేహానికి సంబంధించిన ఆధారాలపై విడివిడిగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నలుగురు సభ్యుల ఫోరెన్సిక్ నిపుణుల బృందం సోమవారం మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులు మృతదేహాలకు రీపోస్ట్‌మార్టం నిర్వహించిన విషయం తెలిసిందే. అన్ని కోణాల్లో వివరాలు సేకరించిన బృందం.. ప్రస్తుతానికి ప్రాథమిక నివేదికను మాత్రమే అందజేసింది. ఎయిమ్స్ నిపుణుల బృందం ఢిల్లీ వెళ్లిన తర్వాత పూర్తిస్థాయి నివేదికను రూపొందించి, వారంరోజుల్లోగా హైకోర్టుకు సమర్పించనున్నట్టు తెలుస్తున్నది.

# ఎన్నికలంటేనే కాంగ్రెస్ వెన్నులో వణుకు

- కోర్టును ఆశ్రయిస్తామనడం ఉత్తమ్ దివాలాకోరుతనానికి నిదర్శనం
- ఉత్తమ్ నాయకత్వంలో గాంధీభవన్‌కు తాళం ఖాయం
- అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో గులాబీ జెండా రెపరెపలు
- ఉత్తమ్ వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ఎంఎస్ ప్రభాకర్, శంభీపూర్ రాజు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ వెన్నులో వణుకు పుడుతున్నదని శాసనమండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ ఎద్దేవాచేశారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘనవిజయం సొంతం చేసుకోవడం ఖాయమన్నారు. మంగళవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో విప్ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలకు ముందే పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులెత్తేసి పలాయనం చిత్తగిస్తున్నారన్నారు. యుద్ధానికి ముందే అస్త్రసన్యాసం చేసిన ఉత్తమ్ తీరు వల్ల కాంగ్రెస్ కార్యకర్తలే ఆగ్రహంతో ఆయన వెంట పడతారని చెప్పారు. కాంగ్రెస్ ఓటమిని ముందే అంగీకరించినందున ఆ పార్టీ బీ-ఫారాలు తీసుకోవడానికి కూడా ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదని, ఉత్తమ్ నాయకత్వంలో గాంధీభవన్‌కు తాళం పడటం తథ్యమని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై ఉత్తమ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఎన్నికలపై కోర్టుకు వెళ్తామనడం ఆయన దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడుగానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోగానీ ఎన్నికల నోటిఫికేషన్లు కాంగ్రెస్ పెద్దల ప్రోద్బలంతోనే జారీఅయ్యాయా అని ప్రశ్నించారు. ప్రజలు ఏకపక్షంగా టీఆర్‌ఎస్ వైపే ఉండటం వల్ల అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలువదన్న నిర్ణయానికి వచ్చిన ఆ పార్టీ నేతలు అడ్డదిడ్డమైన వాదనలను తెరపైకి తెస్తూ ఎన్నికల ప్రక్రియ జరుగకుండా అడ్డుకొనే యోచనలో ఉన్నారని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కూడా హుజూర్‌నగర్ సీటును గెలిపించుకోలేకపోయారని ఎద్దేవాచేశారు. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో టీఆర్‌ఎస్ జెండా రెపరెపలాడటం ఖాయమన్నారు.

### విజన్‌లేని కాంగ్రెస్ పార్టీ: ఎంఎస్ ప్రభాకర్

కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం, విజన్ లేదని మండలిలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్ విమర్శించారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని, హెచ్చార్సీ చైర్మన్‌గా దళితుడైన జస్టిస్ చంద్రయ్యను నియమించడం గొప్ప విషయమని, అందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

## నటి అనసూయకు జీఎస్టీ తాఖీదులు

- రూ.55 లక్షల సేవాపన్ను బకాయి పడ్డ నటి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సేవాపన్ను ఎగవేస్తున్న సినీతారలు, టీవీ యాంకర్లు, నటులపై కేంద్ర జీఎస్టీ అధికారులు గురిపెట్టారు. తాజాగా టీవీ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్‌కు తాఖీదులు జారీచేశారు. ఆమె సర్వీస్‌ట్యాక్స్ బకాయి రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉన్నదని జీఎస్టీ అధికారులు తెలిపారు. అనసూయ మొత్తం రూ.80 లక్షల రూపాయల సేవా పన్ను చెల్లించాల్సి ఉండగా కేవలం 25లక్షల రూపాయలు మాత్రమే చెల్లించారని జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ అదనపు డైరెక్టర్ జనరల్ బాలాజీ మంజుందార్ తెలిపారు. అనసూయ గతంలో 35 లక్షల సర్వీస్ ట్యాక్స్ బకాయి ఉన్నారు. సకాలంలో చెల్లించని కారణంగా వడ్డీ 15 లక్షల రూపాయలు పెరిగింది.



శరీరంలోని అంతర్గత అవయవాల గురించి విద్యార్థులకు మెరుగైన అవగాహన కల్పించడానికి స్పెయిన్‌కి చెందిన వెరోనికా డూక్ అనే టీచర్ చేసిన వినూత్న ప్రయోగం ఇది. అవయవాలు ముద్రించిన బాడీసూట్ ధరించి ఆమె విద్యార్థులకు బోధించారు.

# మళ్లీ రోడ్డుపైకి ఎర్రబస్సులు

- సరుకు రవాణాకు సిద్ధంచేస్తున్న టీఎస్‌ఆర్టీసీ
- మియాపూర్ బీబీయూలో తయారవుతున్న డీజీటీలు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రతి డిపోకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్





మియాపూర్ బాడీ బిల్డింగ్ యునిట్‌లో సిద్ధంగా ఉన్న ఆర్టీసీ మోడల్ కార్గో

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రజలు ఎన్నడో మరిచిపోయిన ఎర్రబస్సు మళ్లీ రోడ్డెక్కనున్నది. ఉమ్మడి రాష్ట్రంలో రంగులు మార్చి ఎర్రబస్సును మాయంచేసిన అధికారులు.. ఇప్పుడు అదే బస్సును సరుకు రవాణాకు అనుగుణంగా డిజైన్ చేస్తున్నారు. ఎరుపురంగులో ఉండే డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ (డీజీటీ) సర్వీసులు జనవరి మొదటి వారం నుంచి అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని మియాపూర్ బాడీబిల్డింగ్ యూనిట్ (బీబీయూ)లో తయారుచేస్తున్నారు. ఇప్పటికే చాలా బస్సులు తయారయ్యాయి తొలివిడుతగా 1,209 మంది సిబ్బందిని, 822 ఆర్టీసీ డీజీటీ సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నారు. ఒక్కోడిపోకు రెండు డీజీటీ వెహికల్స్ చొప్పున హైదరాబాద్‌లోని 29 డిపోల్లో దాదాపు 60 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. మిగతావాటిని జిల్లాల్లోని డిపోలకు పంపిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మొత్తం బస్సుల్లో గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ జోన్‌కు చెందిన బస్సులే ఎక్కువగా ఉన్నాయి. గ్రేటర్‌లో రద్దుచేయనున్న 1,000 బస్సుల్లో కండిషన్ బాగున్న బస్సులను రవాణాకు ఉపయోగించనున్నారు. టీఎస్‌ఆర్టీసీలో ప్రవేశపెట్టే కార్గో సేవలను దశలవారీగా విస్తరించనున్నారు. మొదటిదశలో వివిధ ప్రాంతాలు, జిల్లాల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి బుకింగ్స్ స్వీకరిస్తారు. అనంతరం వీటిని ప్రభుత్వశాఖలకు విస్తరించాలని యోచిస్తున్నారు. ప్రభుత్వశాఖల్లో తొలుత వ్యవసాయశాఖతోపాటు పౌరసరఫరాలశాఖ వస్తు రవాణాపై, ఆ తర్వాత విద్యాశాఖ, పరిశ్రమలశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖల వస్తు రవాణాపై దృష్టిసారించనున్నారు. ఈ సర్వీసుల ఏర్పాటులో టీఎస్‌ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ కీలకపాత్ర పోషిస్తున్నది.

### లాజిస్టిక్ బిజినెస్ కోసం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు

లాజిస్టిక్ బిజినెస్ సేవల కోసం టీఎస్‌ఆర్టీసీ ఇప్పటికే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను ఎంపికచేస్తున్నది. ఈ నియామకాల్లో ఆర్టీసీ ఉద్యోగుల్లో అనుభవం, ఉన్నత విద్యార్హతలున్నవారికి ప్రాధాన్యమిస్తుండటంతో 99 శాతం అవకాశాలు కండక్టర్లకే దక్కనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి డిపోకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ను నియమించే బాధ్యతలను రీజినల్ మేనేజర్ స్థాయి అధికారులు చూస్తున్నారు.



టీఆర్‌ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

## అభివృద్ధి చూసే టీఆర్‌ఎస్‌లో చేరికలు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- కాంగ్రెస్ నుంచి 200 మంది చేరిక

**మెట్‌పల్లిటౌన్:** టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నుంచి టీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన న్యాయవాది ఒజ్జెల శ్రీనివాస్‌తోపాటు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళలు, నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. మంగళవారం పట్టణంలోని టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మల్లాపూర్ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్, మెట్‌పల్లి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మార్గం గంగాధర్, టీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు బర్ల సాయన్న, నాయకులు షేక్‌నవాబ్, రాజు, మహ్మద్, ఆకుల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# సమృద్ధిగా జలసిరులు


మొదటిపేజీ తరువాయి...


ఇన్‌ఫ్లో ఉండటం గమనార్హం. తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టుల నీటి ద్వారా చెరువులను కూడానింపుతుండటంతో యాసంగిలో రికార్డుస్థాయిలో సాగు కొనసాగుతున్నది.

### కాళేశ్వరంతో జలచక్రం

గోదావరికి వచ్చే నాలుగు నుంచి ఐదువేల క్యూసెక్కుల నీటిని ఎక్కడ అవసరం ఉంటే అక్కడి జలాశయాలకు తరలించుకొనేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా కలిగింది. బరాజ్‌ల నిర్మాణంతో జలచక్రం ఆవిష్కృతమయింది. గోదావరిపై ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ధవళేశ్వరం బరాజ్‌లో 2.93 టీఎంసీల నిల్వసామర్థ్యం మినహా పెద్దగా ఒడిసిపట్టే అవకాశాల్లేవు. తెలంగాణ పరిధిలోని జలాశయాలను కలుపుకొని మొత్తంగా గోదావరిపై 218.67 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్నది. ఇందులో ఇప్పుడు 167.25 టీఎంసీలు.. అంటే 76.48 శాతం నిల్వలు ఉన్నాయి. అయితే, సింగూరు, నిజాంసాగర్‌కు ఈసారి వరదలు రాకపోవడంతో దాదాపు 40 టీఎంసీల వరకు నిల్వలు తగ్గాయి. ఎల్లంపల్లి, శ్రీరాజరాజేశ్వర జలాశయం, లోయర్ మానేరుల్లో కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇప్పటికీ భారీఎత్తున నీటినిల్వలు ఉన్నాయి. ఎస్సారార్ జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 23.085 టీఎంసీలు, సరస్వతి బరాజ్‌లో 7 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.

### హైదరాబాద్ తాగునీటికి ఢోకా లేదు


వేసవి వస్తే హైదరాబాద్‌కు తాగునీటిని అందించేందుకు దిగువన నాగార్జునసాగర్, ఎగువన శ్రీశైలం నీటిమట్టాలను ఎప్పటికప్పుడు లెక్కలు వేసుకోవాల్సి వచ్చేది. కానీ, రానున్న వేసవిలో హైదరాబాద్‌కే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథకు పుష్కలమైన నీటి లభ్యత ఉన్నది. ముఖ్యంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో కనీస నీటి సేకరణ స్థాయి కంటే ఎగువన 248.35 టీఎంసీల లభ్యత ఉన్నది. ఇందులో శ్రీశైలం జలాశయంలో 110.89 టీఎంసీలు, సాగర్‌లో 137.45 టీఎంసీలు వాడుకొనేందుకు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో రెండుజలాశయాల్లో వాడుకొనేందుకు అందుబాటులో ఉన్నది 86 టీఎంసీల లభ్యత మాత్రమే. యాసంగి సాగుకు వాడుకోవడంతో వేసవిలో ఎండీడీఎల్ దిగువకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

### రెండురాష్ట్రాల్లో జలసిరుల తీరిదీ..

| | |
|---|---|
| రెండు బేసిన్లలో నీటినిల్వసామర్థ్యం 805.02 టీఎంసీలు | ప్రస్తుతం ఉన్న నీటినిల్వలు 650.42 టీఎంసీలు (80.79 శాతం) |
| శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీటినిల్వలు 433.87 టీఎంసీలు | ఎండీడీఎల్ ఎగువన ఉన్న నిల్వలు 248.35 టీఎంసీలు |

# అధికారుల పనితీరుకు ప్రమాణాలు

- రూపొందిస్తున్నట్లు వెల్లడించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్
- రక్షణ శాఖ నిధులను సమర్థవంతంగా వినియోగించినట్లు వ్యాఖ్య




ఢిల్లీలోని డీఆర్డీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:** కేంద్ర ప్రభుత్వ విధానమైన 'కనిష్ఠ ప్రభుత్వం-గరిష్ఠ పాలన' కింద అధికారుల పనితీరును నిర్దేశించడానికి ప్రమాణాలను నెలకొల్పనున్నామని, ఆర్థిక రంగాన్ని మెరుగుపర్చేందుకు నూతన పద్ధతులను అవలంబించనున్నామని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. రక్షణశాఖ ఆర్థిక విభాగం ఆధ్వర్యంలో ఢిల్లీలోని డీఆర్‌డీవో భవన్‌లో మంగళవారం ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీకృత ఆర్థిక సలహాదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కనిష్ఠ ప్రభుత్వం-గరిష్ఠ పాలన కింద ప్రభుత్వ వ్యవస్థలు చాలా మెరుగుపడ్డాయని చెప్పారు. 'దేశానికైనా, సమాజానికైనా, ఏ వ్యవస్థకైనా, కుటుంబానికైనా ఆర్థికం అనేది వెన్నెముకలాంటింది. కాబట్టి ఏ మంత్రిత్వ శాఖనైనా తన లక్ష్యాలను సాధించాలంటే తనకున్న ఆర్థిక వనరులను పరిగణనలోకి తీసుకొని ఎక్కడ కూడా రాజీ పడకుండా ముందుకుసాగాలి' అని చెప్పారు. ప్రతి సంవత్సరం దేశ బడ్జెట్లో ఎక్కువ మొత్తాన్ని రక్షణ శాఖకే కేటాయించడం జరుగుతున్నదని తెలిపారు. గత మూడేండ్లుగా పరిశీలిస్తే తనకు కేటాయించిన నిధులను రక్షణ శాఖ చాలా సమర్థవంతంగా వినియోగించుకోవడమే కాకుండా పూర్తిస్థాయిలో ఖర్చు చేసిందని పేర్కొన్నారు. రక్షణ శాఖ అవసరాల నిమిత్తం ఏవైనా వస్తువులు లేదా పరికరాలను కొనుగోలు చేయడానికి సైనిక బలగాలకు స్వేచ్ఛనిచ్చామని చెప్పారు. అత్యవసరాల నిమిత్తం రూ.500 కోట్ల వరకు చేసే కొనుగోళ్లకు సైనిక బలగాలు నిర్ణయం తీసుకునే అధికారం కల్పించామన్నారు. కార్యక్రమంలో సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్, రక్షణశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్, సెక్రటరీ (ఫైనాన్స్) గార్గికౌల్ తదితరులు పాల్గొన్నారు.

## సౌదీలో వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- తెలంగాణ విదేశీ ఉపాధి కల్పన సంస్థ ఎండీ కేవై నాయక్

**సుల్తాన్‌బజార్:** విదేశాల్లో ఉపాధికి ఈ నెల 30న ఇంటర్వ్యూలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ విదేశీ ఉపాధి కల్పన సంస్థ ఎండీ కేవై నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌదీలోని ప్రముఖ దవాఖానలో పని చేసేందుకు గైనకాలజి, ఇంటర్నల్ మెడిసిన్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 35 ఏండ్ల లోపు ఉండి ఎండీ గైనకాలజీ, ఎండీ ఇంటర్నల్ మెడిసిన్ పూర్తి చేసి కనీసం మూడేండ్ల అనుభవం ఉన్నవారు అర్హులని, ఆసక్తిగల వారు ధ్రువీకరణ పత్రాలతో మల్లేపల్లిలోని టామ్‌కాం ఆఫీసులో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. మరింత సమాచారానికి 7997973358/9640630420 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



యూపీలో వందలాది భయానక సంఘటనలు జరుగుతున్నా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. యూపీ ముఖ్యమంత్రి దీనిపై సిగ్గుపడాలి. వాళ్లు దేనికోసం ఎదురుచూడాలి? మీరు రాష్ట్రంలో మహిళలకు న్యాయం చేయలేరు.

**ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి**

పౌరసత్వ సవరణ చట్టం ఏ మతానికి సంబంధించినదీ కాకపోతే హిందు, సిక్కు, బౌద్ధ, క్రైస్తవ, పార్సీలు, జైనులని ఎందుకు పేర్కొన్నారు? ముస్లింలను ఎందుకు చేర్చలేదు? మనం పారదర్శకంగా ఉందాం. భారతదేశాన్ని ఇతర దేశాలతో పోల్చవద్దు. అన్ని మతాలవారిని, అన్నివర్గాలను ఈ దేశం స్వాగతిస్తుంది.

**చంద్రకుమార్ బోస్, నేతాజీ మనుమడు, పశ్చిమబెంగాల్ బీజేపీ ఉపాధ్యక్షుడు**





**చరిత్రలో నేడు**



**1741** సెంటిగ్రేడ్ ఉష్ణమాపని స్కేల్‌ను పరిచయం చేసిన ఖగోళశాస్త్రవేత్త అండర్స్ సెల్సియస్.

**1868** తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ అంతర్యుద్ధంలో పాల్గొన్నవారందరికీ క్షమాభిక్ష ప్రసాదించిన అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్.





**1991** యూఎస్ఎస్ఆర్ అధ్యక్షుడిగా మైఖేల్ గోర్బచేవ్ రాజీనామా.

నేపాల్‌లో వైద్యుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్ల రోగులు నష్టపోయి జీవితాంతం వికలాంగులుగా ఉండిపోవలసి వస్తున్న వార్తలు కొత్త కాదు. నేపాల్‌లో ప్రైవేటు దవాఖానలలో చికిత్స ఎంతో వ్యయంతో కూడినది. అయినా డబ్బుతో చికిత్స లభిస్తుందని భావించి ప్రజలు ఈ ప్రైవేట్ దవాఖానలకు పోతున్నారు. కొన్ని ప్రముఖ దవాఖానలు కూడా తప్పుడు మందులు ఇవ్వడం, అనవసరంగా రోగులను తమ దగ్గర కొనసాగించడం వంటి అన్యాయానికి పాల్పడుతున్నాయి. ఇటీవల కాఠ్మండులోని ఒక దవాఖాన మూడు పొరపాట్లు చేసినట్టు వైద్య మండలి వెల్లడించింది.

**ది హిమాలయన్ టైమ్స్**

బంగ్లాదేశ్‌లోని అధికారపక్షం అవామీ లీగ్ 21వ సంస్థాగత సమావేశాలు ముగిశాయి. పార్టీ ఏర్పాటైన నాటి ప్రజాస్వామ్య సూత్రాల నుంచి కొంత పక్కకు జరిగిందనేది వాస్తవం. పార్టీ ప్రముఖులు పలువురు అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. దీనివల్ల ప్రభుత్వం సాధించిన విజయాలు మరుగున పడుతున్నాయి. అవినీతి నిర్మూలన పార్టీ నుంచే ప్రారంభం కావాలని పార్టీ నేత షేక్ హసీనా భావించడం సంతోషం. హసీనా తమ నిర్ణయాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని కోరుకుందాం.

**ది డైలీ స్టార్**



# సీడీఎస్ ఏర్పాటు

సుదీర్ఘ కాలం చర్చించిన తర్వాత ఎట్టకేలకు కేంద్ర క్యాబినెట్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) పదవిని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. భారత సైనిక దళాల సంస్కరణలో ఇది తొలి అడుగుగా భావించవచ్చు. భవిష్యత్తులో సైనిక దళాల్లో భారీ పునర్నిర్మాణం సాగనున్నది. సీడీఎస్ రక్షణ మంత్రికి రక్షణరంగ సలహాదారుగా ఉంటాడు. ఈ సీడీఎస్ కార్యదర్శి స్థాయి అధికారాలు కలిగి ఉండటం విశేషం. ఇప్పటివరకు రక్షణ మంత్రికి పౌర అధికార బృందానికి చెందిన కార్యదర్శి ద్వారా ఫైళ్ళు వెళ్ళేవి. ఇప్పుడు సైనికరంగాన్ని నేరుగా రక్షణమంత్రికి అనుసంధానం చేయడం కీలకమైన మార్పు. క్షేత్రస్థాయి కార్యకలాపాలు ఆయా విభాగాధిపతుల పరిధిలోనే ఉంటాయి. అయినా ఈ కేంద్రీయ వ్యవస్థ వల్ల త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం ఏర్పడుతుందనే అభిప్రాయం కూడా ఉన్నది. శ్రీలంకలో శాంతి పరిరక్షక దళాన్ని ఉపయోగించినప్పుడు త్రివిధ దళాల సమన్వయలోపం స్పష్టంగా కనిపించిందనే అభిప్రాయం వెలువడ్డది. ఆ తరువాత కార్గిల్ యుద్ధం జరిగినప్పుడు కూడా సైనిక, వైమానిక దళాలకు మధ్య విభేదాలు తలెత్తాయి. త్రివిధ దళాలలో ప్రతి విభాగం సొంత యుద్ధ ప్రణాళికలకు సిద్ధమవుతున్నది. ఆయుధాల ఆధునీకరణ విషయంలోనూ ఏకాభిప్రాయం, వాస్తవిక దృక్పథం లేదు. సీడీఎస్ అవసరమని కార్గిల్ యుద్ధ సమీక్ష కమిటీ అభిప్రాయపడ్డది. అయితే సీడీఎస్ ఏర్పాటుతోపాటు తదనంతర సంస్థాగత మార్పులలో తమ అస్తిత్వం దెబ్బతింటుందనే ఆందోళన త్రివిధ దళాలలో ఉండేది. సైనికాధికారులను ఒప్పించి సంస్కరణలు చేపట్టాలనే దృక్పథంతో ఈ నిర్ణయాన్ని తరచు వాయిదా వేయవలసి వచ్చింది.

> **ఇటీవల సౌదీ అరేబియా చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడిని కూడా ప్రపంచ దేశాలు ఆశ్చర్యంతో గమనించాయి. సౌదీ అరేబియా ప్రాధాన్యం దృష్ట్యా ఆ దేశ రక్షణకు అమెరికా సైన్యం ఉన్నది. రాడార్ల వంటి అత్యాధునిక వ్యవస్థలున్నాయి. అయినా సునాయసంగా డ్రోన్‌లు వచ్చి విధ్వంసం సృష్టించడం రాబోయే యుద్ధరీతులను సూచిస్తున్నది. ఇరాక్‌లో అమెరికా రోబో సైనికులను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టింది. అయితే ఆ యంత్రాలు అమెరికా సైనికులపైనే దాడికి దిగడంతో వెంటనే ఉపసంహరించుకున్నారు.**

అమెరికాతో సహా పెద్ద దేశాలన్నీ సీడీఎస్ ఏర్పాటుచేసుకున్నాయి. మన దేశంలోనూ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలోనే ఈ ప్రతిపాదన వచ్చింది. కానీ సీడీఎస్ ఏర్పాటైతే సైన్యానికి బలమైన కేంద్రం ఏర్పడతుందనీ అది మంచిది కాదనే అభిప్రాయం ఉండేది. మూడవ ప్రపంచ దేశాలలో సైనిక తిరుగుబాట్లు మన దేశ నాయకులను కలవరబరిచాయి. ఇప్పుడు మన ప్రజాస్వామ్యం పరిణతి చెందినందున సీడీఎస్ ఏర్పాటుకు ముందుకుపోవాలనే అభిప్రాయం కార్గిల్ యుద్ధం తర్వాత బలపడ్డది. సీడీఎస్ ఏర్పాటుతో ఇక మిగితా సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి సారించడానికి దారి పడుతున్నది. సైన్యాన్ని పునర్నిర్మించడం ఇక అన్ని దశల్లో సాగవలసి ఉంటుంది. సాయుధ దళాలను సమన్వయంతో నడిపించే కేంద్రీయ వ్యవస్థ నిర్మాణం జరుగాలె. మరోవైపు క్షేత్రస్థాయిలో త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేయాలె. తక్కువ సైన్యంతో ఎక్కువ పోరాడటానికి ఇజ్రాయెల్‌ను ఉదాహరణగా చెబుతారు. చురుకైన కదలికలతో మేలైన పోరాట పటిమతో తక్కువ సైనికదళాలు ఉండాలనే భావన ఇటీవలికాలంలో బలపడ్డది. మన దేశంలో కూడా సైన్యాన్ని తగ్గించాలనే నిర్ణయం తీసుకున్నారు. సంఖ్యారీత్యా తగ్గిస్తూనే, సామర్థ్యాన్ని పెంచాలనే యోచన ఉన్నది. ఐదు నుంచి ఏడేండ్లపాటు సైనిక బలగాల సంఖ్యను తగ్గిస్తూ పోవచ్చు. క్షేత్రస్థాయి సైనికుల కన్నా అనుబంధ సిబ్బందిని తగ్గించడానికి ప్రాధాన్యం ఉంటుంది. ఈ ఖర్చును సైనికదళాల ఆధునీకరణ కోసం మళ్లిస్తారు. సైన్యంలో సంస్కరణలు చేపట్టడమంటే కొన్ని సంస్థాగత మార్పులు చేయడానికి మాత్రమే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా రక్షణరంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తదనుగుణంగా మార్పులు చేసుకోలేకపోతే ఎంత సైన్యం ఉన్నా ఫలితం ఉండదు. యుద్ధం అనే భావనలోనే భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

హైబ్రిడ్ వార్‌ఫేర్ అనేది ప్రాచుర్యంలోకి వచ్చింది. సంప్రదాయ యుద్ధరీతిలో కొత్త విధానాలను మేళవించడం ఇందులో భాగం. యుద్ధవ్యూహంలో పోరాటం ఒక ప్రధానభాగం. ఒకవైపు శత్రువును రాజకీయంగా ఏకాకిని చేయడం నైతికంగా దెబ్బతీయడం జరుగుతుంది. సమాచార వ్యవస్థను ఆయుధంగా ఉపయోగించుకోవడం ఇటీవల ఎక్కువైంది. శత్రుదేశాల్లో అశాంతిని సృష్టించడం, సాయుధ ముఠాలను, ఉగ్రవాద శక్తులను ఉసిగొల్పడం ఒక రకమైన యుద్ధమే. ఈ మూకలు ఏదేశానికీ చెందినవిగా కనిపించవు. ఎప్పటికప్పుడు కొత్త ఆయుధాలను కనిపెట్టడం, వ్యూహాల ద్వారా పైచేయి సాధించడాన్ని రెండవ ప్రపంచయుద్ధంలో గమనించవచ్చు. 2006లో హెజ్బొల్లా దళాలు ఇజ్రాయెల్‌తో పోరాడిన తీరును యుద్ధవేత్తలు ఆసక్తిగా గమనించారు. ఇటీవల సౌదీ అరేబియా చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడిని కూడా ప్రపంచదేశాలు ఆశ్చర్యంతో గమనించాయి. సౌదీ అరేబియా ప్రాధాన్యం దృష్ట్యా ఆ దేశ రక్షణకు అమెరికా సైన్యం ఉన్నది. రాడార్ల వంటి అత్యాధునిక వ్యవస్థలున్నాయి. అయినా సునాయసంగా డ్రోన్‌లు వచ్చి విధ్వంసం సృష్టించడం రాబోయే యుద్ధరీతులను సూచిస్తున్నది. ఇరాక్‌లో అమెరికా రోబో సైనికులను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టింది. అయితే ఆ యంత్రాలు అమెరికా సైనికులపైనే దాడికి దిగడంతో వెంటనే ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ భవిష్యత్తులో కిల్లర్ రోబోట్స్, లేజర్ వెపన్స్ వంటివి కీలకంగా మారవచ్చు. అంతరిక్షంలోకి యుద్ధం విస్తరించవచ్చు. కంప్యూటర్ వ్యవస్థలను దెబ్బతీయవచ్చు. 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా మన రక్షణవ్యవస్థను సమాయత్తం చేయడం ఒక సుదీర్ఘ కార్యక్రమం.

**జనగళం**

### వ్యవసాయరంగానికి ప్రోత్సాహం

పారిశ్రామికరంగ అభివృద్ధి ఎంత ముఖ్యమో దేశ ఆహారభద్రతకు వ్యవసాయరంగం కూడా అంతేముఖ్యం. దేశంలో ఇప్పటికీ మెజారిటీ ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. యాభై శాతానికి పైగా జనాభాకు వ్యవసాయమే ఆధారం. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని విస్మరిస్తున్నది. అందుకే రోజురోజుకూ ఆ రంగంలో వృద్ధిరేటు తగ్గిపోతున్నది. దీంతో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్నవారు ప్రత్యామ్నాయం వైపు మళ్లుతున్నట్టు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. కేంద్రంలోని పెద్దలు వ్యవసాయరంగ అభివృద్ధికి తగిన ప్రోత్సాహకాలు అందించాలి. ఈ దిశగా కేంద్రం ఆలోచన చేసి తగిన నిర్ణయాలు తీసుకోవాలి.

**- బి.వేణుగోపాల్, దేవరకొండ, నల్గొండ**

### అభివృద్ధి మీద దృష్టి పెట్టాలి

విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా జార్ఖండ్ ప్రజలు తీర్పు ఇచ్చారు. సంకీర్ణ ప్రభుత్వాల వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతున్నదని ప్రజలు భావించారు. అందుకే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ కట్టబెట్టారు. అంతకుముందు కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వం వచ్చిన అవినీతి ఆరోపణలు కూడా ప్రజలు ఎన్డీయే వైపు మొగ్గుచూపడానికి మరోకారణం. కానీ ప్రజల ఆశలను బీజేపీ వమ్ముచేసింది. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధానాలను గడిచిన ఆరేండ్లుగా అవలంబిస్తున్నది. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పట్టించుకోకుండా విభజన రాజకీయ ప్రయత్నాలు ప్రారంభించింది. ఫలితంగానే ప్రజలు ఇటీవల కేంద్రం తెచ్చిన పౌర సవరణ చట్టానికి వ్యతిరేకంగా రోడ్లమీదికి వచ్చి నిరసన తెలుపుతున్నారు. అట్లనే నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరింది. ఇది అధికారిక లెక్కలే. కానీ నిరుద్యోగ నిర్మూలన కోసం ఏ చర్యలు చేపట్టలేదు. పైగా ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమల వాటాలను అమ్ముతున్నది. ప్రజలు ఆశించింది ఇలాంటి విధానాలు కావు. మహారాష్ట్ర, జార్ఖండ్ ప్రజల తీర్పులు చూసిన తర్వాత అయినా బీజేపీ పెద్దల వైఖరిలో మార్పురావాలి. అభివృద్ధి మీద దృష్టిపెట్టాలి. యువతకు ఉపాధి అవకాశాల కల్పించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి.

**- బి.వేణుగోపాల్, దేవరకొండ, నల్గొండ**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



**పిట్టల రవీందర్**

# చిగురిస్తున్న 'మాంచెస్టర్' కల!

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి 2013-14 ఆర్థిక సంవత్సరంలో 50.47 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి సంస్థ, వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిని అధిగమించనున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన ఆరేండ్ల కాలవ్యవధిలో దాదాపు 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదనంగా జోడించగలగడం సాధారణ విషయం కాదు!**

సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాలు రామగుండం కేంద్రంగా మరో 'మాంచెస్టర్'గా రూపుదిద్దుకోవడానికి అన్నిరకాలైన అవకాశాలున్నాయని ఒకప్పటి హైదరాబాద్ సంస్థానంలో ప్రధానిగా పనిచేసిన ప్రఖ్యాత ఇంజినీర్, పారిశ్రామికవేత్త మీర్ లాయఖ్ అలీఖాన్ అభిప్రాయపడినట్లుగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఈ ప్రాంతాన్ని సందర్శించిన ప్రతిసందర్భంలోనూ పదేపదే ప్రస్తావించేవారు. వ్యవసాయరంగ ప్రగతి సాధనంగా ఇంగ్లండులోని 'మాంచెస్టర్' ప్రాంతం పారిశ్రామిక విప్లవానికి పునాదులు వేయడంతో పాటు, ప్రపంచంలోనే ఒక అతిముఖ్యమైన పారిశ్రామిక ప్రాంతంగా రూపుదిద్దుకున్నది. గోదావరి, ప్రాణహిత లోయలో 350 కిలోమీటర్ల పొడవైన నదీ పరీవాహక ప్రాంతంలో విస్తరించుకున్న సింగరేణి బొగ్గు గనుల ఆలంబనతో కోల్ బెల్ట్ ప్రాంతాలు గొప్ప పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతాయని అందరూ ఆశించారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో నిరాటంకంగా కొనసాగిన వనరుల తరలింపు, ఖనిజాల దోపిడీ, ప్రాంతీయ వివక్ష, పాలకుల నిర్లక్ష్యం తదితర అనేకానేక కారణాల ఫలితంగా ఈ ప్రాంత ప్రజల కల కాలగమనంలో కనుమరుగైంది. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల పర్యవసానంగా దాదాపు 175 కిలోమీటర్ల పొడవులో గోదావరి, ప్రాణ హిత పరీవాహక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు అనువైన పరిస్థితులు ఇటీవలి కాలంలో పురుడుపోసుకున్నాయి. దీంతో 'మాంచెస్టర్' కల మళ్లీ చిగురిస్తున్నది.

గోదావరి, ప్రాణహిత నదుల పరీవాహక లోయల్లో 'జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' ధృవీకరించిన లెక్కల ప్రకారం సుమారు 8791 మిలియన్ టన్నుల నేల బొగ్గు నిక్షేపాలున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో సింగరేణి బొగ్గుగనుల సంస్థ నిర్దేశించుకున్న వార్షిక ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నుల ప్రకారం ఈ బొగ్గునిల్వలను ఇంకా 125 సంవత్సరాల పాటు వెలికితీసుకునేందుకు అవకాశాలున్నాయి. గడిచిన 130 ఏండ్ల కాలంలో సింగరేణి సంస్థ ద్వారా మన రాష్ట్రంలో వెలికితీసుకున్న బొగ్గు వెయ్యి మిలియన్ టన్నులు కూడా దాటలేదు. దక్షిణభారతదేశం మొత్తంలో తెలంగాణలోని సింగరేణి ప్రాంతాల్లో మాత్రమే నిక్షిప్తమై ఉన్న నేలబొగ్గు ఫలితంగానే దక్షిణాదికి చెందిన ఆరు రాష్ట్రాల్లో పారిశ్రామిక ప్రగతికి కొంతమేరకు అవకాశం కలిగింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సిమెంటు పరిశ్రమ, ఎరువులు, రసాయనాలు, ఫార్మా ఉత్పత్తులు, స్పాంజ్ ఐరన్ తదితర పరిశ్రమల అభివృద్ధికి ఆస్కారం ఏర్పడింది. లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి.

ఉమ్మడి రాష్ట్ర కాలంలో సింగరేణి నేలబొగ్గును ఇక్కడి అవసరాలకు సరిపోయినంతగా వినియోగించకుండా ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రాంతంలో నీటిలభ్యత సరిగా లేని కారణంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా లేదని సాకులు చూపారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ వేగవంతమైంది. ఇక్కడి బొగ్గును వినియోగించుకొని ఇక్కడే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం ముమ్మరమైంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి 2013-14 ఆర్థిక సంవత్సరంలో 50.47 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి సంస్థ, వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిని అధిగమించనున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన ఆరేండ్ల కాలవ్యవధిలో దాదాపు 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదనంగా జోడించగలుగడం సాధారణ విషయం కాదు! ఇక్కడి బొగ్గును ఇక్కడి అవసరాలకు వినియోగించుకోవడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అభినందించదగిన చొరవను చూపుతున్నది. మంచిర్యాల జిల్లా చెన్నూరు ప్రాంతంలోని జైపూర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడవ యూనిట్ నిర్మాణం ద్వారా 1800 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించారు. ఎన్టీపీసీలో నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో భారీ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను నిర్మిస్తున్నారు. 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఇప్పటికే రెండు యూనిట్ల నిర్మాణం పూర్తికావస్తున్నది. భూపాలపల్లి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే 1100 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు పనిచేస్తున్నాయి. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పేరిట మణుగూరులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు రానున్నాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల దగ్గర నాలుగువేల మెగావాట్ల భారీ విద్యుత్ కేంద్రం రాబోతున్నది. కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఇప్పటికే 2500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నది. మొత్తంగా తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి రంగంలో స్వయంసమృద్ధిని సాధించే దిశలో అడుగులు వడివడిగానే పడుతున్నాయి. ఒక ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరుగాలన్నా నాణ్యత కలిగిన నిరంతర విద్యుత్ లభ్యత అత్యంత కీలకమైనది. దీనికితోడు చాలినంత భూమి, అందుబాటులో నీటి లభ్యత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తగినంత పెట్టుబడులు, సహజవనరులు, మొదలైన మౌలిక సదుపాయాలతో పాటు రాజకీయ సంకల్పం, సుస్థిరమైన పాలన అవసరం.

> **అత్యంత కీలకమైన, సర్వతోముఖాభివృద్ధికి ఇరుసుగా పనిచేసే గోదావరి, ప్రాణహిత జలాలను కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంతో ఒడిసిపట్టుకొని బీడు భూములకు మళ్లించుకొని వ్యవసాయరంగాన్ని సుసంపన్నం చేసుకోవడానికి దారులు వేసుకున్నట్లుగానే, గోదావరి, ప్రాణహిత నదీ లోయల వెంట పారిశ్రామిక, పర్యాటక, మత్స్య, పారిశ్రామిక, జల రవాణా తదితర అన్నిరంగాలను ఇతోధికంగా అభివృద్ధిపరచుకొని మన రాష్ట్రంలో మరో 'మాంచెస్టర్'ను నిర్మించుకోవడం అసాధ్యమేమీ కాదు.**


కాళేశ్వరం ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో భద్రాచలం (దుమ్ముగూడెం) నుంచి బాసర (శ్రీరాంసాగర్) వరకు గోదావరి, ప్రాణహిత పరీవాహకంలో నీటి లభ్యతకు పూర్తి భరోసా లభించినట్లయ్యింది. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ఆధారంగా ఇప్పటికే అందుబాటులో ఉన్న విద్యుదుత్పత్తి కేంద్రాల వల్ల పూర్తిస్థాయిలో కరెంటు అందుబాటులో ఉన్నది. అంతేకాకుండా రామగుండం ఎరువుల కర్మాగారం నిర్వహణ కోసం సిద్ధం చేసుకున్న గ్యాస్ పైప్‌లైన్ ద్వారా సహజవాయువు కూడా ఈ ప్రాంతానికి అందుబాటులోకి వస్తున్నది. బొగ్గుగనుల నిర్వహణ కోసం సింగరేణి సంస్థ సేకరించిన వేలాది ఎకరాల భూములు కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లి, గోదావరిఖని, రామగుండం, బెల్లంపల్లి, చెన్నూరు, తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. వీటితో పాటుగా గోదావరి నదిని ఆనుకొని అంతర్గాం ప్రాంతంలో మూసివేసిన నేత, నూలు మిల్లులకు సంబంధించిన వందలాది ఎకరాలు, రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సంబంధించిన భూములు, బీపీఎల్ పవర్‌ప్లాంట్ కోసం సేకరించిన భూములు కూడా అందుబాటులో ఉన్నాయి. అందువల్ల అన్నిరకాలైన పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతాల్లో అనుకూల పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అయితే భారీ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుతో పాటు అనేకరకాలైన అనుబంధ పరిశ్రమలకు కూడా ఆస్కారం కలుగుతుంది. వీటికి అనుబంధంగా సేవారంగంలోనూ అవకాశాలు మెరుగుపడతాయి. సింగరేణి బొగ్గగనుల ఫలితంగా ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయరంగానికి ఊతం లభించినట్లుగానే ఈ ప్రాంతంలో జరిగే పారిశ్రామిక, సేవారంగాల అభివృద్ధి వ్యవసాయ, వ్యవసాయేతరరంగాల పురోభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది. ఇంకా అనేకరకాలైన ఉపాంత ప్రయోజనాలు సమకూరుతాయి.

దుమ్ముగూడెం నుంచి శ్రీరాంసాగర్ వరకు సుమారు 274 కిలోమీటర్ల పొడవులో కొనసాగుతున్న గోదావరి నదీగర్భాన్ని ఎల్లకాలం నీటి నిల్వతో సజీవంగా ఉంచడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి జలరవాణా మార్గాన్ని ఏర్పాటు చేసుకునేందుకు వీలు కుదురుతుంది. రాజమండ్రి నుంచి నాసిక్ వరకు మూడు దశల్లో జాతీయ ఉపరితల జలరవాణా మార్గాన్ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఫలితంగా రానున్న కొన్నేండ్ల వ్యవధిలోనే గోదావరి నది ఒక ప్రధానమైన జల రవాణా మార్గంగా రూపుదిద్దేందుకు అవకాశాలు కలుగుతాయి. ఈ నీటి నిల్వ సామర్థ్యం భారీ ఎత్తున చేపల పెంపకానికి ఉపయోగపడి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తుంది. ఎల్లకాలం నీటి నిల్వతో గోదావరి జీవనదిగా మారుతున్న నేపథ్యంలో గోదావరి నదీగర్భంలో 'ఫిషరీస్ కారిడార్' ఏర్పాటుచేసేందుకు మార్గం సుగమమవుతుంది. వీటితోపాటుగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందిన దేశాలతో పాటుగా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వస్తున్న అనేకరకాలైన ప్రత్యేకమైన పర్యాటక అంశాలను కూడా అభివృద్ధి పరిచేందుకు గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో అవకాశాలు కలుగుతాయి. ముఖ్యంగా అడ్వెంచర్ టూరిజం, వైల్డ్‌లైఫ్ టూరిజం, ఫిషరీస్ టూరిజం లాంటి విభాగాల్లో దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేందుకు అవకాశాలున్నాయి. పరీవాహక ప్రాంతమంతా దట్టమైన అడవులు, లోయలు, కొండకోనలతో నిండి ఉన్న కారణంగా జంతు ప్రేమికులను ఆకర్షించేందుకు 'వైల్డ్‌లైఫ్ టూరిజం', యువతీయువకులను ఆకర్షించేందుకు 'అడ్వెంచర్ టూరిజం' ఎంతగానో దోహదపడుతుంది. అత్యంత కీలకమైన, సర్వతోముఖాభివృద్ధికి ఇరుసుగా పనిచేసే గోదావరి, ప్రాణహిత జలాలను కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంతో ఒడిసిపట్టుకొని బీడు భూములకు మళ్లించుకొని వ్యవసాయరంగాన్ని సుసంపన్నం చేసుకోవడానికి దారులు వేసుకున్నట్లుగానే, గోదావరి ప్రాణహిత నదీ లోయల వెంట పారిశ్రామిక, పర్యాటక, మత్స్య పారిశ్రామిక, జల రవాణా తదితర అన్నిరంగాలను ఇతోధికంగా అభివృద్ధి పరుచుకొని మన రాష్ట్రంలో మరో 'మాంచెస్టర్'ను నిర్మించుకోవడం అసాధ్యమేమీ కాదు.

**(వ్యాసకర్త: 'తెలంగాణ ఫిషరీస్ సొసైటీ' వ్యవస్థాపకులు)**

# 'పౌర చట్టం'తో ప్రమాదం

జాతీయం



**డి.రాజారాం యాదవ్**

1947లో దేశ విభజన తర్వాత వచ్చిన పాకిస్థానీ శరణార్థులు, 1971లో బంగ్లాదేశీ శరణార్థులు భారత్‌కు వచ్చారు. అప్పటి ప్రభుత్వాలు వారిని మానవతా దృక్పథంలో ఆదుకున్నాయి. బంగ్లాదేశ్ నుంచి అస్సాంకు వలసలు పెరుగడంతో వీరికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. దీనివల్ల అస్సాం ఆదివాసీ, గిరిజన ప్రజల కోసం 1985లో అస్సాం ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా అస్సాం ప్రజలకు భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ వలసదారులను వెనక్కి పంపుతామనే హామీ ఇచ్చింది. అది సాధ్యం కాకపోవడం వల్ల 2013లో సుప్రీంకోర్టు జోక్యంతో ఎన్ఆర్‌సీని అస్సాంలో అమలుచేయడం జరిగింది. ఎన్ఆర్‌సీ ద్వారా అస్సాంలో 19 లక్షల మంది అక్రమ వలసదారులు ఉన్నరని తేలితే దానిలో 15 లక్షల మంది హిందువులు ఉండటం విశేషం.

సీఏఏను తీసుకువచ్చి ఎన్ఆర్‌సీని దేశవ్యాప్తంగా అమలుచేస్తామని అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటించడంతో ఈశాన్య రాష్ట్రాలు గిరిజన ఆదివాసీ తెగలు, ముస్లింలు, దళితులు తీవ్ర భయందోళనలకు గురవుతున్నారు. సీఏఏ వల్ల మొదట నష్టపోతున్నది ఈశాన్య రాష్ట్రాలు, జమ్ముకశ్మీర్ ఆదివాసీ గిరిజన తెగలే. ఎందుకంటే ఇప్పటికే అక్రమ వలసదారులుగా తేలిన 15 లక్షలమంది, అక్రమ వలసదారులుగా ఉన్న ముస్లిమేతరులు సీఏఏ ద్వారా రాజమార్గంలో ఆయా గిరిజన, కొండ ప్రాంతాల్లో పౌరులుగా గుర్తింపు పొందుతారు. ఎన్ఆర్‌సీ ద్వారా అక్రమ వలసదారులుగా తేలిన పేదలు, ఆదివాసులు, ముస్లిం మైనారిటీలు ఇబ్బంది పడుతారు. వాళ్లు దేశం లేనివారుగా మారుతారు. జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు వేల ఏండ్లుగా హిమాలయ ప్రాంతంలో జీవిస్తూ ప్రత్యేకమైన భాషా సంస్కృతులను కలిగి ఉన్నారు. ఇప్పటికే వలసవచ్చిన వారి వల్ల, సీఏఏ ద్వారా భవిష్యత్తులో విదేశాల్లోంచి వచ్చిన వలసలతో నష్టపోయేది అమాయక ఆదివాసీ ఈశాన్య రాష్ట్రాల ప్రజలే. అంతేకాదు వారి సంస్కృతిని కోల్పోయి ఆయా జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉన్నది. చివరికి ఈశాన్య రాష్ట్రాలు, జమ్ముకశ్మీర్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ వలస కాలనీలుగా మారుతాయి. అందుకే సీఏఏకు వ్యతిరేకంగా ఈశాన్యరాష్ట్రాల ప్రజలు మతాలకతీతంగా పోరాటాలు మొదలుపెట్టారు. ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీ ద్వారా పేదలు నిరక్షరాస్యులు. ఇల్లు లేనివారు ఓటు లేని సంచార జాతులు, స్త్రీలు దళితులు, ఆదివాసులు, పేద ముస్లింలు ఇబ్బంది పడుతారు. నిజమైన అక్రమ వలసదారులకు దీనివల్ల పెద్దగా నష్టం ఉండదు.

గతంలో పెద్దనోట్లను రద్దుచేసి పేద ప్రజలను క్యూలైన్‌లో నిలబెట్టి నానా ఇబ్బందులకు గురిచేసిన మోదీ ఎన్ఆర్‌సీ ద్వారా మరోసారి క్యూలైన్‌లో నిలబెట్టబోతున్నారు. సీఏఏ 2019, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌ల ద్వారా పకడ్బందీగా విభజన రాజకీయాలకు ఓటు బ్యాంకు రాజకీయాలకు బీజేపీ ప్రణాళికలు వేసింది. ఎన్ఆర్‌సీని దేశవ్యాప్తం చేయడం ద్వారా తన రాజకీయ ప్రత్యర్థి వర్గాలను రెండో శ్రేణి పౌరులుగా మార్చబోతున్నారు. తమ రాజకీయ ప్రత్యర్థులను కావాలని అక్రమ వలసదారులుగా చిత్రీకరించవచ్చు. దళితులు, ముస్లింలు, ఆదివాసులు, పేదలు అక్రమ వలసదారులుగా తేల్చబడుతారు. బీజేపీ అనుకూల ఓటు బ్యాంకు వర్గం అక్రమ వలసదారులుగా తేలినప్పటికీ సీఏఏ ద్వారా శరణార్థుల పేరిట రాజమార్గంలో భారత పౌరసత్వం పొందుతారు. భారత ప్రభుత్వం అనాలోచితంగా చేసిన సీఏఏను వాడుకొని శత్రుదేశాలు తమ ఏజెంట్లను శరణార్థుల రూపంలో పంపవచ్చు. భారతదేశంతో ఎటువంటి సంబంధం లేని, దేశంపై ప్రేమలేని విదేశీయులకు మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వడం ద్వారా కొత్త సమస్యలను దేశం ఎదుర్కోబోతున్నది. హిందూ, క్రైస్తవ, సిక్కులు శరణార్థుల పేరిట మన శత్రు దేశాలైన పాకిస్థాన్, చైనాలు అక్రమ చొరబాట్లకు పాల్పడుతాయి. ఇది దేశ సమగ్రతకు తీవ్ర భంగం కలిగించవచ్చు.

సీఏఏ, ఎన్ఆర్‌సీతో మోదీ, అమిత్ షా ద్వయం ఆగుతుందనుకోవడం పొరపాటే అవుతుంది. వారు ఒక్కొక్క వర్గాన్ని వ్యవస్థలను క్రమక్రమంగా టార్గెట్ చేస్తారు. ఇప్పటికే దేశంలో దళితులను, ఆదివాసులను స్త్రీలను తిండి పేరిట, దుస్తుల పేరిట హింసకు గురిచేస్తూ, సంఘ పరివార్ శక్తులు వారిపై అనేక మూక దాడులకు పాల్పడుతున్నాయి. రచయితల మేధావుల గొంతు నొక్కుతున్నారు. రాజ్యాంగ సంస్థలను న్యాయవ్యవస్థలను బలహీనపరిచే ప్రయత్నం పెద్ద ఎత్తున జరుగుతున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సమాఖ్య వ్యవస్థను రద్దుచేసే రహస్య అజెండాను మోదీ, అమిత్ షా ద్వయం కలిగి ఉన్నది.

దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థలు ఉండటం ఆర్ఎస్ఎస్, బీజేపీలకు మొదటి నుంచి అంగీకారం కాదు. బహుళ పార్టీ వ్యవస్థ కూడా వారికి అంగీకారం కాదు. ద్విపార్టీ విధానం ఉండటం దేశానికి మేలని ఆర్ఎస్ఎస్, బీజేపీలు చాలాసార్లు వ్యాఖ్యానించాయి. (ఒకే జెండా, ఒకే పార్టీ అని బీజేపీ బహిరంగంగానే చెబుతున్నది.) పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను, సమాఖ్య విధానాన్ని రద్దుచేసి అధ్యక్ష తరహా ప్రభుత్వం ఏర్పర్చాలనే భావన కూడా ఉన్నది. అదే జరిగితే ప్రాంతీయపార్టీలకు స్థానం ఉండదు. పార్లమెంట్‌లో వెనుకబడిన వర్గాలకు, ప్రాంతాలకు, కులాలకు, జాతులు, మత మైనార్టీలకు ప్రాతినిధ్యం పోతుంది. ఇదే జరిగితే గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యానికి బదులు దేశంలో నియంతృత్వం ఏర్పడుతుంది. బ్రిటిష్ వారు విభజించు, పాలించు సూత్రాన్ని ఈ దేశంలో అమలుచేశారు. జిన్నా దాన్ని బలపరిచారని చెబుతారు. అయితే జిన్నా కన్నా ముందు మత ప్రాతిపదికన దేశం వీడి గోల్వాల్కర్ హిట్లర్‌ను పూర్తిస్థాయిలో సంపూర్ణంగా బలపరిచారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలకు గోల్వాల్కర్ సావర్కర్ ఆదర్శమూర్తులు.

> **సీఏఏ, ఎన్ఆర్‌సీ వ్యతిరేక పోరాటానికి యావత్ దేశ విద్యార్థులు, యువకులు నాయకత్వం వహించడం విశేషం. వారి పోరాట ఫలితంగానే నరేంద్ర మోదీ ఎన్ఆర్‌సీని దేశవ్యాప్తంగా అమలుపరిచే ఉద్దేశం తనకు లేదనడం విద్యార్థుల విజయంగా చూడాలి. భిన్నమతాలు, జాతులు, కులాలు, వర్గాల శాంతియుత సహజీవన వారసత్వం దేశంలో నేటికి బలంగా ఉండటం వల్ల ఇది సాధ్యమైంది.**

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ స్వభావం. పరమత సహనం శాంతి, ప్రేమతత్వం భారత ఆత్మ. బుద్ధుడు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌ల దార్శనికత భారత ప్రజలకు దిక్సూచిగా ఉన్నది. సీఏఏ, ఎన్ఆర్‌సీ వ్యతిరేక పోరాటానికి యావత్ దేశ విద్యార్థులు, యువకులు నాయకత్వం వహించడం విశేషం. వారి పోరాట ఫలితంగానే నరేంద్ర మోదీ ఎన్ఆర్‌సీని దేశవ్యాప్తంగా అమలుపరిచే ఉద్దేశం తనకు లేదనడం విద్యార్థుల విజయంగా చూడాలి. భిన్నమతాలు, జాతులు, కులాలు, వర్గాల శాంతియుత సహజీవన వారసత్వం దేశంలో నేటికీ బలంగా ఉండటం వల్ల ఇది సాధ్యమైంది. సీఏఏ, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటం లౌకిక, గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే పోరాటంగా రూపాంతరం చెందుతుంది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## ఎన్నార్సీ అమలులో భాగంగానే ఎన్పీఆర్!

### రెండింటి అనుసంధానానికి కేంద్రం కుట్ర పన్నుతున్నది: కాంగ్రెస్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:** జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) అమలులో భాగంగానే జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని కాంగ్రెస్ విమర్శించింది. ఎన్నార్సీ అమలులో తొలి అడుగు ఎన్పీఆర్ అని హోంమంత్రిత్వ శాఖ తన వార్షిక నివేదికలో పేర్కొన్నదని ఆ పార్టీ అధికార ప్రతినిధి అజయ్ మాకెన్ తెలిపారు. 2014లోనూ నాటి హోంశాఖ సహాయ మంత్రి ఇలాంటి ప్రకటనే చేశారని గుర్తు చేశారు. కేంద్రం కుట్రపూరితంగా ఈ రెండింటిని అనుసంధానించేందుకు ప్రయత్నిస్తున్నదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆయన ఆరోపించారు. ఎన్నార్సీ, ఎన్పీఆర్‌కు సంబంధం లేదని హోంమంత్రి అమిత్ షా చెప్పడం పెద్ద అబద్ధమన్నారు. ఎన్నార్సీని దేశవ్యాప్తంగా అమలు చేస్తామంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు, దీనిపై క్యాబినెట్‌లో ఎలాంటి చర్చ జరుగలేదని ఆదివారం ఢిల్లీలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు చాలా వ్యత్యాసం ఉన్నదన్నారు.

## ఎన్నార్సీ మాదిరే ఎన్పీఆర్‌నూ వ్యతిరేకించాలి

### రాష్ట్రాల సీఎంలకు సీపీఎం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)ని వ్యతిరేకించిన సీఎంలు తాజాగా కేంద్రం ప్రకటించిన జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ప్రక్రియ అమలును నిలిపేయాలని సీపీఎం కోరింది. ఎన్పీఆర్‌ను తాజాగా సవరించడానికి భారీ ఎత్తున నిధులను కేటాయిస్తూ కేంద్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం తీసుకున్నది. దీనిపై సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పందిస్తూ.. 'ఎన్పీఆర్=ఎన్నార్సీ. ప్రజలను మోదీ ప్రభుత్వం ఎలా తప్పుదోవ పట్టిస్తున్నదనడానికి ఇది నిదర్శనం. 'ఎన్పీఆర్ ఆధారంగా ఎన్నార్సీని రూపొందిస్తామని రాజ్యసభలో మోదీ ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది' అని పేర్కొన్నారు. 2014లో ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ప్రభుత్వం రాజ్యసభలోఎన్పీఆర్-ఎన్నార్సీ మధ్య బంధాన్ని బయటపెట్టిందన్నారు.ఎన్నార్సీని తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమని 12 రాష్ట్రాల సీఎంలు ప్రకటించారు. కేరళ, పశ్చిమబెంగాల్ సీఎంలు ఎన్పీఆర్‌పై ముందుకెళ్లబోమని నిర్ణయించారు' అని ఏచూరి చెప్పారు.

## ప్రజలను మోసగించే ప్రయత్నం: తృణమూల్

**న్యూఢిల్లీ:** ఎన్పీఆర్ పేరుతో ప్రజలను మరోసారి మోసగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ డెరెక్ ఓబ్రియెన్ విమర్శించారు. ఎన్నార్సీ అమలులో తొలి అడుగు ఎన్పీఆర్ అని హోంమంత్రిత్వ శాఖ పేర్కొనడమే దీనికి నిదర్శనమన్నారు. ఎన్పీఆర్‌ను జనాభా సర్వేగా ప్రజలు భావించే అవకాశమున్నదని, స్థానికంగా నివాసం ఉంటున్న వివరాలు ఇచ్చి అనంతరం చిక్కుల్లో పడతారని పేర్కొన్నారు.

## త్రివిధ దళాల సమన్వయ కర్త

- రక్షణ మంత్రికి ప్రధాన సలహాదారు
- త్రివిధ దళాల సంస్థలు, కమాండ్ల పర్యవేక్షణ
- మౌలిక సదుపాయాలు, యుద్ధ వ్యూహాల రూపకల్పన
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం నేపథ్యంలో త్వరలో తొలి సీడీఎస్ నియామకం
- జనరల్ బిపిన్ రావత్‌కు దక్కే అవకాశం






**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:** 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం, దేశ రక్షణకు సంబంధించి కొత్త ఆలోచనలకు పురుడుపోసింది. దేశ భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో మారుతున్న యుద్ధ వ్యూహాల నేపథ్యంలో దేశ రక్షణలో త్రివిధ దళాలైన సైనిక , నౌకా, వైమానిక దళాలను సమన్వయం చేసే రక్షణ దళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ – సీడీఎస్) అవసరమని కార్గిల్ కమిటీకి నేతృత్వం వహించిన కె.సుబ్రహ్మణ్యం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కానీ, దీనిపై దృష్టిసారించని నాటి ప్రభుత్వం కమిటీ సిఫార్సులపై సమీక్షకు 2001లో మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. 2012లో నరేశ్ చంద్ర టాస్క్‌ఫోర్స్ కూడా సీడీఎస్‌ను పోలిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్స్ కమిటీ చైర్మన్ ప్రతిపాదన చేసింది. 2016లో శేకత్‌కర్ కమిటీ కూడా కొత్తగా నాలుగు స్టార్ల జనరల్‌తో సైనిక బలగాల ముఖ్య సమన్వయకర్తను నియమించాలని సూచించింది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న ప్రధాని మోదీ, సీడీఎస్ ప్రతిపాదనను అమలు చేయాలని సంకల్పించారు. దేశ రక్షణ కోసం చేపట్టనున్న సైనిక సంస్కరణల్లో భాగంగా సీడీఎస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది ఆగస్టు 15న ఎర్ర కోట నుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు.

**సీడీఎస్ ఏర్పాటు ఇలా**

క్యాబినెట్ నిర్ణయం నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖలోని సైనిక వ్యవహారాల విభాగంలో కొత్తగా రక్షణ దళాధిపతి (సీడీఎస్ ) విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. రక్షణ బలగాల కిందకు వచ్చే సైనిక వ్యవహారాల విభాగం(డీఎంఏ)కు సీడీఎస్ అధిపతిగా ఉంటారు. డీఎంఏలోని అన్ని స్థాయిల్లో సైనిక, పౌర అధికారులు ఉంటారు. త్రివిధ దళాలకు సంబంధించిన కొనుగోళ్లు, సిబ్బంది శిక్షణా వ్యవహారాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. చీఫ్ ఆఫ్ స్టాఫ్ కమిటీకి శాశ్వత చైర్మన్‌గా సీడీఎస్ వ్యవహరిస్తారు. ఆయనకు ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ సహకరిస్తుంది.

**సీడీఎస్ విధులు, బాధ్యతలు..**


రక్షణ దళాధిపతి (సీడీఎస్) ప్రధానంగా త్రివిధ దళాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర రక్షణ మంత్రికి ప్రధాన సలహాదారునిగా ఉంటారు. ప్రతి ఏటా నివేదిక అందజేస్తారు. త్రివిధ దళాధిపతులతో సమానంగాను, ప్రథమంగాను ఉండే సీడీఎస్ సైనికపరమైన ఆదేశాలు ఇవ్వజాలరు. త్రివిధ దళాధిపతులపై సీడీఎస్ పెత్తనం ఉండదు. వారు తమ దళాలకు సంబంధించిన అంశాలపై రక్షణ మంత్రికి నేరుగా సలహాలు ఇస్తారు. రక్షణ దళాధిపతి(సీడీఎస్)ప్రధాన బాధ్యత త్రివిధ దళాలను సమన్వయం చేయడం. మూడు దళాల సంయుక్త వ్యూహాలు, కార్యాచరణపై కేంద్ర ప్రభుత్వానికి సరైన సలహాలు ఇవ్వడం. రక్షణ అంశాలకు సంబంధించిన సైనిక వ్యవహారాల్లో నైపుణ్యాలను పెంపొందించడం. త్రివిధ దళాల సంస్థల పాలనా పరమైన బాధ్యతలను సీడీఎస్ నిర్వహిస్తారు. సైబర్, స్పేస్ కమాండ్ పరిధిలోకి వచ్చే త్రివిధ దళాలకు సంబంధించిన సంస్థలు, కమాండ్లు సీడీఎస్ కింద పని చేస్తాయి. రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ), రక్షణ ప్రణాళిక కమిటీ (డీపీసీ)లో సీడీఎస్ సభ్యుడిగా ఉంటారు. యుద్ధ వ్యూహాలు రూపొందించడం, మౌలిక సదుపాయాలను సరిగా వినియోగించుకునేలా చూడటం, సైనికుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, ఆయుధాలు, పరికరాలను సొంతంగా అభివృద్ధి చేసుకోవడం, నిధుల సేకరణ ప్రణాళికల అమలు, విపత్తు సమయాల్లో సైనిక సేవల వినియోగం, అంతర్జాతీయ సహకారం వంటి కార్యకలాపాలను సీడీఎస్ పర్యవేక్షిస్తారు.

**సీడీఎస్‌కు అర్హులెవరు?**

నాలుగు స్టార్లు కలిగిన జనరల్ ర్యాంకు అధికారులు రక్షణ దళాధిపతికి అర్హులు. ఈ పదవి నుంచి వైదొలిగిన తర్వాత ప్రభుత్వంలో ఎలాంటి హోదా చేపట్టకూడదు. పదవి నుంచి విరమణ పొందిన ఐదేండ్ల వరకు ముందస్తు అనుమతి లేకుండా ప్రైవేటు సంస్థల్లో పని చేయకూడదు. డిసెంబర్ 31న పదవీ విరమణ చేయనున్న సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ తొలి త్రివిధ దళ అధిపతిగా నియమితులు కావచ్చని సమాచారం.



# ఈ లెక్కలేమిటి?



**దేశ** పౌరులందరికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర ప్రభుత్వం రెండు భారీ ప్రక్రియలకు కసరత్తు ప్రారంభించింది. ఇటీవల పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చిన మోదీ సర్కారు తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా జనగణనతో పాటు జాతీయ జనాభా పట్టిక (నేషనల్ పాపులేషన్ రిజిస్టర్– ఎన్పీఆర్)ను సవరించాలని (అప్‌డేట్ చేయాలని) నిర్ణయించింది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం రూ.3941.35 కోట్ల నిధుల్ని కేటాయించింది. గతంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ-2 ప్రభుత్వం కూడా 2010లో తొలిసారి ఎన్పీఆర్ చేపట్టి గుర్తింపు కార్డులను మంజూరు చేసింది. ఆ సమాచారాన్ని 2015లో అప్‌డేట్ చేశారు. ప్రస్తుత ఎన్పీఆర్ ద్వారా దేశంలోని సాధారణ నివాసితుల జాబితాను అప్‌డేట్ చేయనున్నారు. మరోవైపు, ప్రతి పదేండ్లకు ఒకసారి జరిగే జనాభా లెక్కల ప్రక్రియ (జనగణన)ను కూడా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీని నిర్వహణ కోసం రూ. 8,754.23 కోట్లను కేటాయించింది. ఈ నేపథ్యంలో ఎన్పీఆర్, జనగణన ఉద్దేశం, వాటి లక్ష్యాలు, వాటి మధ్య ఉన్న తేడాల్ని పరిశీలిస్తే..

### ఎన్పీఆర్ అంటే..

- ఆరు నెలలు నివాసం ఉంటే ఎన్పీఆర్ సాధారణ నివాసితులుగా గుర్తింపు
- సమగ్ర గుర్తింపు డేటాబేస్‌ను సృష్టించడమే ప్రధానోద్దేశంగా పేర్కొంటున్న సర్కారు
- డేటాబేస్‌లో బయోమెట్రిక్ వివరాలు కూడా..

- ఎన్పీఆర్‌ను దేశంలో నివసించే 'సాధారణ(సహజ) నివాసితుల' జాబితాగా పేర్కొంటున్నారు. స్థానికంగా ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నుంచి ఉంటున్న.. లేదా రాబోయే ఆరు నెలలు అంతకంటే ఎక్కువ కాలం ఉండనున్న వారిని ఎన్పీఆర్ కోసం 'సాధారణ నివాసితులు'గా పరిగణిస్తారు.
- పౌరసత్వ చట్టం -1955, పౌరసత్వం(పౌరుల నమోదు మరియు జాతీయ గుర్తింపు కార్డుల జారీ) నిబంధనలు, 2003 అనుసరించి స్థానిక ప్రాంతం(గ్రామం/పట్టణం), ఉప జిల్లా, జిల్లా, రాష్ట్రం, జాతీయ స్థాయిలో ఎన్పీఆర్‌ను రూపొందించనున్నారు.
- భారతీయ పౌరుడైన ప్రతి వ్యక్తి వివరాలు ఈ జాబితాలో నమోదు కావాలని, అలాగే, ఎన్పీఆర్‌లో నమోదైన వ్యక్తికి జాతీయ గుర్తింపు కార్డును మంజూరు చేయాలని చట్టం చెబుతున్నది.
- అసోం మినహా(ఇదివరకే ఎన్నార్సీ ప్రక్రియ పూర్తయిన కారణంగా) దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ – సెప్టెంబర్ మధ్య ఎన్పీఆర్ డేటా సేకరిస్తారు. జనగణన ప్రక్రియలో భాగంగా చేపట్టే గృహ నమోదు దశ కూడా ఇదే సమయంలో జరుగుతుంది.
- దేశంలోని ప్రతి సాధారణ పౌరుడికి సంబంధించిన సమగ్ర గుర్తింపు డేటాబేస్‌ను సృష్టించడమే ఎన్పీఆర్ ప్రధానోద్దేశం.
- ఈ డేటాబేస్‌లో జనాభా సమాచారంతో పాటు బయోమెట్రిక్ వివరాలు ఉంటాయి.
- జనాభా సమాచారంలో భాగంగా ప్రతి సాధారణ నివాసి పలు వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. అవి. వ్యక్తి పేరు, కుటుంబ పెద్దతో సంబంధం, తండ్రి పేరు, తల్లి పేరు, భాగస్వామి పేరు(పెండ్లి అయితే), లింగం, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, పుట్టిన ప్రాంతం, జాతీయత, ప్రస్తుత చిరునామా, ప్రస్తుత చిరునామాలో ఉంటున్న కాలం, శాశ్వత చిరునామా, వృత్తి, విద్యార్హతలు.

### జనగణన అంటే..

- జనన-మరణాలు, అక్షరాస్యత, లింగ నిష్పత్తి తదితర వివరాల కోసం 'జనగణన' నిర్వహణ
- దశాబ్ద కాలంలో దేశం సాధించిన అభివృద్ధిపై సమీక్షే ధ్యేయంగా..
- భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో కీలకం ఈ కసరత్తు

- ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి చేపట్టే ఈ జనగణన ప్రక్రియ.. దేశ ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని అందించే అతిపెద్ద వనరుగా ఉన్నది.
- జనగణన చట్టం-1948 ప్రకారం ఈ వివరాల్ని సేకరిస్తున్నారు.
- 2021 జనాభా లెక్కల్ని రెండు విడుతల్లో సేకరించనున్నారు. ఏప్రిల్-సెప్టెంబర్, 2020 మధ్య చేపట్టే మొదటి విడుతలో గృహ నమోదు లేదా గృహ గణనకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారు. రెండో విడతలో జనాభా లెక్కల్ని సేకరిస్తారు. ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 28, 2021 మధ్య ఈ గణన చేపడుతారు. మంచు తీవ్రత ఎక్కువగా ఉండే జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో అక్టోబర్ 1,2020ను జనగణనకు గడువు తేదీగా నిర్ణయించారు.
- గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన అభివృద్ధి, అమల్లో ఉన్న ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించడం, భవిష్యత్ ప్రణాళికలు వంటి అంశాలను సమీక్షించడం కోసం జనగణనను చేపడుతారు.
- దేశ జనాభా, ఆర్థిక పరిస్థితి, అక్షరాస్యత, విద్య, గృహాలు, గృహ సౌకర్యాలు, పట్టణీకరణ, జనన-మరణాలు, ఎస్సీ, ఎస్టీల వివరాలు, భాష, మతం, వలసలు, అంగవైకల్యం తదితరాలకు సంబంధించిన వివరణాత్మక, ప్రామాణిక సమాచారం 'జనగణన' ద్వారా తెలుస్తుంది.
- దీంతోపాటు రైతులు, వ్యవసాయ కూలీలు, గృహేతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, వ్యాపారులు, వృత్తిని బట్టి వ్యక్తుల వివరాల్ని సేకరిస్తారు.
- లింగ నిష్పత్తి, అక్షరాస్యత రేటు, పట్టణాల సంఖ్య, మురికి వాడల్లో నివసించే జనాభా, తాగునీరు, విద్యుత్, నీటి పారుదల సౌకర్యాలు, వ్యవసాయ పద్ధతులు, ఇండ్ల రకాలు(కాంక్రీట్, పూరిళ్లు మొదలైన) వివరాల్ని జనగణనలో సేకరిస్తారు.

### ఎన్పీఆర్, ఎన్నార్సీ మధ్య తేడా ఏమిటి?

దేశంలోని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న సాధారణ నివాసితుల వివరాల్ని ఎన్పీఆర్ ద్వారా సేకరిస్తారు. దేశంలో, విదేశాల్లో నివసిస్తున్న భారతీయ పౌరుల వివరాలు ఎన్నార్సీలో ఉంటాయి. ఎన్నార్సీలో ఉన్న భారత పౌరులు సాధారణ వివరాలతో పాటు పౌరసత్వం పొందిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్, జాతీయ గుర్తింపు సంఖ్య మొదలగునవి కలిగి ఉంటారు.



- నేషనల్ డెస్క్

## ఎన్పీఆర్‌కు ఎన్నార్సీకి సంబంధం లేదు

- ఎన్నార్సీకి ఎన్పీఆర్ సమాచారాన్ని ఉపయోగించం
- ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఎన్పీఆర్ ఆధారం
- దాంట్లో పేరు లేకపోయినా పౌరసత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు
- ఎన్నార్సీపై ప్రధాని చెప్పింది నిజమే
- దేశవ్యాప్త ఎన్నార్సీపై ఎలాంటి చర్చ జరుగలేదు: అమిత్‌షా వెల్లడి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:** జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) మధ్య ఎలాంటి సంబంధం లేదని, రెండూ వేర్వేరు ప్రక్రియలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఎన్పీఆర్ కింద సేకరించే సమాచారాన్ని ఎన్నార్సీ కోసం ఉపయోగించబోమన్నారు. ఎన్నార్సీ, పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మంగళవారం ఏఎన్ఐ వార్తాసంస్థతో మాట్లాడిన ఆయన ఈ మేరకు స్పష్టతనిచ్చారు. 'ఎన్పీఆర్ అనేది జనాభా రిజిస్టర్. ఎన్నార్సీ అనేది పౌర రిజిస్టర్. రెండింటి మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎన్పీఆర్ డేటాను ఎన్నార్సీకి ఉపయోగిస్తారని ప్రజలెవ్వరూ, ప్రత్యేకించి మైనార్టీలు.. మన ముస్లిం సోదరులు భయపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఎన్పీఆర్ ఆధారం. ఇల్లు ఎక్కడ ఉంది, ఎన్ని పశువులు ఉన్నాయి వంటి వివరాలు ఎన్పీఆర్‌లో కొత్తగా చేరవచ్చు' అని ఆయన వివరించారు. దేశవ్యాప్త ఎన్నార్సీకి కేంద్రం ప్రణాళికలు రచిస్తున్నదన్న వార్తల నేపథ్యంలో నిరసనలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసోంలో చేపట్టిన ఎన్నార్సీ ప్రక్రియలో సుమారు 19 లక్షలమంది జాబితాలో చోటు కోల్పోయారు. ఎన్నార్సీని, సీఏఏని ఇప్పటికే వ్యతిరేకిస్తున్న బీజేపీయేతర రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రభుత్వాలు ఎన్పీఆర్‌ను అమలుచేయబోమని ప్రకటించాయి. దీనిపై స్పందించిన అమిత్‌షా.. వారితో తాను మాట్లాడుతానని, ఈ విషయంలో రాజకీయాలు తగవని చెప్తానన్నారు. కొన్ని పార్టీలు ఎన్పీఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయని, దీని వల్ల మైనార్టీలకు ప్రభుత్వ పథకాలు అందకుండా పోతాయన్నారు. సీఏఏ మాదిరిగానే ఎన్పీఆర్‌పైనా కొందరు భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 'ఎన్పీఆర్ అధికారులు వచ్చినప్పుడు సంబంధిత పత్రాలపై ఉన్న గడుల్లో టిక్ కొడితే పనైపోతుంది. ఎలాంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆధార్ అవసరం కావచ్చు. మీ వద్ద ఉంటే ఇవ్వడానికి సమస్య ఏమిటి? ఏ ఒక్కరి జాతీయతపైనా ఎన్పీఆర్ ప్రభావం చూపబోదు. ఎన్పీఆర్‌లో ఎవరి పేరైనా లేకపోయినా, వారి పౌరసత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు. గతంలో యూపీఏ చేపట్టిన ఎన్పీఆర్ ప్రక్రియనే మేం అనుసరిస్తున్నాం' అని అమిత్ షా వివరించారు. 'ఎన్నార్సీపై ఇప్పుడు చర్చ అనవసరం. ప్రధాని మోదీ చెప్పింది నిజమే. క్యాబినెట్‌లో గానీ, పార్లమెంట్‌లో గానీ దీనిపై ఎలాంటి చర్చ జరుగలేదు' అని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎన్నార్సీని అమలుచేస్తామని ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనికి విరుద్ధంగా ఆదివారం ప్రధాని మోదీ, తాజాగా అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## సీఏఏను వెనక్కి తీసుకోవాలి: ఒవైసీ



మహబూబ్‌నగర్ సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

**మహబూబ్‌నగర్ టౌన్:** దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తున్నామని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. సీఏఏను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ మతతత్వ విధానం దేశాన్ని అస్థిరతకు గురి చేస్తుందని ధ్వజమెత్తారు. స్వార్థ పూరిత ఆలోచనలను కేంద్రం మానుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)పై చర్చించనే లేదని ప్రధాని మోదీ అంటారని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎన్నార్సీని అమలు చేస్తామని చెబుతున్నారని, ఎవరి మాట నిజమని ప్రశ్నించారు. సీఏఏను కేంద్రం వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు హమీద్ మహ్బూద్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ పీర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## జార్ఖండ్ సీఎంగా హేమంత్

- 29న ప్రమాణం
- సీఏఏ, ఎన్పీఆర్‌లను అమలు చేయబోం: సొరేన్



ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని కోరుతూ గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న హేమంత్ సొరేన్

**న్యూఢిల్లీ/ రాంచీ:** జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కార్య నిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సొరేన్ ఈ నెల 29 మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రమాణం చేయనున్నారు. మంగళవారం జేఎంఎం శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన హేమంత్.. తన తండ్రి-జేఎంఎం అధినేత శిబూ సొరేన్, ఇతర నేతలు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, కాంగ్రెస్ జార్ఖండ్ ఇన్‌చార్జి ఆర్పీఎన్ సింగ్‌లతో కలిసి రాష్ట్ర గవర్నర్ ద్రౌపది ముర్మును కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. తనకు మద్దతు తెలుపుతున్న 50 మంది ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు అందజేశారు. 81 స్థానాల జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జేఎంఎం సారథ్యంలోని కూటమి 47 స్థానాలను గెలుచుకుని అధికార బీజేపీని మట్టి కరిపించిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం జరిగిన జేఎంఎం శాసనసభా పక్ష భేటీకి హాజరైన జేవీఎం నేత బాబూలాల్ మరాండీ.. హేమంత్‌కు బేషరతుగా మద్దతు తెలిపారు. హేమంత్ సొరేన్ పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఒక్క పౌరుడినైనా తమ రాష్ట్రం నుంచి పంపించేయాల్సిన పరిస్థితి ఉంటే పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) జార్ఖండ్‌లో అమలు చేయబోమని తెలిపారు. 'సీఏఏ' పూర్వా పరాలు తెలుసుకున్న తర్వాతే ముందుకు వెళతామని చెప్పారు. జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)పై సంపూర్ణంగా సమీక్షిస్తామని స్పష్టం చేశారు. 'జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ఈ రోజు ముందుకు వచ్చింది. దీనిపై సంపూర్ణంగా సమీక్షించిన తర్వాతే అమలుపై నిర్ణయం తీసుకుంటాం. ఒకవేళ ఒక్క జార్ఖండ్ వాసినైనా బయటకు పంపేయాల్సిన పరిస్థితి వస్తే దీన్ని కూడా అమలు చేయబోం' అని తేల్చి చెప్పారు. విభజన వాద విధానాలను అమలు చేసిన బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు ఓటేశారని, ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలే ప్రథమ ప్రాధాన్యంగా తాము ముందుకు వెళతామని చెప్పారు. భూమి లేని పేదలకు భూమిపై హక్కులు కల్పించడంపైనే తాము దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్-రేషన్ దుకాణాలు)తో ఆధార్ అనుసంధానాన్ని తొలిగించడంతోపాటు పీడీఎస్‌ను హేతుబద్ధీకరించడం తమ ప్రాధాన్యాల్లో ఒకటి అని, నిరుద్యోగ సమస్య పరిష్కారంతో పాటు తాగు, సాగునీటి వసతులను అందుబాటులోకి తేవడమే తమ సర్కార్ ప్రధాన ఎజెండాగా ఉంటుందన్నారు.

**జేఎంఎం శాసనసభ పక్ష నేతగా హేమంత్ సొరేన్**

జేఎంఎం శాసనసభ పక్ష నేతగా హేమంత్ సొరేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మంగళవారం ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కూటమి పార్టీలు కాంగ్రెస్-ఆర్జేడీతో మంగళవారం రాత్రి సొరేన్ ఓ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు.. ఆ సమావేశానికి జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్) అధ్యక్షుడు బాబూలాల్ మరాండీని కూడా ఆహ్వానించినట్టు పేర్కొన్నాయి. జేఎంఎం కూటమికి తమ పార్టీ మద్దతు ఉంటుందని జేవీఎం-పీ తెలిపింది.

### జేఎంఎంకు ఓట్లు తగ్గినా అధికారం దక్కింది

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్జేడీలతో కలిసి ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్న జేఎంఎం పార్టీ 2014 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి రెండు శాతం ఓట్లను కోల్పోవటం గమనార్హం. ఈ ఎన్నికల్లో జేఎంఎంకు 18.7 శాతం ఓట్లు లభించాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 19 స్థానాలకే పరిమితమైన జేఎంఎం ఈ దఫా 30 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 16, ఆర్జేడీ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. జేఎంఎం కూటమి సాధారణ మెజారిటీ (41) కంటే ఆరు స్థానాలను అధికంగా కైవసం చేసుకున్నది. మరోవైపు గత ఎన్నికల్లో 31.26 శాతం ఓట్లతో 37 నియోజకవర్గాల్లో గెలుపొందిన బీజేపీ ఈ దఫా 25 స్థానాలకు పరిమితమైనా ఓట్ల శాతాన్ని రెండు శాతం (33.37%) పెంచుకున్నది. అఖిల జార్ఖండ్ విద్యార్థి సంఘం (ఏజేఎస్‌యూ) రెండు చోట్ల, జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం) మూడు చోట్ల గెలుపొందగా, నాలుగు స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. కాంగ్రెస్ ఈ దఫా సీట్లను, ఓట్ల శాతాన్ని పెంచుకోవడం విశేషం. 2014లో తొమ్మిది నియోజకవర్గాల్లో గెలుపొందిన కాంగ్రెస్ 10.46 శాతం ఓట్లు పొందింది. తాజా ఎన్నికల్లో 13.88 శాతం ఓట్లతో 16 సీట్లు గెలుచుకున్నది. 2014 ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేసిన జేఎంఎం.. ఈ దఫా కాంగ్రెస్, ఆర్జేడీలతో పొత్తు వల్ల 43 నియోజకవర్గాల్లోనే అభ్యర్థులను నిలపడం వల్ల దాని ఓటింగ్ శాతం తగ్గిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) జార్ఖండ్ శాఖ సమన్వయకర్త సుధీర్ పాల్ తెలిపారు.

# ఎన్పీఆర్ సవరణ!




క్యాబినెట్ సమావేశం అనంతరం విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ప్రకాశ్ జవదేకర్

మొదటిపేజీ తరువాయి...

సమాచారంతోపాటు బయోమెట్రిక్ వివరాలు కూడా ఉంటాయని అందులో తెలిపారు. 2021 జనభా లెక్కల సేకరణ తొలి విడుత ప్రక్రియతోపాటే వచ్చే ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య ఎన్పీఆర్ ప్రక్రియను చేపట్టనున్నారు. 2010లో యూపీఏ హయంలోనే తొలిసారిగా ఎన్పీఆర్ ప్రక్రియను చేపట్టినట్లు జవదేకర్ తెలిపారు. ఎన్పీఆర్‌లో నమోదుచేసుకున్న వారికి నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కార్డులను కూడా పంపిణీ చేశారని గుర్తుచేశారు. 'ఇది మంచి కార్యక్రమం. పదేండ్ల తర్వాత దీన్ని మేం సవరిస్తున్నాం. వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు తమిళనాడు, బెంగాల్, ఒడిశా, మిజోరం తదితర రాష్ట్రాల ప్రభుత్వాలు ఎన్పీఆర్ డాటాను వినియోగిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల, సౌభాగ్య వంటి పథకాలకు కూడా ఈ సమాచారాన్ని ఉయోగించనున్నాం' అని జవదేకర్ వివరించారు. పలు బీజేపీయేతర రాష్ట్రాలు దీన్ని అమలుచేయబోమని ప్రకటించడంపై విలేకరులు ప్రశ్నించగా.. 'ఎన్పీఆర్‌పై అన్ని రాష్ట్రాలు ఇదివరకే నోటిఫికేషన్లు విడుదలచేశాయి. సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నాయి' అని బదులిచ్చారు. మరోవైపు, ఎన్నార్సీకి ఎన్పీఆర్ ఆధారం అని తమ ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదని ఆయన పేర్కొన్నారు. ఎన్పీఆర్ డాటాను వినియోగించి ఎన్నార్సీని రూపొందిస్తామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంట్‌లో పేర్కొన్న విషయాన్ని విలేకరి ప్రస్తావించగా ఆయన పై విధంగా బదులిచ్చారు.

**సంక్షేమ పథకాలకు, భద్రత బలోపేతానికి..**

ఎన్పీఆర్ వల్ల దేశంలోని ప్రతి కుటుంబం, వ్యక్తికి సంబంధించిన సమాచారం లభిస్తుందని, జాతీయ భద్రతకు, సామాజిక పథకాలను పారదర్శకంగా, సమర్థంగా అమలుచేసేందుకు ఇది దోహదపడుతుందని కేంద్ర హోం శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఎన్పీఆర్ డాటాతో ఎన్నార్సీని రూపొందించే ప్రతిపాదన లేదని చెప్పారు. వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సమర్థంగా పంపిణీ చేసేందుకు ప్రతి కుటుంబం, వ్యక్తికి సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని రూపొందించడమే ఎన్పీఆర్ ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్పీఆర్‌కు జనన, మరణ ధ్రువీకరణను లింక్ చేయడం ద్వారా భవిష్యత్తులో రిజిస్టర్ ఆధారిత జనగణనకు మార్గం ఏర్పడుతుందని వివరించారు.

**'సింగిల్ పాయింట్' మిలిటరీ అడ్వైజర్..**

దాదాపు రెండు దశాబ్దాల కిందట కార్గిల్ సమీక్ష కమిటీ చేసిన సిఫార్సు మేరకు ప్రభుత్వానికి సింగిల్ పాయింట్ మిలిటరీ సలహాదారుగా వ్యవహరించేందుకు కొత్తగా రక్షణ దళాధిపతిని(సీడీఎస్) నియమించేందుకు రక్షణ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సీడీఎస్ అధ్యక్షతన మిలిటరీ వ్యవహారాల విభాగాన్ని ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. సీడీఎస్‌కు నాలుగు స్టార్‌లు ఉంటాయని, త్రివిధ దళాధిపతులతో సమానంగా జీతభత్యాలు ఉంటాయని చెప్పారు. సీడీఎస్ బాధ్యతలు, విధివిధానాలకు సంబంధించి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ రూపొందించిన నివేదికనూ మంత్రివర్గం ఆమోదించిందని అధికారులు తెలిపారు.

**దివాళా చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు ఆమోదం**

దివాళా చట్టంలో పలు సందిగ్ధతలను తొలగించేందుకు చట్టాన్ని సవరించేందుకు వీలుగా ఆర్డినెన్స్ జారీ చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తాజా సవరణతో చట్టంపై మరింత స్పష్టత రానుందని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా పెరుగుతాయని కేంద్ర మంత్రి జవదేకర్ తెలిపారు. కాగా, పర్యాటక రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2,400 కోట్లు విడుదల చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు గుజరాత్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో భూగర్భ జలవనరులు పెంపొందించేందుకు రూ.6,000 కోట్లతో చేపట్టిన అటల్ భుజల్ పథకానికి కూడా ఆమోద ముద్ర వేసింది.

### రైల్వేల పునర్వ్యవస్థీకరణ



రైల్వే బోర్డు సభ్యుల సంఖ్యను సగానికి సగం తగ్గించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న ఎనిమిది మంది సభ్యులకు బదులుగా ఇకపై నలుగురే (చైర్మన్ కాకుండా) ఉండనున్నారు. అలాగే వివిధ క్యాడర్లు, శాఖలను ఒకే గొడుగు కిందకు తెస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. రైల్వేల పునర్వ్యవస్థీకరణతో శాఖాపరమైన సమస్యలకు ముగింపు లభిస్తుందని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ట్రాఫిక్, రోలింగ్ స్టాక్, ట్రాక్షన్, ఇంజనీరింగ్ విభాగాల రైల్వే బోర్డు సభ్యులకు బదులుగా కొత్తగా ఏర్పాటుచేయబోయే బోర్డులో ఆపరేషన్, బిజినెస్ డెవలప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫైనాన్స్ శాఖల నుంచి ఒక్కొక్కరు ఉంటారని చెప్పారు. అలాగే ఇండస్ట్రీ, ఫైనాన్స్, ఎకనమిక్స్, మేనేజ్‌మెంట్ రంగాల్లో 30 ఏండ్ల అనుభవం ఉన్న పలువురు స్వతంత్ర సభ్యులు కూడా ఉంటారని తెలిపారు. ఇకపై రైల్వేలో ఎనిమిది సర్వీసులకు బదులుగా 'ఇండియన్ రైల్వే సర్వీస్' ఒక్కటే ఉండనుంది. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), వైద్య సేవల విభాగం అలాగే కొనసాగనుండగా, మిగిలిన అన్ని విభాగాలూ ఉమ్మడి రైల్వే నిర్వహణ వ్యవస్థ కిందకు రానున్నాయి. రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు యూపీఎస్సీ, సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించి కొత్తగా ఇండియన్ రైల్వేస్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌ను ఏర్పాటుచేస్తామన్నారు.

# ఆరువేల ఎకరాల్లో అద్భుత వనసంపద

- కొండపాక, తొగుట మండలాల్లో అనుకూలంగా అటవీ ప్రాంతం
- క్షేత్రస్థాయి పరిశీలనలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రవణ్



సిద్దిపేట జిల్లా పెద్దమాసాన్‌పల్లి అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న అటవీ అధికారులు

**కొండపాక:** సిద్దిపేట జిల్లా కొండపాక, తొగుట మండలాల్లో అద్భుతమైన వనసంపద ఉన్నదని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సీ శ్రవణ్ అన్నారు. ఇటీవల గజ్వేల్‌లో జరిగిన సభలో సీఎం కేసీఆర్ కొండపాక మండలంలోని అటవీ ప్రాంతాన్ని ఔషధ మొక్కలతో ప్రత్యేక పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శ్రవణ్.. సిద్దిపేట జిల్లా అటవీఅధికారి శ్రీధర్‌తో కలిసి మంగళవారం కొండపాక, తొగుట మండలంలోని పెద్దమాసాన్‌పల్లి అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్న సాగర్ నిర్మాణంలో 1,327 హెక్టార్ల అటవీ భూమి ముంపునకు గురికాగా 2 వేల హెక్టార్లకుపైగా అటవీ భూమి అందుబాటులో ఉన్నదన్నారు. ఈ అటవీ ప్రాంతంలో కొండలు, గుట్టలతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. ఇక్కడి ఖాళీస్థలంలో ఔషధమొక్కలు, లెమన్‌గ్రాస్, ఇతర ప్రత్యేక మొక్కలను నాటడం ద్వారా అటవీ స్వభావమే మారిపోనున్నదన్నారు. కొండలు, గుట్టలు ఉన్నందున అడ్వెంచర్ పార్కులు, పర్యాటకకేంద్రంగా మలిచేందుకు అనుకూలంగా ఉన్నదన్నారు. దీన్ని ఆనుకొని మల్లన్నసాగర్ నిర్మాణం జరుగుతున్నందున త్వరలో అటవీ స్వరూపం పూర్తిగా మారిపోనున్నదని తెలిపారు.

## నేడు ప్రధాన ఆలయాల మూసివేత

సూర్యగ్రహణం నేపథ్యంలో..

**బాసర/పాపన్నపేట:** సంపూర్ణ సూర్యగ్రహణాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని పలు ప్రధాన ఆలయాలను బుధవారం మూసివేయనున్నారు. నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని బుధవారం సాయంత్రం 6.15 గంటలకు మూసివేసి, గురువారం ఉదయం 11.30 గంటలకు తెరిచి శుద్ధి, సంప్రోక్షణ, సరస్వతీ అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు సర్వ దర్శన సేవలను కల్పించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. కాగా మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గామాత ఆలయాన్ని బుధవారం సాయంత్రం 6 గంటలకు మూసి వేయనున్నారు. 26న గ్రహణం ముగిసిన తరువాత మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ సంప్రోక్షణ నిర్వహించి దర్శనం కోసం భక్తులకు అనుమతించనున్నారు.

# రైతు చెంతకు వీఆర్వో..!

- హైదరాబాద్‌కు వెళ్లి మహిళా రైతు వేలిముద్రల సేకరణ
- అభినందించిన గ్రామస్థులు



హైదరాబాద్‌లో ఉన్న మహిళా రైతు యాదమ్మ నివాసంలో వేలిముద్రలు సేకరిస్తున్న వీఆర్వో

**స్టేషన్‌ఘన్‌పూర్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో అర్హులందరికీ న్యాయం జరుగుతున్నది. రైతు చెంతకు రెవెన్యూ అధికారులు వెళ్లి సేవలు అందిస్తున్న తీరును ప్రజలు ప్రశంసిస్తున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలకు చెందిన సీత యాదమ్మ అనే మహిళా రైతు హైదరాబాద్‌లో ఉంటున్నది. తను పక్షవాతంతో లేవలేని పరిస్థితిలో ఉన్నది. ఆ మహిళా రైతుకు ఉన్న పట్టాదారు పాసుపుస్తకానికి సంబంధించిన ఈకేవైసీ బయోమెట్రిక్ చేయాల్సి ఉంది. అయితే, ఆమె ఇక్కడకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో రమేశ్ ఆదేశాల మేరకు మంగళవారం వీఆర్వో ఝాన్సీ హైదరాబాద్‌లో ఉన్న యాదమ్మ నివాసానికి వెళ్లి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా మహిళా రైతు రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్వో ఝాన్సీని ఆర్డీవో, గ్రామస్థులు అభినందించారు.





నిజామాబాద్ జిల్లా తగిలేపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

## అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- తగిలేపల్లిలో 40 ఇండ్లు ప్రారంభం

**వర్ని:** ఇండ్లులేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లిలో 40 డబుల్ బెడ్‌రూంఇండ్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పోచారం మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు అందించిన సబ్సిడీ రుణంతో పేదలు ఇండ్లు కట్టుకోలేక పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులతో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నదని చెప్పారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఆరువేల ఇండ్లు మంజూరయ్యాయని, ఇందులో కొన్ని పూర్తికాగా.. మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయన్నారు. అధికారుల సమక్షంలో సర్వే చేపట్టి పేద, నిరుపేదలను గుర్తించి ఇండ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు.

# కేసీఆర్ కిట్లు @ 5,89,818

- రూ.620.41 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- సర్కారు దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు
- గతంలో 25 శాతం.. ఇప్పుడు 62 శాతం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భవిష్యత్‌తరాలకు ఆరోగ్యవంతమైన నవజాత శిశువులను అందించడం, సర్కారు దవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచడం, మాతా శిశు మరణాలను తగ్గించడం లక్ష్యంగా.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కేసీఆర్ కిట్ల పథకం సత్ఫలితాలనిస్తున్నది. ఈ పథకం మొదలయ్యాక సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. గతంలో ప్రసవాలు 25 శాతం ఉండగా.. కేసీఆర్ కిట్ల పథకం అమలుతో 62 శాతానికి పెరిగింది. 2017 జూన్ మూడున కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఏడాది నవంబర్ చివరినాటికి 5,89,818 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లను అందజేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.620.41 కోట్లు వెచ్చించింది. అమ్మఒడి పథకం కింద గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, కేసీఆర్ కిట్ల కోసం ఈ మొత్తం ఖర్చుచేసింది.

**కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభించిన నాటినుంచి ఆన్‌లైన్‌లో నమోదైన గర్భిణులు, అర్హులు, ప్రసవాలు, కిట్లు అందుకున్నవారి సంఖ్య**

| 40 నెలల్లో పథకం అమలు | 2017-18 | 2018-19 | 2019-20 | మొత్తం |
|---|---|---|---|---|
| గర్భిణుల ఆన్‌లైన్ నమోదు | 5,82,106 | 6,13,469 | 4,07,316 | 16,02,891 |
| అర్హులైన లబ్ధిదారుల సంఖ్య | 4,07,474 | 4,60,102 | 4,25,809 | 12,93,385 |
| ప్రసవాలు | 4,38,731 | 4,74,693 | 3,32,301 | 12,45,725 |
| కేసీఆర్ కిట్లు అందుకున్నవారు | 2,02,183 | 2,42,275 | 1,45,360 | 5,89,818 |

దేశంలో మరెక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్.. బాలింతల కోసం 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ల పథకం అమలుచేస్తున్నారు. ఈ పథకం అమలుతీరును దేశవ్యాప్తంగా పలు రాష్ర్టాలకు చెందిన ప్రతినిధులు సైతం పరిశీలించి ప్రశంసలు కురిపించారు.

### ఏటా పెరుగుతున్న ప్రసవాల సంఖ్య

కేసీఆర్ కిట్ పథకం మొదలైన నాటినుంచి సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య ఏటా పెరుగుతున్నది. ఈ పథకం ప్రారంభం కాకముందు రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ప్రసవాలు జరిగితే.. పథకం మొదలైన 2016-17 ఆర్థిక సంవత్సరంలో 2,09,130 ప్రసవాలు చేశారు. 2017-18లో 2,80,823 ప్రసవాలు, 2018-19 2,90,001 ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో నిర్వహించారు.

## భవిష్యత్‌లో బీడు భూములు కనిపించవు

- మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలే..
- మంత్రి నిరంజన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ చేపడుతున్న పథకాలతో భవిష్యత్‌లో బీడు భూములు కనిపించవని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూరులో టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వాలు ఏర్పాటుకావడం, సమయం గడిచిపోవడం సాధారణంగా ఉండేదన్నారు. కానీ, టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక మార్పులు కండ్లకుకట్టినట్టు కనిపిస్తున్నాయన్నారు. పెద్దమందడి మండలంలో కృష్ణా జలాలు రాని గ్రామంలేదంటే అతిశయోక్తి కాదన్నారు. ప్రస్తుతం పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ ద్వారా దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని.. మండలంలో మరో 22 మినీలిఫ్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఘనవిజయం సాధిస్తుందని చెప్పారు.

# ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి

మంత్రి అల్లోల, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్



సదర్మాట్ బరాజ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్మితా సబర్వాల్

**నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల రైతాంగానికి సాగు నీరు అందించేందుకు నిర్మిస్తున్న ప్రాజెక్టులు, బరాజ్‌ల పనుల్లో వేగం పెంచాలని అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యేలు జోగు రామన్న, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఈఎన్సీలు మురళీధర్, కృపాకర్‌రెడ్డితో కలిసి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించిన వారు.. సదర్మాట్, చనాక-కొరట బరాజ్ పనులను ఏరియల్‌వ్యూతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, ఆయకట్టుకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. అనంతరం సదర్మాట్, చనాక-కొరట, కాళేశ్వరం 27, 28వ ప్యాకేజీలతోపాటు మిషన్ భగీరథ పురోగతిపై నిర్మల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతాంగానికి సకాలంలో సాగునీరు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని వీటిని త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. సదర్మాట్, కాళేశ్వరం 27, 28వ ప్యాకేజీలతో 1.28లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని జూన్‌లోగా ఈ పనులను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందేలా చూడాలని మంత్రి ఆదేశించారు. సదర్మాట్ బరాజ్ నిర్మాణంతో భూములు నష్టపోయిన రైతులకు రూ.35 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.45 కోట్లను త్వరలోనే అందిస్తామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మిషన్ భగీరథ పనులను జనవరి నెలాఖరులోగా పూర్తి చేసి ఇంటింటికీ తాగునీరు అందించాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడవులు ఎక్కువగా ఆదివాసీలు ఉన్న ప్రాంతాలు ఉన్నాయని ఇక్కడ మిషన్ భగీరథ నీటిని త్వరితగతిన అందించే ప్రయత్నం చేయాలన్నారు. అంతకుముందు సదర్‌మాట్ ప్రాజెక్టు గెస్ట్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు.

## నేటినుంచి యాసంగికి ఎస్సారెస్పీ నీరు

12 లక్షల ఎకరాల ఆయకట్టుకు..

**తిమ్మాపూర్, నమస్తేతెలంగాణ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎగువ, దిగువ ఆయకట్టుకు బుధవారం నుంచి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన నీటిని విడుదల చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 15 నుంచే యాసంగి పంటలకు నీటిని విడుదల చేయాలని భావించినప్పటికీ వరికోతలు పూర్తి కాకపోవడంతో ఈనెల 25 నుంచి మార్చి 15 వరకు ఎనిమిది రోజులు ఆన్, 7 రోజులు ఆఫ్ పద్ధతిన నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్టు ఎస్సారెస్పీ సీఈ శంకర్ తెలిపారు. ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ రిజర్వాయర్ పరిధిలోని స్టేజ్-1 కింద 9,68,640 ఎకరాలు, స్టేజ్-2 కింద 2.50 లక్షల ఎకరాలు మొత్తం 12,18,640 ఎకరాల ఆయకట్టుకు నీటిని ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 90 టీఎంసీలకుగాకు 88.662 టీఎంసీలు, ఎల్‌ఎండీలో 24 టీఎంసీలకు గాను 22.707 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు సీఈ తెలిపారు.



మహబూబ్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## పురపోరులో గులాబీ జెండా ఎగురాలె

టీఆర్‌ఎస్ కార్యకర్తలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

**మహబూబ్‌నగర్, నమస్తేతెలంగాణ:** త్వరలో జరగనున్న పురపోరులో అన్ని మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. టీఆర్‌ఎస్ సీనియర్ నేతలు సమష్టిగా పనిచేసి గెలుపు గుర్రాలకు టికెట్లు ఖరారు చేస్తారన్నారు. టికెట్లు రాని వారు బాధపడొద్దని, వచ్చిన వారు పొంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. చైర్మన్ అభ్యర్థిని అధిష్ఠానం నిర్ణయిస్తుందని, ఎవరూ అనవసర ప్రచారాలు చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ ఇసాక్, సింగిల్ విండో చైర్మన్ కొరమోని వెంకటయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధా అమర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడిపై సామూహిక లైంగిక దాడి

- ఏడు నెలలుగా అఘాయిత్యం
- ఆలస్యంగా వెలుగులోకి.. ఆరుగురి రిమాండ్

**కోదాడరూరల్:** బాలుడిపై కొన్ని నెలలుగా ఆరుగురు వ్యక్తులు సామూహికంగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన సూర్యాపేట జిల్లా కోదాడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లి ఫిర్యాదుమేరకు ఆరుగురు నిందితులపై కేసు నమోదుచేసిన పోలీసులు మంగళవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోదాడ పట్టణ సీఐ శ్రీనివాసులరెడ్డి వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన బాలుడిని క్రికెట్ ఆడుకుందామంటూ పిలిచి ఆరుగురు వ్యక్తులు ఏడు నెలలుగా లైంగిక దాడికి పాల్పడుతున్నారు. విషయాన్ని ఆ బాలుడు తల్లికి చెప్పడంతో ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 377 ఐపీసీ, పోక్సో చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నిందితుల్లో ఐదుగురు మైనర్లు ఉండటంతో నల్లగొండ జువైనల్ జస్టిస్ కోర్టు, మరో నిందితుడు నవీన్‌కుమార్‌ను కోదాడ జేఎఫ్‌సీఎం కోర్టుకు రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు.



యాభై ఏండ్ల క్రితం రచించిన అంపశయ్య నవలను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణమూర్తి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, రామాచంద్రమౌళి, సాహితీవేత్తలు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, స్వప్న. చిత్రంలో రచయిత అంపశయ్య నవీన్ కూడా ఉన్నారు.

## సమకాలీన అంశాలతో రచనలు చేయాలి

- రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణమూర్తి
- అంపశయ్య నవీన్ నవలా పురస్కారాల ప్రదానం

**సుబేదారి:** సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా అంపశయ్య నవీన్ రచనలు ఉన్నాయని రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణమూర్తి కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్ 79వ పుట్టిన రోజు సందర్భంగా అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్‌లో నవలా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయితలు రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణమూర్తి, రామాచంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ప్రొఫెసర్ బన్న ఐలయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రథమ బహుమతి నామని సుజనాదేవి, ద్వితీయ బహుమతి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ, ప్రత్యేక బహుమతి ఝాన్సీ కొప్పిశెట్టికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు.. అంపశయ్య నవీన్ 50 ఏండ్ల క్రితం రచించిన అంపశయ్య నవలను ఆవిష్కరించారు. అనంతరం అంపశయ్య నవీన్ మాట్లాడుతూ తాను రచించిన అంపశయ్య నవలను 1969లో వెలువరించానని, 50 ఏండ్లు అవుతున్నా దానికి ఆదరణ ఏ మాత్రం తగ్గలేదన్నారు.



కరీంనగర్‌లో లబ్ధిదారుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి కొప్పుల

## పేదలకు కొండంత అండ సీఎంఆర్‌ఎఫ్

ఎస్సీసంక్షేమ శాఖ మంత్రి ఈశ్వర్

**ధర్మపురి, నమస్తే తెలంగాణ:** ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ఎస్సీసంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, పెగడపల్లి, ధర్మారం, వెల్గటూర్, గొల్లపెల్లి, బుగ్గారం మండలాలకు చెందిన 98 మందికి రూ.31 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సమైక్యరాష్ట్రంలో ఏనాడూ తెలంగాణ ప్రజలను పట్టించుకోలేదన్నారు.

## ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

**మహబూబ్‌నగర్ క్రైం:** అవినీతికి పాల్పడుతున్నారనే కారణంతో మహబూబ్‌నగర్ జిల్లాలోని ముగ్గురు పోలీసు సిబ్బందిని ఎస్పీ రెమారాజేశ్వరి మంగళవారం సస్పెండ్ చేశారు. మిడ్జిల్ పీఎస్‌కు చెందిన ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఎండీ సాదతుల్లా, చంద్రనాయక్, మూసాపేట పీఎస్‌లో పనిచేస్తున్న రాజు ఇసుక దందాలో వసూళ్లకు పాల్పడుతున్నారని తేలింది. దీంతో వారిని సస్పెండ్ చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

## సమత కేసులో సాక్షుల విచారణ

**ఆదిలాబాద్, నమస్తేతెలంగాణ ప్రతినిధి:** ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టులో సమత కేసు విచారణ కొనసాగుతున్నది. ఆదిలాబాద్ జైలు నుంచి ముగ్గురు నిందితులు షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ మగ్దూమ్‌లను పోలీసు బందోబస్తు నడుమ ఏడోరోజైన మంగళవారం ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఆరుగురు సాక్షులను విచారించాల్సి ఉండగా, రాంనాయక్ తండాకు చెందిన ఇద్దరు, ఎల్లాపటార్‌కు చెందిన మరొకరిని విచారించిన కోర్టు.. ఈ కేసు విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## లారీ-స్కూటీ ఢీ: అక్కాతమ్ముడి దుర్మరణం

**రామచంద్రాపురం:** రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడు దుర్మరణం చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన సుష్మలత(19) పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్, ఆమె తమ్ముడు సాయితేజ సంగారెడ్డిలోని తార కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. వీరిద్దరు మంగళవారం మధ్యాహ్నం అమీన్‌పూర్ నుంచి పటాన్‌చెరుకు స్కూటీపై వెళ్తుండగా ఆర్సీపురం సంగీత టాకీస్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్నది. దీంతో స్కూటీపై ఉన్న అక్కాతమ్ముడు కిందపడటంతో తలకు బలమైన గాయాలు కావడంతో వారు అక్కడికక్కడే మరణించారు.

## మందమర్రిలో పులి సంచారం

**మందమర్రి:** మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి సమీపంలోని పెద్దవాగు, పంట పొలాల్లో ఇటీవల పులి సంచరించిన నేపథ్యంలో అటవీ అధికారులు మంగళవారం దాని పాదముద్రలను గుర్తించారు. గ్రామానికి చెందిన మల్లేశ్ పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లినప్పుడు పులి సంచరించినట్టు గుర్తించి గ్రామస్థులకు చెప్పాడు. ఈ మేరకు అందుగులపేట, ర్యాలీగడ్‌పూర్ సెక్షన్ అధికారులు సంతోష్, నగేష్, విజయ్, బీట్ ఆఫీసర్లు సకారాం, రత్నసింధు గ్రామానికి చేరుకొని పులి పాదముద్రలను పరిశీలించారు. పెద్దవాగు నుంచి చిన్నవాగు వరకు పాదముద్రలు ఉన్నట్టు గుర్తించారు. పులిబొక్కలగుట్ట వైపు వెళ్లి ఉంటుందని భావిస్తున్నారు. అందుగులపేట, బొక్కలగుట్ట, ఊరు మందమర్రి గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

హాస్టల్ భవనం పైనుంచిపడి

## జేఎన్టీయూ విద్యార్థి మృతి



అఖిల్‌కుమార్ (ఫైల్)

**పుల్కల్:** ప్రమాదవశాత్తు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ భవనం పైనుంచి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూహెచ్‌లో చోటుచేసుకున్నది. కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న అఖిల్‌కుమార్ మంగళవారం ఉదయం తుంగభద్ర హాస్టల్ మూడో అంతస్తు పిట్టగోడపై కూర్చొని పండ్లు తోముకుంటున్నాడు. ఈ క్రమంలో కింద ఉన్న స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడుతుండగా అదుపు తప్పి భవనం పైనుంచి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతోపాటు చేతులు విరిగి తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి స్నేహితులు ప్రిన్సిపాల్ బాలూనాయక్‌కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న క్రమంలో అఖిల్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. అఖిల్‌కుమార్ స్వగ్రామం వరంగల్ రూరల్ జిల్లా దామర మండలం సింగరాజుపల్లి. తండ్రి కుమారస్వామి వ్యవసాయం చేస్తూ అఖిల్‌ను ఇంజినీరింగ్ చదివిస్తున్నాడు. పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| మెదక్ | 12.6 | 30.9 |
| సంగారెడ్డి | 13.2 | 34.6 |
| వికారాబాద్ | 13.3 | 32.3 |
| సిద్దిపేట | 14.3 | 32.1 |
| మంచిర్యాల | 15.3 | 32.1 |
| నల్లగొండ | 15.4 | 28.0 |
| ఆదిలాబాద్ | 15.4 | 29.3 |
| కరీంనగర్ | 15.9 | 32.4 |
| వరంగల్ రూరల్ | 16.0 | 27.0 |
| వనపర్తి | 16.9 | 32.7 |
| కామారెడ్డి | 17.0 | 28.0 |
| యాదాద్రి భువనగిరి | 17.0 | 28.0 |
| మహబూబాబాద్ | 17.0 | 28.0 |
| నిర్మల్ | 17.0 | 29.0 |
| సూర్యాపేట | 17.0 | 29.0 |
| జనగామ | 17.1 | 28.0 |
| వరంగల్ అర్బన్ | 17.5 | 27.5 |
| నిజామాబాద్ | 17.5 | 30.5 |
| హైదరాబాద్ | 18.0 | 27.0 |
| మేడ్చల్ | 18.0 | 27.0 |
| పెద్దపల్లి | 18.0 | 28.0 |
| రాజన్న సిరిసిల్ల | 18.0 | 28.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 18.0 | 29.0 |
| ములుగు | 18.0 | 29.0 |
| నాగర్‌కర్నూల్ | 18.0 | 29.0 |
| జయశంకర్ భూపాలపల్లి | 18.0 | 29.0 |
| జగిత్యాల | 18.0 | 29.0 |
| రంగారెడ్డి | 18.0 | 30.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 18.0 | 30.0 |
| మహబూబ్‌నగర్ | 19.0 | 30.2 |
| నారాయణపేట | 19.0 | 30.2 |
| ఖమ్మం | 19.0 | 31.0 |
| జోగుళాంబ గద్వాల | 19.0 | 31.0 |



# టెస్టు కెప్టెన్ కోహ్లీ.. వన్డే సారథి ధోనీ

## దశాబ్దపు ఉత్తమ జట్లను ప్రకటించిన క్రికెట్ ఆస్ట్రేలియా

**మెల్‌బోర్న్:** దశాబ్ద కాలంగా మైదానంలో దుమ్మురేపుతున్న టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీలకు అరుదైన గౌరవం దక్కింది. గత పదేండ్ల ప్రదర్శన ఆధారంగా క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అధికారిక వెబ్‌సైట్ ప్రకటించిన ఈ దశాబ్దపు టెస్టు జట్టుకు కోహ్లీ, వన్డే జట్టుకు ధోనీ కెప్టెన్‌లుగా ఎంపికయ్యారు. టెస్టు జట్టులో భారత్ నుంచి విరాట్ మాత్రమే చోటు దక్కించుకోగా.. 12వ ప్లేయర్‌గా అశ్విన్ ఎంపికయ్యాడు. ఈ జట్టులో అత్యధికంగా ఇంగ్లండ్ నుంచి నలుగురు, ఆసీస్ నుంచి ముగ్గురు, దక్షిణాఫ్రికా, భారత్ నుంచి ఇద్దరు (అశ్విన్‌ను కలుపుకొని), న్యూజిలాండ్ నుంచి ఒకరు చోటు దక్కించుకున్నారు. అయితే బ్యాటింగ్ ఆర్డర్‌లో మాత్రం కోహ్లీ రెగ్యులర్ స్థానం నాలుగులో కాకుండా ఐదులో చోటు కల్పించారు. ఈ జట్టులో ఓపెనర్లుగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్, ఆస్ట్రేలియా ఆటగాడు డేవిడ్ వార్నర్.. మూడో స్థానంలో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్, ఆ తర్వాత ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, విరాట్ కోహ్లీ చోటు దక్కించుకున్నారు. వికెట్ కీపర్‌గా దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్, ఆల్‌రౌండర్‌గా బెన్ స్టోక్స్ ఎంపికయ్యారు. పేస్ విభాగంలో స్టెయిన్, స్టువర్ట్ బ్రాడ్, జేమ్స్ అండర్సన్.. స్పిన్నర్‌గా నాథన్ లియాన్‌కు అవకాశం దక్కింది. మహేంద్రసింగ్ ధోనీకి వన్డే జట్టు పగ్గాలు అప్పగించిన సీఏ.. టీమ్ఇండియా నుంచి మహీతో పాటు కోహ్లీ, రోహిత్‌కు చోటు కల్పించింది. ఆసీస్ నుంచి స్టార్క్‌కు మాత్రమే చాన్స్ దక్కగా.. దక్షిణాఫ్రికా నుంచి ఆమ్లా, ఏబీ.. బంగ్లా నుంచి షకీబ్.. ఇంగ్లండ్ నుంచి బట్లర్.. కివీస్ నుంచి బౌల్ట్.. అఫ్ఘనిస్థాన్ నుంచి రషీద్ ఖాన్.. లంక నుంచి మలింగ ఎంపికయ్యారు.



## విజ్డన్ జట్టు సారథిగానూ కోహ్లీ

ఈ దశాబ్దపు విజ్డన్ టెస్టు జట్టుకు కూడా విరాట్ కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. ఇందులో భారత్ నుంచి కోహ్లీతో పాటు అశ్విన్‌కు మాత్రమే చోటు దక్కింది. కుక్, వార్నర్, సంగక్కర, స్మిత్, స్టోక్స్, డివిలియర్స్, స్టెయిన్, రబడ, అండర్సన్ మిగిలిన స్థానాలు దక్కించుకున్నారు. ఇక విజ్డన్ వన్డే జట్టుకు భారత్ నుంచి కోహ్లీతో పాటు రోహిత్, ధోనీ ఎంపికయ్యారు. వార్నర్, డివిలియర్స్, బట్లర్, షకీబ్, మలింగ, స్టార్క్, బౌల్ట్, స్టెయిన్ మిగిలిన స్థానాలు దక్కించుకున్నారు.

# టెస్టుల్లోనూ టాపే


**దుబాయ్:** టీమ్ఇండియా సారథి విరాట్ కోహ్లీ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంతో ఈ ఏడాదిని ముగించాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలిచిన విరాట్ టెస్టుల్లో 928 పాయింట్లతో మొదటి స్థానంతో 2019కి వీడ్కోలు పలుకనున్నాడు. ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. భారత టెస్టు వైస్ కెప్టెన్ అజింక్యా రహానే ఒక స్థానం కోల్పోయి ఏడో స్థానానికి పరిమితమయ్యాడు. టాప్-10లో భారత్ నుంచి వీరిద్దరితో పాటు పుజారా (4వ స్థానం) కూడా ఉన్నాడు. లంకతో సిరీస్‌లో అదరగొట్టిన పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజమ్ కెరీర్ అత్యుత్తమ ఆరో ప్లేస్‌కు చేరాడు. మయాంక్ అగర్వాల్ 12వ, రోహిత్ శర్మ 15వ స్థానాల్లో నిలిచారు. గత కొంత కాలంగా గ్రౌండ్‌కు దూరంగా ఉన్న భారత ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆరో స్థానంలోనే ఉండగా.. ఆసీస్ స్టార్ పాట్ కమిన్స్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ 360 పాయింట్లతో శిఖరాన నిలిస్తే.. ఆస్ట్రేలియా (216), పాకిస్థాన్ (80), శ్రీలంక (80), న్యూజిలాండ్ (60), ఇంగ్లండ్ (56) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# బ్యాటింగ్ మర్చిపోలేదు




**న్యూఢిల్లీ:** విరామం అనంతరం ఆటను సరికొత్తగా ప్రారంభిస్తానని టీమ్ఇండియా ఓపెనర్ శిఖర్ ధవన్ అంటున్నాడు. జట్టుకు దూరమయ్యాను తప్ప.. బ్యాటింగ్ మర్చిపోలేదని అతడు పేర్కొన్నాడు. ఈ ఏడాదంతా గాయాలతో సతమతమైన గబ్బర్.. వచ్చే ఏడాది ఆరంభంలో శ్రీలంక, ఆస్ట్రేలియాతో సిరీస్‌ల్లో బరిలో దిగనున్నాడు. 'ఇది నాకు సరికొత్త ఆరంభం. ఈ ఏడాది మొదట చేతివేలు, ఆ తర్వాత మెడ, ఆపై కన్ను, ఆఖరున మోకాలికి గాయమైంది. ఇన్ని ప్రతికూలతల మధ్య శుభవార్త ఏంటంటే కొత్త ఏడాది రావడం. రాహుల్ బాగా ఆడుతున్నందుకు సంతోషం. అతడు అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నాడు. ఇక నేను నిరూపించుకోవాలి. ఆటగాడి జీవితంలో గాయాలు సహజం. వాటిని అంగీకరించక తప్పదు. గాయమైనంత మాత్రానా బ్యాటింగ్ మర్చిపోలేదు. నా క్లాస్ శాశ్వతం. పరుగులు చేయగలననే నమ్మకముంది. ఈ సీజన్ కీలకం. లంకతో పొట్టి సిరీస్‌లో రాణించాలి. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు తుదిజట్టును ఎంపిక చేయడం తలనొప్పే. వాళ్ల పని వాళ్లు చేస్తే.. నా పని నేను చేస్తా' అని ధవన్ వివరించాడు.

# కుక్క కోసం బొమ్మలు కొంటా




**మెల్‌బోర్న్:** ఐపీఎల్ వేలంలో తనకు దక్కిన భారీ మొత్తంతో.. ప్రియురాలి కోరిక మేరకు కుక్కపిల్లకు బొమ్మలు కొనాలనుకుంటున్నట్లు ఆస్ట్రేలియా పేసర్ పాట్ కమిన్స్ పేర్కొన్నాడు. గత వారం జరిగిన వేలంలో 15.5 కోట్లు వెచ్చించి ఈ కంగారూ ఫాస్ట్ బౌలర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీ దక్కించుకున్న విషయం తెలిసిందే. న్యూజిలాండ్‌తో బాక్సింగ్ డే టెస్టుకు ముందు కమిన్స్ మాట్లాడుతూ.. 'ఆ డబ్బుతో ఏం చేయాలో ఇంకా ఆలోచించలేదు. కానీ నా ప్రియురాలు మాత్రం ముందు కుక్క పిల్ల కోసం కొన్ని బొమ్మలు కొందామంటున్నది. ఆమె ప్లాన్స్ ఆమెకున్నాయి' అని అన్నాడు. ఇక కోల్‌కతాతో చేరడంపై అతడు స్పందిస్తూ.. 'ఆటతీరులో పెద్దగా మార్పులు చేయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా. అదృష్టవశాత్తు నా చుట్టూ చక్కటి బృందం ఉంది. ఆటను ప్రేమిస్తున్నా కాబట్టే ఈ స్థితికి చేరా' అని కమిన్స్ చెప్పాడు.

# జాతీయస్థాయి మిక్స్‌డ్ నెట్‌బాల్ టోర్నీ షురూ




జాతీయ స్థాయి మిక్స్‌డ్ నెట్‌బాల్ పోటీలను మంగళవారం కరీంనగర్‌లో ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తదితరులు

**కరీంనగర్ స్పోర్ట్స్:** కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో మంగళవారం జాతీయ స్థాయి మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత క్రీడా రంగంలో కరీంనగర్ దూసుకుపోతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ఉద్యోగ నియామకాల్లో రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో 13 రాష్ర్టాలకు చెందిన 130 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు హాజరయ్యారు. మొదటి రోజు జరిగిన అండర్-21 విభాగం పూల్-సిలో ఆతిథ్య తెలంగాణ 10-11తో ఉత్తర్‌ప్రదేశ్ చేతిలో పోరాడి ఓడింది. మిగతా మ్యాచ్‌ల్లో మహారాష్ట్ర 15-9తో తమిళనాడుపై, పశ్చిమబెంగాల్ 17-3తో ఆంధ్రప్రదేశ్‌పై, హర్యానా 10-7తో నేషనల్ క్యాపిటల్ రీజియన్‌పై, చత్తీస్‌గఢ్ 19-2తో ఢిల్లీపై విజయాలు సాధించాయి.

రౌండప్ 2019

# రాకెట్లకు ఏమైంది?



క్రీడాభిమానులంతా క్రికెట్ జపం చేసే మనదేశంలో.. ఆస్థాయి కాకున్నా ఇటీవలి కాలంలో బాగా ఆదరణ పొందిన ఆటేదైనా ఉందంటే అది బ్యాడ్మింటనే. హైదరాబాదీ షట్లర్ సైనా నెహ్వాల్ లండన్ (2012) ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గడంతో ఒక్కసారిగా దేశంలో బ్యాడ్మింటన్‌కు క్రేజ్ పెరిగింది. రియో (2016) ఒలింపిక్స్‌లో తెలుగమ్మాయి పూసర్ల వెంకట (పీవీ) సింధు రజతం చేజిక్కించుకోవడంతో అది అమాంతం ఆకాశాన్నంటింది. ఇక అప్పటి నుంచి సూపర్ సిరీస్‌లు, మాస్టర్ సిరీస్‌లు నెగ్గుతూ మన షట్లర్లు భవిష్యత్తు మీద ఆశలు రేపడంతో.. యావత్ జాతి త్వరగానే బ్యాడ్మింటన్‌ను అక్కున చేర్చుకున్నది. అయితే టోక్యో (2020) ఒలింపిక్స్‌కు ముందు కీలకమైన దశలో ఈ ఏడాది మన షట్లర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు చారిత్రక స్వర్ణం నెగ్గడం మినహాయిస్తే.. 2019లో భారత్ ఖాతాలో ఒక్క మేజర్ టైటిల్ కూడా చేరలేదు. పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంటే.. డబుల్స్‌లో మేమున్నామంటూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ దూసుకురావడం శుభపరిణామం. అన్నింటికి మించి యువ కెరటం లక్ష్యసేన్ ఐదు టైటిల్స్‌తో అదుర్స్ అనిపించాడు. ఈ ఏడాది కాస్త మోదం మరికాస్త ఖేదంగా ముగిసిన భారత షట్లర్ల ప్రయాణాన్ని ఓసారి పరిశీలిస్తే..

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

గత రెండు విశ్వక్రీడల్లో వరుసగా కాంస్య, రజత పతకాలు నెగ్గిన భారత షట్లర్లు టోక్యోలో స్వర్ణం సాధిస్తారని భావిస్తున్న తరుణంలో.. 2019 మన షట్లర్లకు పీడకలను మిగిల్చింది. పీవీ సింధును ఎన్నాళ్లుగానో ఊరిస్తు వస్తున్న ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణం దక్కడం మినహా మనవాళ్లకు ఈ యేడు పెద్దగా కలిసిరాలేదు. అస్థిర ప్రదర్శనలు, నిలకడ లోపించడం, ర్యాంకుల్లో దిగజారడం వెరసి మన స్టార్లు ఈ ఏడాదిని నిరాశాజనకంగా ముగించారు. ప్రతి రంగంలో మాదిరిగానే బ్యాడ్మింటన్ లోనూ కొన్ని ఉత్థానపతనాలు నమోదయ్యాయి. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రకాశ్ పదుకొనే తర్వాత 36 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. భమిడిపాటి సాయి ప్రణీత్ కాంస్యం చేజిక్కించుకుంటే.. పురుషుల డబుల్స్‌లో రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ బీడబ్ల్యూఎఫ్ సూపర్-500 థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్ నెగ్గి చరిత్ర సృష్టించింది. మరోవైపు స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్, సైనా నెహ్వాల్ ఆట రోజు రోజుకు తీసికట్టుగా తయారైంది.



### జోరుమీదున్న సాత్విక్ జోడీ

పురుషుల డబుల్స్‌లో మాత్రం ఈ ఏడాది ఆశాజనకంగానే సాగింది. తెలుగబ్బాయి రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. బీడబ్ల్యూఎఫ్ సూపర్-500 థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్ నెగ్గడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత ద్వయంగా చరిత్రకెక్కింది. ఆ వెంటనే ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో ఫైనల్ చేరి తమ ప్రదర్శన గాలివాటం కాదని నిరూపించింది. మహిళల డబుల్స్‌లో తెలంగాణ షట్లర్ ఎన్.సిక్కిరెడ్డి-అశ్విని పొన్నప్ప ద్వయం ఆకట్టుకోలేకపోయింది. 13 టోర్నీల్లో ఈ జంట తొలి రౌండ్‌లోనే ఓడి నిరాశ పరిచింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.



## ఆశలు రేపుతున్న లక్ష్యసేన్

ఓవైపు సీనియర్లు నిరాశ పరుస్తుంటే.. యువ ఆటగాడు లక్ష్యసేన్ మాత్రం వరుస విజయాలతో దూకుడు మీదున్నాడు. 109వ ర్యాంక్‌తో ఏడాదిని ప్రారంభించిన 18 ఏండ్ల లక్ష్యసేన్.. 77 స్థానాలు మెరుగుపర్చుకొని 32వ ర్యాంక్‌తో సీజన్ ముగించాడంటే అతడి జోరు ఎలా సాగిందో అర్థంచేసుకోవచ్చు. మూడు నెలల వ్యవధిలో బెల్జియం ఇంటర్నేషనల్, డచ్ ఓపెన్ సూపర్-100, సార్‌లార్‌లాక్స్ సూపర్- 100, స్కాటిష్ ఓపెన్, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ చాలెంజ్ ఇలా ఐదు టైటిల్స్ నెగ్గిన లక్ష్య భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నాడు. మరో యువ షట్లర్ సౌరభ్ వర్మ కూడా రెండు టైటిల్స్ ఖాతాలో వేసుకొని ఫర్వాలేదనిపించాడు. వియాత్నం ఓపెన్, హైదరాబాద్ ఓపెన్‌లో విజేతగా నిలువడంతో పాటు సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్-300 టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాడు.

## సత్తాచాటిన సాయి ప్రణీత్



ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గిన సాయి ప్రణీత్.. స్విస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలువడంతో పాటు పలు టోర్నీల్లో సెమీస్‌కు చేరి ఫర్వాలేదనిపించాడు. బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి అత్యుత్తమంగా ప్రపంచ 11వ ర్యాంక్‌తో ఏడాదిని ముగించాడు. రెండేండ్ల క్రితం వరుసగా నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు నెగ్గిన కిడాంబి శ్రీకాంత్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. గతేడాది కొద్ది రోజుల పాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో సైతం నిలిచిన కిడాంబి.. ఈ ఏడాది కేవలం ఇండియా ఓపెన్‌లో మాత్రమే ఫైనల్‌కు చేరాడు. మోకాలి గాయం కూడా అతడిని దెబ్బతీసింది. డెంగ్యూ కారణంగా సీజన్‌కు దూరమైన ప్రణయ్ 26వ స్థానంలో నిలిచాడు. అయితే భారత హెడ్ కోచ్ గోపీచంద్ మాత్రం 'ఏ రంగంలోనైనా గడ్డుకాలం సహజమే.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించగల సత్తా మన షట్లర్లలో ఉంది'అని అంటున్నాడు. గోపీచంద్‌తో పాటు ఈ ఏడాది టాన్ కిమ్ హర్ (మలేషియా), కిమ్ జు హ్యూన్ (కొరియా) రూపంలో ఇద్దరు విదేశీ కోచ్‌లు మనవాళ్లకు శిక్షణ ఇచ్చారు. మరో ఏడు నెల్లో ఒలింపిక్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. మనవాళ్లను తిరిగి గాడిన పెట్టాల్సిన గురుతర బాధ్యత గోపీచంద్‌పైనే ఉంది.

## ప్రపంచ చాంపియన్ సింధు..

ప్రతిష్ఠాత్మక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం నెగ్గాలని ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న భారత్‌కు ఈ ఏడాది ఆ ముచ్చట తీరింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు విజేతగా నిలిచింది. అంతకు ముందు ఈ మెగాటోర్నీలో రెండు కాంస్యాలు, రెండు రజతాలు ఖాతాలో వేసుకున్న సింధు ఈసారి ఎలాంటి పొరపాటు చేయకుండా వరుస విజయాలతో చరిత్ర తిరుగరాసింది. ఈ మెగాటోర్నీలో తొలిసారి పసిడి పతకం నెగ్గి రికార్డుల్లోకెక్కిన సింధు.. ఆ తర్వాత మాత్రం డీలా పడింది. మెగాటోర్నీకి ముందు వరుసగా ఐదుసార్లు ఫైనల్లో ఓటమి పాలై రజతాలు దక్కించుకున్న సింధు ఒకదశలో 'సిల్వర్ స్టార్'గుర్తింపు పొందింది. అయితే.. బాసెల్‌లో మాత్రం పూర్తి ఆధిపత్యం కనబర్చిన తెలుగమ్మాయి వరల్డ్ చాంపియన్‌గా అవతరించింది. ఆ తర్వాత తిరిగి ఫామ్ కోల్పోయిన పీవీ.. సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఈ ఏడాదిని మూడో ర్యాంక్‌తో మొదలెట్టిన సింధు ఆరో స్థానంతో ముగించింది. గాయాలతో సతమతమైన సైనా నెహ్వాల్ ఇండోనేషియా మాస్టర్స్ సూపర్-300 టోర్నీ నెగ్గినా అది ఆమె స్థాయికి తక్కువే అని చెప్పాలి.

# రంజీ బరిలో బుమ్రా



**సూరత్:** టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌ను పరీక్షించుకునేందుకు రంజీ ట్రోఫీలు ఆడనున్నాడు. నేటి నుంచి కేరళతో ప్రారంభం కానున్న దేశవాళీ సంప్రదాయ మ్యాచ్‌లో గుజరాత్ తరపున బుమ్రా బరిలో దిగనున్నాడు. హోమ్ సీజన్‌లో దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ముందు గాయం కారణంగా జట్టుకు దూరమైన బుమ్రా.. వచ్చే ఏడాది ఆరంభంలో శ్రీలంకతో జరిగే టీ20 సిరీస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. గాయం నుంచి కోలుకున్నాక ఇటీవల వైజాగ్ నెట్స్‌లో ప్రాక్టీస్ చేసిన బుమ్రా.. భారత బ్యాట్స్‌మెన్‌ను తన యార్కర్లతో ఇబ్బంది పెట్టాడు. అయితే బుధవారం నుంచి ప్రారంభమయ్యే మ్యాచ్‌లో బుమ్రా ప్రదర్శనను చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ దగ్గరుండి పరిశీలించనున్నాడు.

### ఢిల్లీతో హైదరాబాద్ అమీతుమీ

ఈ సీజన్‌లో వరుసగా రెండు పరాజయాలు మూటగట్టుకున్న హైదరాబాద్ జట్టు ఢిల్లీతో పోరాటానికి సిద్ధమైంది. మరోవైపు తొలి మ్యాచ్ 'డ్రా'చేసుకున్న ఢిల్లీ.. రెండో మ్యాచ్‌లో ఆంధ్ర చేతిలో పరాజయం పాలైంది. గాయం నుంచి కోలుకున్న టీమ్ఇండియా ఆటగాడు శిఖర్ ధవన్‌తో పాటు వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ బరిలో దిగనుండటంతో ఢిల్లీ జట్టు పటిష్ఠంగా కనిపిస్తున్నది. సొంతగడ్డపై ఆ జట్టును ఎదుర్కొనున్న హైదరాబాద్ శక్తికి మించి శ్రమించక తప్పదు.

# మెరిసిన మను, అనీశ్

జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్



**భోపాల్:** జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మను భాకర్, అనీశ్ భన్వాల్ పసిడి పతకాలతో మెరిశారు. మంగళవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో మను నాలుగు స్వర్ణాలను దక్కించుకోగా, అనీశ్ రెండు పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నాడు. మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో బరిలోకి దిగిన భాకర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 588 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఈ క్రమంలో దక్షిణాసియా క్రీడల్లో అన్నురాజ్ సింగ్ నెలకొల్పిన రికార్డును సమం చేసింది. ఎనిమిది మందితో కూడిన ఫైనల్లో 243 పాయింట్లతో స్వర్ణాన్ని దక్కించుకుంది. దేవాంశి ధామా (237.8), యశస్వినిసింగ్ దేశ్వాల్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ ఈవెంట్లలోనూ భాకర్ సత్తాచాటింది. మరోవైపు పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ తుదిపోరులో అనీశ్ 28 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. భవేశ్ షెకావత్ (26), విజయ్‌వీర్ సిద్ధు (22) ఆ తర్వాత స్థానాలు దక్కించుకున్నారు.

# భారీ పెరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీ

**మెల్‌బోర్న్:** వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ నుంచి మొదలయ్యే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీని నిర్వాహకులు ఈసారి భారీగా పెంచారు. గతేడాది పోల్చుకుంటే 13.6 శాతానికి పెంచుతూ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. దీంతో మొత్తం ప్రైజ్‌మనీ రూ.350 కోట్లకు చేరుకుంది. ఇందులో పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు నగదు బాహుమతి కింద రూ.20 కోట్లు దక్కనుంది. ఇక తొలి రౌండ్‌లోనే నిష్క్రమించే వారు రూ.44 లక్షలు, రెండో రౌండ్‌లో రూ.63 లక్షలు ఇవ్వనున్నట్లు టోర్నీ డైరెక్టర్ క్రేగ్ టిలే పేర్కొన్నారు. 'ప్రతి ఏడాది లాగే ఈసారి ప్రైజ్‌మనీ పెంచాము. రౌండ్ రౌండ్‌కు నగదు మొత్తం పెరుగుతూ పోతుంది. దీని ద్వారా చాలా మంది ఆటగాళ్లకు మరింత ఆదాయం సమకూరుతుంది' అని క్రేగ్ అన్నాడు. మిగతా గ్రాండ్‌స్లామ్ టోర్నీలతో పోల్చుకుంటే గత ఐదేండ్ల కాలంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీ 61.4 శాతం పెరిగింది.

# ఫెడ్‌కప్ జట్టులో సానియా



**న్యూఢిల్లీ:** టెన్నిస్ స్టార్ సానియా మీర్జా నాలుగేండ్ల తర్వాత భారత ఫెడ్‌కప్ జట్టులోకి వచ్చింది. 2016లో చివరిసారి ఫెడ్‌కప్ బరిలో దిగిన సానియా.. 2017 అక్టోబర్ నుంచి మైదానానికి దూరంగా ఉంటున్నది. గతేడాది బాబుకు జన్మనిచ్చిన సానియా.. గ్రౌండ్‌లో అడుగుపెట్టడం కోసం తీవ్రంగా శ్రమిస్తున్న విషయం తెలిసిందే. ఐదుగురు సభ్యులతో కూడిన జట్టులో భారత సింగిల్స్ నంబర్‌వన్ ప్లేయర్ అంకిత రైనా, రియా భాటియా, రుతుజ భోంస్లే, కర్మన్ కౌర్ థండీతో కలిసి సానియా భాగం పంచుకోనుంది. ఈ జట్టుకు విశాల్ ఉప్పల్ కెప్టెన్ కాగా.. అంకిత బాంబ్రీ కోచ్‌గా వ్యవహరించనుంది. తెలుగు ప్లేయర్ భవిశెట్టి సౌజన్య రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చైనా వేదికగా ఫెడ్‌కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మ్యాచ్‌లు జరుగనున్నాయి. చైనా, చైనీస్ తైపీ, ఇండోనేషియా, కొరియా, ఉజ్బెకిస్థాన్‌తో కలిసి బరిలో దిగనున్న భారత్.. రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో మిగిలిన ఐదు జట్లతో తలపడనుంది.

# తగ్గిన నిరర్థక ఆస్తులు

## సెప్టెంబర్ చివరినాటికి 9.1 శాతానికి • రిజర్వుబ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి

**ముంబై, డిసెంబర్ 24:**

మొండి బకాయిలను కట్టడి చేయడానికి అటు ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇటు రిజర్వుబ్యాంక్ తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. బ్యాంకుల ఆస్తుల నాణ్యత ప్రమాణాలు మెరుగుపడటంతో బ్యాంకుల మొండి బకాయిలు భారీగా తగ్గాయి. సెప్టెంబర్ 30తో ముగిసేకాలానికిగాను బ్యాంక్‌ల నిరర్థక ఆస్తుల విలువ అడ్వాన్స్‌లో 9.1 శాతానికి తగ్గినట్లు రిజర్వు బ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదిలో 11.2 శాతంగా ఉన్నది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను విడుదల చేసిన వార్షిక నివేదికలో బ్యాంకుల తీరును విశ్లేషించింది. ఇదే సమయంలో బ్యాంకుల నికర ఎన్‌పీఏ కూడా 6 శాతం నుంచి 3.7 శాతానికి దిగొచ్చింది. వరుసగా ఏడేండ్లుగా మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులకు ఇది శుభవార్త లాంటిదని, 2017-18లో 11.2 శాతంగా ఉన్న ఎన్‌పీఏల వాటా గతేడాదిలో 9.1 శాతానికి తగ్గినట్లు మంగళవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంనాటికి కూడా ఇంతే స్థాయిగా ఉన్నది. ప్రభుత్వరంగ బ్యాంకుల ఆస్తుల నాణ్యత ప్రమాణాలు పెంచడానికి నియంత్రణ మండలి ఆర్బీఐ తీసుకున్న చర్యలు ఇందుకు దోహదం చేశాయని, భవిష్యత్తులోనూ మరింత తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొంది. ఇదే సమయంలో కేవలం ప్రభుత్వరంగ బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ మొత్తం అడ్వాన్స్‌లో 11.6 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇది 14.6 శాతంగా ఉన్నది. అలాగే నికర ఎన్‌పీఏ మాత్రం ఏకంగా 8 శాతం నుంచి 4.8 శాతానికి దిగొచ్చింది.

### ప్రైవేట్ బ్యాంకులకు ఐడీబీఐ సెగ

ప్రభుత్వరంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల మొండి బకాయిలు భారీగా పెరిగాయి. ఐడీబీఐ బ్యాంక్ ఒక్కసారిగా రూ.10 వేల కోట్లకుపైగా నిరర్థక ఆస్తులను ప్రకటించడంతో మొత్తం బ్యాంకుల ఎన్‌పీఏలు పెరుగడానికి ప్రధాన కారణం. మొత్తంగా ప్రైవేట్ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.7 శాతం నుంచి 5.3 శాతానికి పెరుగగా, నికర ఎన్‌పీఏ 2.4 శాతం నుంచి 2 శాతానికి దిగొచ్చింది. బీమా దిగ్గజం ఎల్ఐసీ కొనుగోలుచేసిన ఐడీబీఐ బ్యాంక్ నిరర్థక ఆస్తులు భారీగా పెరుగడం ప్రైవేట్ రంగ బ్యాంకుల ఎన్‌పీఏలు పెరుగడానికి





ప్రధాన కారణమని విశ్లేషించింది. ఐడీబీఐ బ్యాంక్‌ను మినహాయిస్తే మాత్రం ప్రైవేట్ రంగ స్థూల నిరర్థక ఆస్తుల విలువ తగ్గుముఖం పట్టింది. వీటిలో ఒక ఐడీబీఐ బ్యాంక్ ఎన్‌పీఏనే 29.4 శాతంగా ఉన్నది.

### పారిశ్రామిక రంగంలోనే అధికం..

మిగతా రంగాలతో పోలిస్తే పారిశ్రామిక రంగంలోనే స్థూల నిరర్థక ఆస్తులు అధికంగానే ఉన్నాయని తాజా నివేదికలో ఆర్బీఐ వెల్లడించింది. సెప్టెంబర్ 2019 నాటికి ఉన్న మొండి బకాయిల్లో మూడింట రెండోవంతు ఈ రంగానివేనని స్పష్టంచేసింది. వీటి వాటా 17.4 శాతంగా ఉన్నది. మరోవైపు కమర్షియల్ బ్యాంకుల అధికంగానే ఉన్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరు మెరుగుపడుతుండటంతో ఇదే సమమంలో కమర్షియల్ బ్యాంకులు చతికిలా పడ్డాయి. రూ.5 కోట్ల కంటే అధికంగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన వారి వాటా 91%గా ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనూ ప్రైవేట్, ప్రభుత్వరంగ బ్యాంకులు మొండి బకాయిలతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

## రూ.71 వేల కోట్ల మోసాలు

### 2018-19లో బ్యాంకుల్లో 74% పెరిగిన మోసాలు



**బ్యాంకుల** మోసాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం సరిపోవడం లేదు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా బ్యాంకుల్లో జరిగిన మోసాల విలువ రూ.71,543 కోట్లు. అంతక్రితం ఏడాది జరిగిన రూ.41,167 కోట్ల మోసాలతో పోలిస్తే 74 శాతం అధికమని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2017-18లో బ్యాంకులను మోసం చేసిన కేసులు 5,916 కాగా, ఆ తర్వాతి ఏడాదిలో ఈ సంఖ్య 6,801కు చేరుకున్నాయి. వీటిలో ప్రభుత్వరంగ బ్యాంకులను అత్యధికంగా మోసం చేశారు. కేసుల్లో వీటి వాటా 55.4 శాతంగా ఉండగా, విలువలో 90.2 శాతంగా ఉన్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో జరుగుతున్న మోసాలపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం..ఫిబ్రవరి 2018లో ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. రూ.50 కోట్ల కంటే అధికంగా రుణాలను తీసుకొని బ్యాంకులను ఎగ్గొట్టిన వాటిని నియంత్రణ మండలి మోసాలుగా గుర్తించింది. 2018-19లో బ్యాంకింగ్ మోసాల్లో ప్రైవేట్ రంగ సంస్థల వాటా 30.7 శాతంగా ఉండగా, విదేశీ బ్యాంకుల వాటా 11.2 శాతంగా ఉన్నది. విలువపరంగా చూస్తే వీటి వాటా 7.7 శాతంగాను, 1.3 శాతంగా ఉన్నదని నివేదిక వెల్లడించింది. అత్యధిక శాఖలు కలిగిన ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే అధిక మోసాలు జరిగినట్లు, మొత్తం మోసాల్లో వీటి వాటానే 91.6 శాతంగా ఉన్నదని పేర్కొంది. మరోవైపు బ్యాంక్ అడ్వాన్స్ విభాగంలో 3,606 మోసాలు జరుగగా, వీటి విలువ రూ.64,548 కోట్లుగా ఉన్నది. విదేశీ ఎక్స్ఛేంజ్ లావాదేవీల్లో రూ.695 కోట్ల విలువైన 13 మోసాలు జరిగాయి.

# మెరిసిన ముకేశ్

## మందగమనంలోనూ ఈ ఏడాది పెరిగిన రూ.1.18 లక్షల కోట్ల సంపద

### రూ.4.33 లక్షల కోట్లకు చేరిక

### బ్లూంబర్గ్ బిలియనీర్స్ సూచీ తాజా నివేదిక • కలిసొచ్చిన ఆర్ఐఎల్ షేర్ల భారీ పెరుగుదల


**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:**



భారతీయ అపర కుబేరుడు ముకేశ్ అంబానీ సంపద ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. దేశం యావత్తూ ఆర్థిక మందగమనంలో ఉన్నా.. ముకేశ్ ఇంట మాత్రం సిరుల పంట పండింది. 2019లో ఏకంగా ముకేశ్ అంబానీ ఆస్తులు 16.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.18 లక్షల కోట్లు) ఎగబాకాయి. ఆసియా దేశాల్లోని సంపన్నులలోనే ఇది అత్యధిక సంపద పెరుగుదల అని బ్లూంబర్గ్ బిలియనీర్స్ సూచీ తాజాగా ప్రకటించింది. ఈ నెల 23 (సోమవారం) నాటికి ముకేశ్ సంపద విలువ సుమారు 60.8 బిలియన్ డాలర్లు (రూ.4.33 లక్షల కోట్లు)గా ఉన్నట్లు పేర్కొన్నది. దీంతో ప్రపంచ కుబేరుల్లో 12వ స్థానం దక్కింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేర్ల విలువ భారీగా పుంజుకోవడం కలిసొచ్చినట్లు వివరించింది. ఈ ఏడాది ఆర్ఐఎల్ షేర్ల విలువ రికార్డు స్థాయిలో 40 శాతం ఎగిసింది. ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ సూచీ లాభాల కంటే రెట్టింపునకుపైగా వృద్ధి చెందాయి. చమురు, గ్యాస్, టెలికం, రిటైల్ రంగాల్లో దూసుకుపోతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్.. త్వరలో ఈ-కామర్స్ వ్యాపారంలోకీ అడుగుపెడుతుండటం గమనార్హం. 2021 ఆరంభంకల్లా సంస్థను రుణ విముక్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న ముకేశ్.. గ్రూప్‌లోని జియో ఇతర వ్యాపారాలనూ విభజించి స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశపెట్టాలని చూస్తున్నారు. 35 కోట్లకుపైగా వినియోగదారులతో రిలయన్స్ జియో నికర ఆదాయం ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.996 కోట్లుగా నమోదైంది. ఇక ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆర్ఐఎల్ రుణ భారం రూ.1.54 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ చమురు, రసాయనాల వ్యాపారంలో సౌదీ ఆరామ్కోకు 20 శాతం వాటాను విక్రయిస్తున్న ఆర్ఐఎల్.. వచ్చే ఏడాది మార్చికల్లా ఈ లావాదేవీ పూర్తవుతుందని ఆశిస్తున్నది. దీనిద్వారా వచ్చే ఆదాయంతో రుణ భారాన్ని చాలావరకు తగ్గించుకోవాలని ముకేశ్ భావిస్తున్నారు.

### జెఫ్ బెజోస్‌కు దెబ్బ

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్‌కు ఈ ఏడాది చేదు అనుభవాన్నే మిగిల్చింది. బెజోస్ 13.2 బిలియన్ డాలర్ల సంపదను చేజార్చుకున్నారని తాజా బ్లూంబర్గ్ బిలియనీర్స్ సూచీ స్పష్టం చేసింది. మరోవైపు మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధిపతి బిల్‌గేట్స్ 2019లో 22.4 బిలియన్ డాలర్ల సంపదను పెంచుకున్నారు. దీంతో 113 బిలియన్ డాలర్లతో ప్రపంచ కుబేరుడిగా బిల్‌గేట్స్ మళ్లీ అవతరించారు. 112 బిలియన్ డాలర్లతో బెజోస్ రెండో స్థానానికి పడిపోయారు. బెర్క్‌షైర్ హాథవే చైర్మన్, సీఈవో వారెన్ బఫెట్ సంపద 5.04 బిలియన్ డాలర్లు పెరిగి 88.9 బిలియన్ డాలర్లను తాకింది. దీంతో నాల్గో స్థానంలో ఉన్నారు. ఫేస్‌బుక్ సారథి మార్క్ జూకర్‌బర్గ్ సంపద 26.7 బిలియన్ డాలర్లు పుంజుకుని 78.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఫలితంగా ప్రపంచ కుబేరుల్లో ఐదో స్థానంలో నిలిచారు. టాప్-10లో గూగుల్ వ్యవస్థాపకులు లర్రీపేజ్ (65 బిలియన్ డాలర్లు), సర్గే బ్రిన్ (63.1 బిలియన్ డాలర్లు)లున్నారు. ఇక అలీబాబా గ్రూప్ వ్యవస్థాపకుడు జాక్ మా సంపద విలువ ఈ సంవత్సరం 11.3 బిలియన్ డాలర్లు పెరిగి 43 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ప్రపంచ శ్రీమంతుల్లో 19వ స్థానంలో ఉన్నారని బ్లూంబర్గ్ తెలిపింది.


పల్లోంజీ మిస్త్రీ


అజీం ప్రేమ్‌జీ


శివ్ నాడర్


ఉదయ్ కొటక్

### టాప్-500లో 18 మంది భారతీయులు

బ్లూంబర్గ్ బిలియనీర్స్ సూచీ తాజా జాబితాలో టాప్-500లో 18 మంది భారతీయులకు చోటు దక్కింది. ఇందులో ముకేశ్ అంబానీ టాప్‌లో ఉండగా, 21.8 బిలియన్ డాలర్లతో తర్వాతి స్థానంలో పల్లోంజీ మిస్త్రీ ఉన్నారు. ప్రపంచ కుబేరుల్లో ఈయనది 47వ స్థానం. ఈ ఏడాది 1.18 బిలియన్ డాలర్ల సంపద పెరిగింది. టాప్-100లో 63వ స్థానంలో అజీం ప్రేమ్‌జీ (18.7 బిలియన్ డాలర్లు), 88వ స్థానంలో శివ్ నాడర్ (15.8 బిలియన్ డాలర్లు), 95వ స్థానంలో ఉదయ్ కొటక్ (15 బిలియన్ డాలర్లు) నిలిచారు. ఇంకా లక్ష్మీ మిట్టల్, రాధాకృష్ణ ధమాని, గౌతమ్ అదానీ, సైరస్ పూనవాలా, సునీల్ మిట్టల్, దిలీప్ సంఘ్వీ, సావిత్రి జిందాల్, నుస్లీ వాదియా, బెను గోపాల్ బంగూర్, కుమార మంగళం బిర్లా, రాహుల్ బజాజ్, కేపీ సింగ్, విక్రమ్ లాల్ చోటు సంపాదించారు. వీరిలో లక్ష్మీ మిట్టల్, దిలీప్ సంఘ్వీ, జిందాల్, వాదియా, బంగూర్, బిర్లా, లాల్ సంపద ఈ ఏడాది తరిగిపోయింది. మిగతా 11 మంది సంపద పెరిగినట్లు బ్లూంబర్గ్ వెల్లడించింది.

# చివరిగంటలో అమ్మకాలు

## వరుసగా రెండోరోజు మార్కెట్లకు నష్టాలు

### సెన్సెక్స్ 181, నిఫ్టీ 48 పాయింట్ల డౌన్ • నేడు మార్కెట్లకు సెలవు

**ముంబై, డిసెంబర్ 24:**

స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాలను మూటగట్టుకున్నాయి. తీవ్ర ఆర్థిక మాంద్యంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థకు మళ్లీ ఊతమివ్వాలంటే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) వ్యాఖ్యలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ప్రస్తుత నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడం, బుధవారం క్రిస్మస్ సందర్భంగా మార్కెట్లకు సెలవుకావడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. తీవ్ర ఒడిదుడుకుల మధ్య ప్రారంభమైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 181.40 పాయింట్లు నష్టపోయి 41,461.26 వద్ద పరిమితమవగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 48.20 పాయింట్లు పతనం చెంది 12,214.55 వద్ద స్థిరపడింది. చివరి గంటలో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మార్కెట్లు కుదేలయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల షేర్లు కుదుపునకు గురయ్యాయి. మార్కెట్లో హెచ్‌సీఎల్ టెక్ అత్యధికంగా 1.80 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, మారుతి, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీలు నష్టపోగా..ఇండస్ఇండ్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, భారతీ ఎయిర్‌టెల్, హీరో మోటోకార్ప్, ఎన్‌టీపీసీలు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే



ఇంధనం, చమురు అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, టెక్, పారిశ్రామిక రంగాలకు చెందిన షేర్లకు మదుపరుల నుంచి వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో 1.21 శాతం వరకు లాభపడగా, మెటల్, రియల్టీ, టెలికం, పవర్, యుటిలిటీ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మందకొడిగా కొనసాగుతున్నదని ఐఎంఎఫ్ నివేదిక మార్కెట్లను ప్రతికూలానికి పడేసిందని కొటక్ సెక్యూరిటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పతనమవడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ భగ్గుమనడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందన్నారు. దేశీయ కరెన్సీ విలువ 9 పైసలు క్షీణించి 71.27 వద్ద ముగిసింది.


# చిరు సంస్థలే దివిటీలు

## 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనలో ఎంఎస్ఎంఈలపై కేంద్రం అపార విశ్వాసం

### 2024 నాటికి జీడీపీలో 2 లక్షల కోట్ల డాలర్లుగా ఉండొచ్చని అంచనా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:**

దేశ ఆర్థిక వ్యవస్థను 2024 నాటికి 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్న మోదీ సర్కారు.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల నుంచి కనీసం 2 లక్షల కోట్ల డాలర్లు రాబట్టాలని చూస్తున్నది. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద ఈ ఏడాది 65,312 కొత్త సూక్ష్మ సంస్థలను నెలకొల్పినట్లు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ఈ క్రమంలోనే 5 లక్షల కోట్ల డాలర్ల జీడీపీలో ఎంఎస్ఎంఈల వాటా 2 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నది. '2024 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచే వీలున్నది. నిర్దేశిత లక్ష్యంలో ఎంఎస్ఎంఈ వాటా కనీసం 2 లక్షల కోట్ల డాలర్లుగానైనా ఉండాలని శ్రమిస్తున్నాం' అని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ తెలిపింది.



### భారీగా ఉపాధి అవకాశాలు

2019లో ఎంఎస్ఎంఈల పనితీరును సంబంధిత మంత్రిత్వ శాఖ సమీక్షించింది. పీఎంఈజీపీ కింద ఈ ఏడాది 5,22,496 ఉపాధి అవకాశాలను కల్పించిన సంస్థలు.. రూ.1,929.83 కోట్ల రాయితీ ప్రయోజనాన్ని పొందాయి. పీఎంఈజీపీ.. అతిపెద్ద రుణ అనుసంధానిత రాయితీ కార్యక్రమం. 2008-09 నుంచి ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ దీన్ని అమలుపరుస్తున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సంప్రదాయ కళాకారులు, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఇందుకుగాను వ్యవసాయేతర రంగంలో సూక్ష్మ సంస్థలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నది.


### జీడీపీ వాటా ఘనమే

భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఎంఎస్ఎంఈల పాత్ర ఘనంగానే ఉన్నది. దేశవ్యాప్తంగా 6.34 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలున్నాయి. తయారీ రంగ జీడీపీలో ఈ సంస్థల వాటా దాదాపు 6.11 శాతంగా ఉన్నది. ఇక సేవా రంగ జీడీపీలో 24.63 శాతం. మొత్తంగా దేశీయ ఉత్పత్తిలో 33.4 శాతం వాటాను కలిగి ఉన్నది. ఈ క్రమంలోనే ఈ చిరు సంస్థలపై కొండంత నమ్మకాన్ని కేంద్రం పెట్టుకుంటున్నది. ప్రస్తుతం దేశ వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఎంఎస్ఎంఈల బలోపేతంపై మోదీ సర్కారు దృష్టి సారించింది. 2024 లక్ష్యం నెరవేరాలంటే ఎంఎస్ఎంఈల పరిపుష్ఠి అవసరమే మరి.


# పీఎన్‌బీని ముంచిన జగదీశ్ ఖట్టర్

### రూ.110 కోట్లు ఎగ్గొట్టిన మారుతి ఉద్యోగ్ మాజీ ఎండీ.. సీబీఐ కేసు దాఖలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24:**



ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) మోసాలకు కేంద్ర బిందువు అవుతున్నది. ఇప్పటికే వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు వేల కోట్ల రూపాయలు రుణాలను తీసుకొని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోగా..తాజాగా మారుతి ఉద్యోగ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ జగదీశ్ ఖట్టర్ బ్యాంక్‌కు కోట్లిది ఎగనామం పెట్టారు. కట్టర్‌కు చెందిన కార్‌నేషన్ ఆటో ఇండియా లిమిటెడ్‌కోసం తీసుకున్న రుణాల్లో రూ.110 కోట్ల మేర నష్టం కలిగించినందుకుగాను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) తాజాగా కేసును దాఖలు చేసింది. 77 ఏండ్ల వయస్సు కలిగిన కట్టర్, కార్‌నేషన్ ఆటో సంస్థల్లో సోమవారం సోదాలు నిర్వహించినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. 1993 నుంచి 2007 మధ్యకాలంలో మారుతి ఉద్యోగ్ లిమిటెట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఆయన పదవీ విరమణ చేసే వరకు అక్కడే విధులు నిర్వహించారు. ఆ తర్వాతి క్రమంలో 2009లో కార్‌నేషన్ సంస్థను ప్రారంభించి పీఎన్‌బీ వద్ద రూ.170 కోట్ల మేర రుణం తీసుకున్నారు. ఈ రుణం 2015లోనే నిరర్థక ఆస్తిగా గుర్తించింది బ్యాంక్. ఖట్టర్, కార్‌నేషన్‌లు తనఖా పెట్టిన ఆస్తులను అనాధికారికంగా, అనుమతి లేకుండా విక్రయించినట్లు గుర్తించిన సీబీఐ..వీరిపై పలు సెక్షన్ల కింద కేసులను దాఖలు చేసింది కూడా. ఈ సీబీఐ కేసు దాఖలు చేయడంపై ఖట్టర్ ఎట్టకేలకు స్పందించారు. కార్‌నేషన్ వ్యాపారంలో విఫలమైందని, కానీ ఎలాంటి తప్పులు జరుగలేదని, ఆడిటింగ్‌లో ఎలాంటి అక్రమాలు జరుగలేదని, సీబీఐ దాడుల్లో ఎలాంటి అక్రమాలు బయటపడలేదని పీటీఐతో ఆయన అన్నారు. పీఎన్‌బీ ఫిర్యాదు మేరకు ఖట్టర్, కార్‌నేషన్‌లపై నేరపూరిత కుట్ర, మోసాలకు పాల్పడినందుకుగాను పలు సెక్షన్ల కింద కేసును దాఖలు చేసింది సీబీఐ. తాకట్టుకింద పెట్టిన ఆస్తుల్లో రూ.66.92 కోట్ల విలువైన ఆస్తులను అమ్మడంపై బ్యాంక్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించింది.



# హోండా దూకుడు

**ముంబై, డిసెంబర్ 24:** దేశంలో రెండో అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అమ్మకాలు దూకుడు ప్రదర్శించింది. కాలుష్యాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన బీఎస్-6 ప్రమాణాలకు లోబడి రూపొందించిన యాక్టివా స్కూటర్, నూతన బైకు ఎస్‌బీ 125లను సంయుక్తంగా 60 వేల యూనిట్లను విక్రయించినట్లు ప్రకటించింది. సరికొత్త యాక్టివాను సెప్టెంబర్‌లో మార్కెట్లోకి విడుదల చేసిన సంస్థ..నూతన బైకు ఎస్‌పీ 125ని నవంబర్ 20న అందుబాటులోకి తీసుకొచ్చింది సంస్థ. కాలుష్యాన్ని నియంత్రించడానికి కేంద్రం ఆటోమొబైల్ సంస్థలపై ప్రత్యేక ఆదేశాలు జారీచేసింది. ఈ మార్గదర్శకాలు వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడవుతున్న మోడళ్లలో ఒకటైన యాక్టివా స్కూటర్ ప్రారంభ ధరను రూ.67, 490గా నిర్ణయించిన సంస్థ..నూతన బైకు రూ.72 వేలుగా నిర్ణయించింది. ఈ మోటార్‌బైకు ఎస్‌పీ 125 అధిక మైలేజీ, ఆరేండ్ల వ్యారెంటీ కల్పించింది.

# తక్షణ చర్యలు అవసరం

### దేశ ఆర్థిక మందగమనంపై ఐఎంఎఫ్ హెచ్చరిక

**వాషింగ్టన్, డిసెంబర్ 24:** భారత్ ఇప్పుడు తీవ్ర ఆర్థిక మందగమనంలో ఉందని, తక్షణ చర్యలు అవసరమని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. ఈ దీర్ఘకాలిక మందగమనం ఇప్పుడప్పుడే పోయే వీల్లేదన్న ఐఎంఎఫ్.. పరిస్థితుల్ని దారిలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రభావవంతమైన నిర్ణయాలను తీసుకోవాలని కోరింది. గత కొన్నేండ్లలో జరిగిన భారతీయ ఆర్థిక వృద్ధి.. దేశంలో లక్షలాది మందికి పేదరికాన్ని దూరం చేసిందని, అయితే ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో పలు కారణాల రిత్యా ఆర్థిక మందగమనం చోటుచేసుకుందని తాజా నివేదికలో ఐఎంఎఫ్ తెలిపింది. 'భారత్‌లో ఇప్పుడు ఆర్థిక మందగమనమే అసలు సమస్య. గతంలో మేము ఊహించినట్లుగా ఈ సమస్య అంత త్వరగా సమసిపోయేలా లేదు' అని ఐఎంఎఫ్ ఆసియా, పసిఫిక్ విభాగంలో ఇండియా మిషన్ చీఫ్ రనీల్ సల్గడో పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. భారత్ ఇప్పుడు నడి సంద్రంలో నావలాగా దిక్కుతోచని స్థితిలో కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నిజానికి ఈ మందగమనాన్ని మేము తక్కువగా అంచనా వేశామని, దీని తీవ్రత చాలా ఎక్కువగానే కనిపిస్తున్నదని అన్నారు.




### రుణాన్ని తగ్గించుకోవాలి

రుణ భారాన్ని తగ్గించుకోవడంపై భారత్ దృష్టి పెట్టాలని ఐఎంఎఫ్ తమ తాజా నివేదికలో సూచించింది. ప్రభుత్వ రంగ రుణ అవసరాలను కట్టడి చేసుకుంటేనే కష్టాల నుంచి గట్టెక్కవచ్చని చెప్పింది. ద్రవ్యలోట్లలో కొంత మెరుగైన సంకేతాలు కనిపిస్తున్నా.. జీడీపీలో మాత్రం చెప్పుకోదగ్గ మార్పేమీ లేదన్నది. కాబట్టి ఆర్థిక పారదర్శకత అవసరమని పేర్కొన్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ 5 శాతానికి పడిపోగా, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఆరేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.5 శాతానికి దిగజారిన విషయం తెలిసిందే. ఇప్పటికే దేశ వృద్ధిరేటు అంచనాలకు ఇటు జాతీయ, అటు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు భారీగా కోత పెడుతున్న సంగతీ విదితమే.

### వినియోగ సామర్థ్యం పెరుగాలి

క్షీణించిన వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యలను వెంటనే ప్రారంభించాలని నిపుణులు కేంద్రానికి సూచిస్తున్నారు. మార్కెట్‌లో స్తబ్ధతకు వినియోగ సామర్థ్యం పతనమే కారణమంటున్న ఆర్థిక విశ్లేషకులు.. దాన్ని బలపరిస్తే పరిస్థితులు చక్కబడుతాయని అంటున్నారు. ఆటో, రిటైల్ రంగాల్లో కొనుగోళ్లు దారుణంగా పడిపోయిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఆటో రంగంలో వేలాది ఉద్యోగాలూ పోయాయి. దీంతో వినియోగ సామర్థ్యం పెరిగితే.. ఇటు ఉద్యోగాలతోపాటు అటు వృద్ధిరేటు పుంజుకుంటుందన్న అభిప్రాయాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఈ దిశగా ప్రభుత్వ నిర్ణయాలు, సంస్కరణలు, ఉద్దీపనలు రావాలని సూచిస్తున్నారు.



# అమ్మకాల్లో మారుతి డిజైర్ టాప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీకి చెందిన కాంప్యాక్ట్ సెడాన్ డిజైర్ అమ్మకాల్లో అగ్రస్థానంలో దూసుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో 1.2 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. కాంప్యాక్ట్ సెడాన్ విభాగంలో 60 శాతం వాటాతో తొలిస్థానంలో నిలిచిందని మారుతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్ అండ్ సేల్స్) శశాంక్ శ్రీవాత్సవ తెలిపారు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఈ కారులోపలు మార్పులు చేయడం వల్లనే అమ్మకాల్లో టాప్‌గేర్‌లో దూసుకుపోయయన్నారు. మే 2017లో మూడో జనరేషన్‌గా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఈ కారుకు దేశవ్యాప్తంగా 20 లక్షల మంది యజమానులు ఉన్నారు. గడిచిన పదేండ్లుగా సెడాన్‌లో తొలిస్థానంలో కొనసాగుతుండటం విశేషం.



ఎల్లమ్మబండ ఫోర్త్‌ఎస్టేట్ జర్నలిస్ట్ కాలనీలో మొక్క నాటిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ. చిత్రంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత, జర్నలిస్టులు కూడా ఉన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకొందాం

మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

**హైదర్‌నగర్:** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి అందరూ విరివిగా మొక్కలు నాటాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సూచించారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఎల్లమ్మబండ ఫోర్త్‌ఎస్టేట్ జర్నలిస్ట్ కాలనీలో గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించేందుకు సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, పాత్రికేయులుగానే కాకుండా పౌరులుగా తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. జర్నలిస్టులు తాము రాసే వార్తలతో ప్రజలను ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యేట్లుగా వారిలో చైతన్యం నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మారుతీసాగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శేఖర్‌సాగర్, జిల్లా నేతలు దయాసాగర్, వెంకటేశ్వర్లు, ఎర్ర యాకయ్య, నిమ్మల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, తీగల శ్యాం, కైలాష్, రాహుల్, హరికృష్ణ, ఆనంద్‌రావు, రహమాన్, మహేందర్, శ్రీధర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.





హరితహారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు వినూత్న పద్ధతులు అనుసరిస్తున్నారు నిజామాబాద్ జిల్లా రెంజల్ సర్పంచ్ మార్ల రమేశ్. గ్రామంలో నాటిన 120 మొక్కలకు నీరు పోసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ట్రాలీలో డ్రమ్ములను పెట్టి బైక్‌తో దాన్ని నడిపిస్తున్నారు. 30 రోజుల ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ట్రాలీని తయారు చేయించానని రమేశ్ తెలిపారు. ఇదే వాహనంతో చెత్తాచెదారాన్ని కూడా డంపుయార్డుకు తరలిస్తున్నామని వివరించారు. - రెంజల్





సాహిత్య సదస్సులో కవుల రచనలను ఆవిష్కరిస్తున్న అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి


## తెలంగాణ భాషాభివృద్ధికి కృషి

సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డి

**నాగర్‌కర్నూల్ టౌన్:** తెలంగాణ భాష, చరిత్రాభివృద్ధికి సాహిత్య అకాడమి కృషి చేస్తుందని అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఎన్ రెడ్డి సేవాసదన్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా సాహిత్య సమాలోచన రెండ్రోజుల సదస్సుకు నందిని సిధారెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సాహిత్య చరిత్ర రచనలో భాగంగా 32 జిల్లాల సాహిత్య చరిత్రను రాయించినట్లు వెల్లడించారు. గద్వాల జిల్లా చరిత్ర సంబరాజు రవిప్రకాశ్‌రావు, నాగర్‌కర్నూల్ జిల్లా చరిత్రను గుడిపల్లి నిరంజన్, వనపర్తి చరిత్రను కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి రాశారని తెలిపారు. తెలంగాణలో మరుగున పడిన కవిత్వాన్ని కవులకు గుర్తింపుతేవడానికి అవార్డులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని స్వరాష్ట్రం వచ్చిన తర్వాత నిలుపుకున్నామని చెప్పారు. సాహిత్యం, కథలు, కవిత్వం చదువటం వల్ల విద్యార్థుల్లో, సమాజంలో చైతన్యం వస్తుందని ఆ దిశగా కవులు, రచయితలు, విద్యార్థులు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

## సాగర్‌ను దర్శించిన థాయిలాండ్ బౌద్ధులు

**నందికొండ:** థాయిలాండ్‌కు చెందిన 25 మంది బౌద్ధ మతగురువులు మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. 'అజా ప్రతికం సుప్రీత్ రక్ష దమ్మ' ఆధ్వర్యంలో సాగర్‌కు వచ్చిన వీరు.. హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని, అనుపును సందర్శించారు. బుద్ధుడి పాదాల వద్ద పూజలు నిర్వహించారు. బుద్ధుడి మ్యూజియం, గోపురంపైన అమర్చిన శిల్పాలు, స్థూపం పార్కు, ధ్యానవనం, బుద్ధచరితవనం, మహాస్థూప పార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులోని మహాబోధి సొసైటీలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నామని.. అనంతరం హైదరాబాద్‌లోని మహాబోధి సొసైటీ సభ్యులతోకలసి నాగార్జునసాగర్‌ను సందర్శించినట్లు తెలిపారు. వీరితో మహాబోధి సొసైటీకి చెందిన సుగంధ, దమ్మపాల, బుద్ధపాల, టూరిజం గైడ్ సత్యనారాయణ, బుద్ధవనం సెక్యూరిటీ సూపర్‌వైజర్ విశ్వనాథశాస్త్రి ఉన్నారు.



బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల వద్ద పూజలు నిర్వహిస్తున్న థాయిలాండ్ బౌద్ధ మతగురువులు

# ప్రతి ఉద్యోగికి న్యాయం

- గచ్చిబౌలిసొసైటీలో సభ్యులందరికీ ప్లాట్లు
- సీఎం కేసీఆర్ ఎప్పటికీ ఉద్యోగులకు అనుకూలమే
- ఉద్యోగ నేతలపై వదంతులను నమ్మవద్దు
- బీటీఎన్జీవో కార్యవర్గ సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్




భాగ్యనగర్ టీఎన్జీవో కార్యవర్గ సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వోద్యోగులందరికి న్యాయం జరుగుతుందని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని.. అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం పబ్లిక్‌గార్డెన్స్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో భాగ్యనగర్ టీఎన్జీవో, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీ ఉద్యోగుల అంశాలపై రూపొందించిన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలోని తెలంగాణ ప్రాంత ఉద్యోగులకు నివాసస్థలాలు వస్తాయని హామీఇచ్చారు. సమైక్యాంధ్రలోనే ఉద్యోగులకు స్థలాలు కేటాయించినప్పటికి అప్పటి నేతలు తెలంగాణ ఉద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఏపీ ఎన్జీవో ఉద్యోగసంఘాల కుట్రతో కోట్ల రూపాయలు నష్టపోయామని.. తెలంగాణ ఉద్యోగుల వాటాను కూడా వారు అక్రమంగా కాజేశారని ఆరోపించారు. స్వరాష్ట్రంలో ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ఇప్పుడు ఏర్పాటైన బీటీఎన్జీవో, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ తెలంగాణ ఉద్యోగుల కోసమే పని చేస్తుందని చెప్పారు. సొసైటీలో సభ్యులందరికి ఇండ్ల స్థలాలు వస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉం టుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. దీనికి సం బంధించిన ప్రతి అంశంలో సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారన్నారు. ఉద్యోగసంఘాల నేతలపై కొందరు వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.

### ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

తెలంగాణ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ పేర్కొన్నారు. గచ్చిబౌలి సొసైటీలో ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందని హామీఇచ్చారు. సమావేశంలో బీటీఎన్జీవో, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, జేఏసీ సెక్రటరీ మామిళ్ల రాజేందర్, బీటీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, టీఎన్జీవో ప్రతినిధులు రామినేని శ్రీనివాస్‌రావు, ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఓడీఎఫ్ మంచిర్యాల'కు యునిసెఫ్ అభినందన

**మంచిర్యాల రూరల్:** మంచిర్యాలను ఓడీఎఫ్ జిల్లాగా తీర్చిదిద్దినందుకు కలెక్టర్ భారతి హోళికేరిని అభినందిస్తూ యునిసెఫ్ ప్రశంసాపత్రం అందజేసింది. స్వచ్ఛభారత్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొని, వినియోగించుకొనేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి విజయవంతమైనందుకుగాను అప్రిషియేషన్ సర్టిఫికెట్ అందజేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం, భాగస్వామ్యంతోనే ఓడీఎఫ్ సాధించగలిగామని కలెక్టర్ భారతి చెప్పారు.

## లాడ్జిలో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

బెంగళూరుకు చెందిన సమత్ శ్రీవాస్తవగా గుర్తింపు



సమత్ శ్రీవాస్తవ

**శంషాబాద్:** లాడ్జిలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం..బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మోహన్‌కుమార్ కుమారుడు సమత్ శ్రీవాస్తవ (21) బెంగళూరులోని సీఎమ్మార్‌ఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థి. సోమవారం అర్ధరాత్రి శంషాబాద్‌లోని ఎమ్మార్‌డోవెల్ హోటల్‌లో దిగాడు. పడుకొనేముందు హోటల్ సిబ్బంది నుంచి సెల్ చార్జర్ తీసుకున్నాడు. మంగళవారం ఉదయం చార్జర్ కోసం గది తలుపు తట్టగా తెరువలేదు. కిటికీలోంచి చూస్తే అచేతనంగా మంచంపై ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీవాస్తవ విషంలాంటి ద్రవం తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు తెలిపారు. కొంతకాలంగా అతను మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడని మృతుని కుటుంబీకులు చెప్పారని, బెంగళూరులో మిస్సింగ్ కేసు కూడా నమోదు చేశారని శంషాబాద్ పోలీసులు తెలిపారు.

## డాక్టర్ రామకృష్ణకు వెండి పతకం

72వ అఖిల భారత కామర్స్ సదస్సులో ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీలో జరుగుతున్న 72వ అఖిల భారత కామర్స్ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో యూజీసీ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ చేస్తున్న డాక్టర్ రామకృష్ణ బండారుకు వెండి పతకం లభించింది. 'వ్యవసాయ ఉత్పత్తుల్లో అపెడ పాత్ర, ఎగుమతుల మోడల్' అనే అంశంపై రామకృష్ణ సమర్పించిన పరిశోధనాపత్రాన్ని నిర్వాహకులు ఉత్తమ ద్వితీయ పరిశోధన పత్రంగా ఎంపికచేసి సిల్వర్ మెడల్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల నుంచి సుమారు రెండువేల మంది పాల్గొన్న ఈ సదస్సులో.. 1500 మంది తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. అంతమందిలో ఓయూకు చెందిన రామకృష్ణకు వెండి పతకం రావడం పట్ల కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు హర్షం వ్యక్తంచేశారు. ఈ విజయం వెనుక ఓయూ కామర్స్ ప్రొఫెసర్లున్నారంటూ రామకృష్ణ వాళ్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీలో 72వ అఖిల భారత కామర్స్ సదస్సులో ప్రశంసాపత్రం అందుకుంటున్న ఓయూ కామర్స్ విభాగానికి చెందిన డాక్టర్ రామకృష్ణ

## జనవరిలో మెట్రో మంత్లీపాస్

ప్రయాణికులకు మరో సౌకర్యం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రయాణికులకు మరో సౌకర్యాన్ని హైదరాబాద్ మెట్రోరైలు అందుబాటులో తెస్తున్నది. నెలవారీ మెట్రోరైలు పాస్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు హైదరాబాద్‌లో టీఎస్‌ఆర్టీసీ, ఎంఎంటీఎస్ మంత్లీపాస్‌లు అమల్లో ఉన్నాయి. కానీ, నగర ప్రయాణాన్ని మరింత సులభంచేసిన మెట్రోలో ఇప్పటివరకు ఎలాంటి పాస్‌లు లేవు. మెట్రోలో ప్రయాణికుల్లో చాలా మంది మెట్రోమంత్లీపాస్‌తోపాటు కామన్ కార్డు కోరుకుంటున్నారు. ఈ డిమాండ్ క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో జనవరిలో మంత్లీ మెట్రోపాస్‌లు అందుబాటులోకి రానున్నాయి. దీనికోసం ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఇప్పటికే ప్రక్రియ పూర్తిచేసింది. మార్గదర్శకాలను కూడా తయారుచేసినట్టు ఎల్‌అండ్‌టీ అధికారి ఒకరు తెలిపారు. మంత్లీపాస్‌ను నిర్ణీత స్టేషన్ల మధ్య జారీచేస్తామని పేర్కొన్నారు. ఉదాహరణకు.. మియాపూర్ నుంచి ఖైరతాబాద్ లేదా తార్నాక నుంచి హైటెక్‌సిటీ స్టేషన్ మధ్య నిత్యం ప్రయాణించేవారు మంత్లీపాస్ తీసుకునే వీలుంటుంది. ఇలా స్టేషన్ టూ స్టేషన్ పాస్‌లు ఇస్తారు. జేబీఎస్ టూ ఎంజీబీఎస్ వరకు కారిడార్-2లో ప్రస్తుతం మెట్రో ట్రయల్ రన్ నడుస్తున్నది. జనవరిలో ఇది ప్రారంభంకానున్నది. కారిడార్-2 కూడా అందుబాటులోకి వచ్చాకే మంత్లీపాస్ సౌకర్యాన్ని అమల్లోకి తేనున్నారు. కామన్ టికెట్‌ను కూడా అతిత్వరలో వినియోగంలోకి తేవాలని అధికారులు నిర్ణయించారు.

# డిప్రెషన్ బాధిస్తున్నది

- దేశంలో ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక సమస్యలు
- దక్షిణాదిలోనే అధికం.. తెలంగాణది ప్రథమస్థానం
- పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువ
- బాధితుల్లో అత్యధికులు 35-45 ఏండ్లవారే
- ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్ అధ్యయనంలో వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతున్నది. దేశంలో ప్రతి ఏడుగురిలో ఒకరు ఈ సమస్యలతో బాధపడుతుండగా.. వీరిలో దక్షిణ భారతీయులే అధికంగా ఉన్నట్టు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్ అధ్యయనంలో వెల్లడయింది. డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలతో బాధపడుతున్నవారిలో తెలంగాణ మొదటిస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, కేరళ, గోవా ఉన్నాయి. వివిధ మానసిక రుగ్మతలపై అధ్యయనంచేసిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ ఆ వివరాలను లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించింది. పురుషులతో పోల్చుకుంటే మహిళల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించింది. 2:1 నిష్పత్తిలో మహిళలు, పురుషులు ఈ రుగ్మతలతో బాధపడతున్నారు. హార్మోన్ల అసమతుల్యత, కుటుంబ ఒత్తిడి, పని భారం వంటివి దీనికి కారణమవుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. తెలంగాణలో 35 - 45 ఏండ్ల మధ్య వయసువారే డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్టు అధ్యయనంలో తేలింది. ఈ రుగ్మతలపై 1990 నుంచి 2017 వరకు డేటాను వైద్యులు అధ్యయనం చేశారు.

### 4.6 కోట్ల మందికి మానసిక సమస్యలు

దేశవ్యాప్తంగా నమోదవుతున్న మానసిక ఆరోగ్య సమస్యల కేసుల్లో 33.8 శాతం మంది డిప్రెషన్‌తో, 19 శాతం మంది ఆందోళనతో బాధపడుతున్నారు. మొత్తంగా దేశంలో 46 మిలియన్ల (4.6 కోట్ల) మంది డిప్రెషన్, ఆందోళనలకు గురవుతున్నారని సర్వేలో తేలింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో 1.9 శాతం ఎక్కువగా మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. డిప్రెషన్, ఆందోళనతోపాటు బైపోలార్ డిసార్డర్, అటెన్షన్ డెఫిషెన్సీ సిండ్రోమ్, ఈటింగ్ డిజార్డర్ వంటివి కూడా ప్రబలంగా ఉన్నాయని వైద్యులు చెప్తున్నారు. 1990వ సంవత్సరంతో పోలిస్తే 2017 నాటికి మానసిక సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య రెట్టింపైనట్టు సర్వేలో వెల్లడైంది. 2017నాటికి దేశవ్యాప్తంగా 197.3 మిలియన్ల (19.73 కోట్ల) మంది పలు రకాల మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్టు తేలింది. ఇలాంటివారు ఎప్పటికప్పుడు మనోవైద్యులను సంప్రదిస్తూ చికిత్స పొందాలని నిపుణులు సూచిస్తున్నారు. కాగా దేశంలో మానసిక ఆరోగ్య వైద్య నిపుణుల కొరత ఉన్నది. లక్ష మంది జనాభాకు కేవలం 0.3 మంది మనోవైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు.

### సైకలాజికల్ ఫస్ట్‌ఎయిడ్ ముఖ్యం

డిప్రెషన్‌కు గురైనవారిలో నిస్సహాయత, నిరాశవాదం ఎక్కువగా కన్పిస్తుంది. మానసికంగా కుంగిపోతుంటారు. ఆత్మన్యూనతా భావానికి గురవుతారు. ఉత్సాహంగా ఉండరు. ఉద్యోగంపై దృష్టిసారించలేరు. ఒంటరిగా ఉంటారు. వృత్తిపరంగా స్థిరత్వం లేకపోవడం, వైవాహిక జీవితంలోని సమస్యలు ఎక్కువ మందిలో డిప్రెషన్‌కు కారణమవుతున్నాయి. ఇలాంటివారికి సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ అందించడం ముఖ్యం. మానవ సంబంధాలను మెరుగుపరుచుకోవాలి. డిప్రెషన్, ఆందోళనపై జాగ్రత్త వహించకపోతే ఆత్మహత్యకు దారితీసే ప్రమాదం ఉంటుంది.

– డాక్టర్ చల్లా గీత, సైకాలజిస్ట్ (మనో జాగృతి ఫౌండర్)



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఎంపీటీసీల సంఘం సభ్యులు

## ఎంపీటీసీలకు పూర్తిస్థాయి అధికారాలు

మంత్రి ఎర్రబెల్లి హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంపీటీసీ సభ్యులకు పూర్తిస్థాయి అధికారాలను బదలాయిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి అధ్వర్యంలో ఎంపీటీసీలు మంగళవారం మంత్రి దయాకర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల అధికారాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం తమకు అధికారాలు, విధులు కల్పించాలని ఎంపీటీసీలు కోరారు. పంచాయతీరాజ్‌శాఖలో విద్యా, వైద్యం, ఆరోగ్యం, మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం, గురుకులాలతోపాటు మండల పరిషత్ పరిధిలో అనుసంధానంగా ఉండే శాఖలకు చెందిన అధికారాలను బదలాయింపు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని సత్యనారాయణరెడ్డి తెలిపారు. గౌరవవేతనం, అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారన్నారు. మంత్రిని కలిసినవారిలో తెలంగాణ ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శైలజా సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, జెడ్పీటీసీ సభ్యుల సంఘం నాయకులు ఉన్నారు.



కొత్తజిల్లాలవారీగా టెన్త్ పరీక్షల మూల్యాంకనం కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

## ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి

**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండలంలోని మూలరాంపూర్‌కు చెందిన కందుల భూమేశ్ (19) సోమవారం ట్రాక్టర్‌పై నుంచి కిందపడి మృతి చెందారు. సోమవారం తన స్నేహితులతో కలిసి పనిమీద వేములకుర్తి గ్రామంనుంచి ట్రాక్టర్‌పై మెట్‌పల్లికి వెళ్లారు. రాత్రి పనిముగించుకొని అదే ట్రాక్టర్‌పై వేములకుర్తికి చేరుకున్నారు. బస్టాండు సమీపంలో ట్రాక్టర్ నుంచి కిందికి దిగే క్రమంలో డ్రైవర్ గమనించకుండా వాహనాన్ని ముందుకు నడుపడంతో భూమేశ్ ట్రాలీ కింద పడ్డారు. ట్రాలీ టైర్ భూమేశ్‌పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ ఎడపల్లి రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



డిశ్చార్జ్ సమ్మరీతో స్వాతి

## బాధితురాలు డిశ్చార్జ్

**చార్మినార్:** ప్రసవంలో శిశువు తల వేరుపడి ప్రమాదకరస్థితిలో పేట్లబుర్జ్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో చేరిన స్వాతి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్టు దవాఖాన సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. మూడు రోజులుగా మెరుగైన చికిత్స అందించిన అనంతరం స్వాతి పూర్తిగా కోలుకొన్నదని చెప్పారు. భవిష్యత్‌లో ఆమె గర్భం దాల్చినా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వాతి ఆరోగ్యాన్ని పరీక్షించిన అనంతరం మంగళవారం డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు. స్వాతిని ఆమె సొంతూరు అచ్చంపేటకు పంపేందుకు అంబులెన్స్‌ను సమకూర్చడంతోపాటు తోడుగా ఇద్దరు సిబ్బందిని పంపుతున్నట్టు చెప్పారు.

## రైతు ఆత్మహత్యాయత్నం

రెవెన్యూ అధికారులు, పోలీసుల వేధింపులు తాళలేక దుశ్చర్య

**సంస్థాన్‌నారాయణపురం:** రెవెన్యూ అధికారులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల జనగామ గ్రామపంచాయితీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఆరెగూడెం గ్రామానికి చెందిన బచ్చనబోయిన కాశయ్యతోపాటు మరో ఏడుగురికి జనగామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 271లో 16 ఎకరాల భూమి ఉన్నది. దాని పక్కన జనగామకు చెందిన వేన్‌రెడ్డి నరేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి భూమి ఉన్నది. తన భూమిలోకి వెళ్లేందుకు ఈ రైతులకు చెందిన 16 ఎకరాల నుంచే దారి ఉన్నదని నరేందర్‌రెడ్డి.. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో సర్వేయర్ ఆ భూమిని సర్వేచేసి నరేందర్‌రెడ్డికి భూమిలేదని తేల్చారు. కానీ.. నరేందర్‌రెడ్డి రైతులపై కేసువేయడంతో పోలీసులు వారిని బైండోవర్ చేయడానికి ప్రయత్నించారు. దీన్ని అడ్డుకున్న రైతుల్లో ఒకడైన కాశయ్య అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంచేశాడు. వెంటనే అతన్ని హైదరాబాద్ దవాఖానకు తరలించారు. కాశయ్యపై పోలీసులు మూడు కేసులను నమోదుచేశారు.



అక్షిత (ఫైల్)

## కేజ్‌వీల్స్ మీద పడి చిన్నారి మృతి

**చెన్నారావుపేట:** ట్రాక్టర్ కేజ్‌వీల్స్ మీద పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కర్రె కరుణాకర్–రవళి కూతురు అక్షిత(6) మండలంలోని పాపయ్యపేటలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నది. మంగళవారం సెలవు కావడంతో ఇంటి సమీపంలోని చిప్ప సదయ్య ఇంటి ఆవరణలో చిన్నారులతో ఆడుకుంటున్నది. ఈ క్రమంలో అక్కడే ఉన్న ట్రాక్టర్ కేజ్‌వీల్స్ ప్రమాదవశాత్తు చిన్నారి అక్షిత మెడ భాగంపై పడింది. దీంతో చిన్నారి బలమైన దెబ్బ తగిలి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మావోయిస్టు నేత క్యాతం శ్రీనివాస్ లొంగుబాటు

**కామారెడ్డి, నమస్తే తెలంగాణ:** మూడుదశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేత.. కామారెడ్డి జిల్లా దేవునిపల్లికి చెందిన క్యాతం శ్రీనివాస్ మంగళవారం కామారెడ్డి ఎస్పీ శ్వేతారెడ్డి ఎదుట లొంగిపోయారు. తన కార్యాలయంలో ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడారు. క్యాతం శ్రీనివాస్ అలియాస్ సమీర్, సూరజ్, సత్యదేవ్, రాహుల్, అరవింద్ తదితర పేర్లతో మావోయిస్టుగా పని చేశాడని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సీపీఐ మావోయిస్టు డివిజనల్ కమిటీ మెంబర్‌గా, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆర్గనైజర్ కమిటీ సభ్యుడిగా, మధ్యప్రదేశ్‌లో, జార్ఖండ్ రాష్ట్రాల్లో నార్త్ రీజినల్ బ్యూరో సభ్యుడిగా పని చేశాడని వివరించారు. అనారోగ్య కారణాలతోనే శ్రీనివాస్ లొంగిపోయినట్టు చెప్పారు.



మావోయిస్టు నేత క్యాతం శ్రీనివాస్

## వీలైనన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్‌లో బోధన

- వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశపెట్టేందుకు చర్యలు
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి
- పీఆర్టీయూటీఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి వీలైనన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టామని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో పీఆర్టీయూటీఎస్ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంగ్లిష్ మీడియానికి సంబంధించిన అనుమతులు మంజూరుచేసే అధికారాన్ని డీఈవోలకు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం కేంద్రాలను కొత్త జిల్లాలవారీగా ఏర్పాటుచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర నాయకులు శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు విద్యామంత్రిని కోరారు.

### రేపు పీఆర్టీయూ విద్యాసదస్సు

రాష్ట్రానికి చెందిన పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర నాయకులు మారెడ్డి అంజిరెడ్డి, ఎం చెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం (ఈ నెల 26న) రాష్ట్ర విద్యాసదస్సును నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నట్టు సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు.

నమస్తే తెలంగాణ

# జిందగీ

బుధవారం 25 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



ఆ బొమ్మలు సంభాషిస్తాయి. కథలు చెబుతాయి. సరికొత్త ప్రపంచంలోకి లాక్కెళ్తాయి. చరిత్రను మననం చేస్తాయి. అవి అలాంటిలాంటి బొమ్మలు కాదు. మనసు పెట్టి చూస్తే మనసుకు హత్తుకోవాలని పించే బొమ్మలు. లోతుగా పరిశీలిస్తే చరిత్రను కళ్లకు కట్టే రూపాలు. అవి రంగుల ప్రపంచాన్ని చూపించే ప్రత్యేక దివిటీలు. కాలం మారింది. కళ కూడా అంతరించిపోసాగింది. వాటితో పాటే కళాకారులు కూడా. కానీ పైసా ఆమ్దాన్ లేక పోయినా.. కళను బతికిస్తున్న కుటుంబాలు ఇప్పటికీ కొన్నున్నాయి. ఆ కుటుంబం లోని నవతరం ఉద్యోగాల్ని వదిలి కళను కళ్లకు అద్దుకుంది. ఆధునిక రూపాల్లో కళను పొందుపరుస్తున్నది. ఈనెల 28న చేర్యాల స్క్రోల్ పెయింటింగ్ కళాకారుడు సాయికిరణ్ తెలంగాణ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోబోతున్న సందర్భంగా 'జిందగీ' ఆ కుటుంబాన్ని పలుకరించింది.

# చేర్యాల కళతో జీవన సోపానం



అది సాలార్‌జంగ్ మ్యూజియం. గది నంబర్ 1. లోపలికి అడుగుపెట్టగానే ఆటోమేటిగ్గా ఎడమవైపునకు చూపు మళ్లిపోతుంది. ఎందుకంటే అక్కడ వరుసగా మూడు ఆకట్టుకునే పెయింటింగ్స్ ఉంటాయి. పెద్ద పెద్ద ఫ్రేములతో చూపు తిప్పనివ్వవు. ఒక పటం మొత్తం మహాభారతాన్ని కళ్లకు కడుతుంది. మరో పటం గౌడ పురాణాన్ని చెబుతుంది. ఇంకోటి మార్కండేయ పురాణాన్ని వివరిస్తుంది. ఆ పటాల్లోని బొమ్మలన్నీ సంభాషిస్తున్నట్లుగా కనిపిస్తుంటాయి. అలా మ్యూజియంలో ఉన్న ఆ బొమ్మలు రోజూ సందర్శకులతో మాట్లాడుతుంటాయి. ఆ ఫొటోల కింద నకాషీ(చేర్యాల) ఆర్ట్ అని రాసి ఉంటుంది. పటం కిందనే వెంకట రామయ్య అనే పేరుంటుంది. ఇంతకీ ఆ వెంకట రామయ్య ఎవరు? ఆ బొమ్మల కథేంటి?

**400 ఏండ్లు వెనక్కి..**

నకాషీ కళ 400 ఏండ్ల కిందటిది. నకాషీ అనేది ఓ కులం పేరు. ఆకులస్తులంతా బట్టపై బొమ్మలు చిత్రించేవారు. వారి పేరు మీదనే నకాషీ కళ వచ్చింది. ఈ బొమ్మలు వేసేవాళ్లంతా వరంగల్ జిల్లా చేర్యాల గ్రామంలో ఉండేవారు. వారు అక్కడ ఉంటున్నందుకు నకాషీ కళ చేర్యాల కళగా పేరు పొందింది. వీరు వేసిన బొమ్మల ఆధారంగా కొందరు గ్రామాల్లో తిరిగి కుల పురాణాలు చెప్పేవారు. తెలంగాణలో ఈ కళ ధనాలకోట వెంకట రామయ్యతో మొదలైనట్లు ఆధారాలున్నాయి.

**నాలుగో తరంలోకి..**

ప్రస్తుతం కులాలకు సంబంధించిన కథలు చెప్పే కళాకారులు తగ్గిపోయారు. దీంతో నకాషీ కులస్తులకు పటాలపై బొమ్మలు వేసేందుకు అవకాశాలు రావట్లేదు. ఈ కారణంతో కళను నమ్ముకున్న అనేక కుటుంబాలు వృత్తిని వీడాయి. ప్రస్తుతం నాలుగు కుటుంబాలు మాత్రమే ఈ కళపై ఆధారపడి జీవిస్తున్నాయి. వెంకటరామయ్య నుంచి చంద్రయ్య, భారతమ్మ, వైకుంఠం, నాగేశ్వర్, పద్మ, వెంకటరమణ, పవన్ కళను బతికించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం నాల్గోతరం వారు వారసత్వంగా తీసుకున్నారు.

**ప్రపంచానికి పరిచయం చేస్తూ..**

ఈ ఏడాది ఆగస్టులో '100 పైపర్స్' అనే సంస్థ ఓ పోటీ నిర్వహించింది. విజేతలకు తమ కంపెనీ బ్రాండ్ సీసాపై బొమ్మల్ని ముద్రిస్తామని ప్రకటించింది. వంద దేశాల చిత్ర కళాకారులు పాల్గొనగా ఆరు దేశాల కళాకారుల బొమ్మలే ఎంపికయ్యాయి. అందులో సాయికిరణ్ వేసిన నకాషీ చిత్రాలూ ఉన్నాయి. ఆ బాటిల్‌పై సాయికిరణ్ వేసిన బొమ్మలు, సంతకం ఉన్నాయి. ప్రస్తుతం ఈ బాటిల్ కొన్నవారు బొమ్మల కోసం దాచి పెట్టుకుంటున్నారట! నకాషీ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా సర్క్యులేట్ అవుతున్నాయి.

**కళకు జీవం పోస్తూ..**

ధనాలకోట వెంకటరామయ్య వారసులు నాగేశ్వర్. పద్మ. వీరు కొన్ని దశాబ్దాలుగా నకాషీ కళను నమ్ముకుంటూ వస్తున్నారు. వీరి కొడుకులు సాయికిరణ్, శ్రావణ్‌కుమార్. చదువుకుంటున్న సమయంలోనే నకాషీ బొమ్మల చిత్రీకరణలో సాయం చేసేవారు. 2010లో సాలార్‌జంగ్ మ్యూజియంలో నకాషీ కళకు సంబంధించిన ఓ ప్రదర్శన పెట్టారు. సాయికిరణ్ కళారూపాల్ని దగ్గరుండి పరిచయం చేస్తున్నాడు. పీవీ నరసింహారావు కూతురు వాణిదేవి అక్కడికి వచ్చారు. 'ఈఆర్ట్ అద్భుతంగా ఉంది. పైకొస్తావు' అంటూ అభినందించారు. ఓ కాలేజీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ)లో సాయికిరణ్‌కు సీటు ఇప్పించారు. అలా ఐదేండ్లు కళపై పట్టుసాధించాడు సాయి. జాబ్ ఆఫర్ వచ్చిప్పటికీ కళ కోసం నకాషీ చిత్రాలను చెక్కే పనిలో పడ్డాడు. అనంతరం అన్న బాటలోకి తమ్ముడు కూడా వచ్చాడు. బీటెక్ చేసిన శ్రావణ్ కూడా ఏ ఉద్యోగానికీ వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ నకాషీ బొమ్మలు వేస్తున్నాడు. ప్రస్తుతం అన్నదమ్ములిద్దరూ కళకు ఆధునికతను అద్దే పనిలో ఉన్నారు.

**ఆధునికతను అద్ది..**

నకాషీ చిత్రాలు వేయడానికి చాలా సమయం పడుతుంది. అద్భుతమైన బొమ్మలు వేసినా.. కొనేవారు తక్కువ. ఈ నేపథ్యంలో తమకు వచ్చిన కళను ఆధునీకరించారు. ప్రస్తుతం సాయికిరణ్ తల్లిదండ్రులు నాగేశ్వర్, పద్మ, తమ్ముడు శ్రావణ్ అంతా ఇంటివద్దే నకాషీ కళాఖండాలు చెక్కుతున్నారు. చింతగింజల్ని పొడిచేసి కొన్ని నీళ్లు వేసి ఉడికిస్తారు. ఆ మిశ్రమానికి కొద్దిగా చెక్కపొట్టు కలిపి మాస్కులు తయారు చేస్తున్నారు. రాజారాణి బొమ్మలు, టేబుల్ టాపర్స్, కళ్లద్దాల స్టాండు, కీ చెయిన్స్, పెన్‌స్టాండ్, టిష్యూ బాక్స్, వంటివి తయారు చేస్తున్నారు. సాయికిరణ్ తల్లి పద్మ హ్యాండ్‌బ్యాగులు, చీరలు, జ్యువెల్లరీ బాక్సులు, లేడీస్ టాప్‌లపై నకాషీ కళను పొందుపరుస్తున్నారు. నాగేశ్వర్ గోడకు తగిలించే బహుమతులు, వాచీలు, గ్రామదేవతల గుడిగోడలపై నకాషీ బొమ్మలు వేస్తున్నారు. సాయికిరణ్, శ్రావణ్‌కుమార్ మాత్రం నకాషీ కళను యువతకు దగ్గర చేస్తున్నారు. సెల్‌ఫోన్ కవర్లపై, కీ చెయిన్లపై, టీషర్టులపై నకాషీ చిత్రాలను గీస్తున్నారు. వీటిని సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు.

**ప్రకృతే రంగులిచ్చింది!**

నకాషీ బొమ్మలన్నీ సహజ రంగులతోనే ప్రాణం పోసుకుంటాయి. పేగుడి రాళ్ల నుంచి లెమన్ ఎల్లో, భూమిలో దొరికే ఎర్ర రాళ్ల నుంచి ఎరుపు రంగు, ఇండిగో చెట్ల నుంచి గడ్డలుకొని వాటిని నూరితే వచ్చే నీలం రంగు, గంగలో దొరికే శంఖాల్ని దంచి పొడి చేసి తెలుపు రంగు, కిరోసిన్ దీపాన్ని గూట్లో పెట్టి ఆ మసిని నలుపు రంగుగా మార్చుకుని నకాషీ బొమ్మలు వేస్తున్నారు. ఖాదీ బట్టపై వేసే ఈ బొమ్మలు వంద ఏండ్లయినా వన్నె తగ్గవు. చింతగింజల పొడిని ఉడకబెట్టి, అందులో చాక్‌పౌడర్, తిరుమణి గోంద్, గంజి కలిపి ఆ మిశ్రమాన్ని బట్టపై అద్దుతారు. అది ఎండిన తర్వాత మళ్లీ కోటింగ్ వేస్తారు. ఆ తర్వాత జాజును నానబెట్టి కలర్‌గా వాడి ఔట్ డ్రాయింగ్ వేస్తారు. బ్యాక్‌గ్రౌండ్ కలర్ ఎరుపు రంగుతో నింపేస్తారు. ఆతర్వాత బొమ్మలకు రంగులద్దుతారు.

**కళకు సత్కారం**

ఈనెల 28న తెలంగాణ ప్రభుత్వం చేతివృత్తులు, చేనేత కళాకారులను సగౌరవంగా సత్కరించనుంది. ముషీరాబాద్‌లోని గోల్కొండ హ్యాండీక్రాఫ్ట్స్‌లో సాయికిరణ్ ఈ అవార్డును పొందనున్నాడు. ఇప్పటి వరకు స్క్రోల్ పెయింటర్‌గా ఉన్న సాయికిరణ్ అవార్డు అందుకున్న తర్వాత మాస్టర్ క్రాఫ్ట్‌మేన్‌గా గుర్తింపు పొందనున్నాడు.

## ఉద్యోగాల జోలికి వెళ్లట్లేదు!

కళ అంతరించిపోవద్దనే.. తమ్ముడు నేను ఉద్యోగాల జోలికి వెళ్లట్లేదు. కీ చెయిన్లు, గిఫ్టులు, టీషర్టులు, సెల్‌ఫోన్ కవర్లపై నకాషీ చిత్రాలు వేస్తున్నాం. ప్రభుత్వం మరింత ప్రోత్సాహం కల్పించాలె. చిత్రాలు వేయడానికి ఎక్కువ సేపు కూర్చుని అనారోగ్యం పాలవుతున్నాం. హెల్త్ కార్డులు ఇవ్వాలి. విదేశీయులు సందర్శించే చోట స్టాల్స్ పెట్టుకోవడానికి అవకాశం కల్పించాలె. పూట గడవడమూ కష్టంగానే ఉంది. కళను నమ్ముకొని ముందుకు వెళ్తున్నాం.

**- ధనాలకోట సాయికిరణ్**



...✍ పడమటింటి రవికుమార్

📷 కోనేటి వెంకట్

## సిరిముగ్గు



5 చుక్కలు
5 వచ్చేవరకు



వి. సుమలత
హైదరాబాద్

7 చుక్కలు
సరిచుక్క
1 వచ్చేవరకు



ఆర్. రాజేశ్వరి
8ఇంక్లైన్ కాలనీ,
పెద్దపల్లి జిల్లా



**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, బంజారాహిల్స్, రోడ్ నం-10, హైదరాబాద్ -500034. zindagi.nt@gmail.com

# క్రిస్మస్ కేక్‌లతో గిన్నిస్ రికార్డులు

**ప్రతి ఏటా క్రిస్మస్ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని కలినరి ఆఫ్ అకాడమీ ఇండియా (సీఏఐ) హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భారీ కేకులతో గిన్నిస్ బుక్ రికార్డులు సృష్టిస్తున్నది. ఈ ఏడాది అతిపెద్ద ఎడిబుల్ పెయింటింగ్ కేకును రూపొందించింది. నాలుగేండ్ల నుంచి వరుసగా విభిన్నమైన కేకులు తయారు చేసి సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ఈ ఏడాది కూడా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం సిద్ధమైంది.**



కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా భారీ కేకును రూపొందించింది. ఈ కేకును తయారు చేసేందుకు 122 మంది విద్యార్థినీ, విద్యార్థులు వారం రోజుల పాటు శ్రమించారు. 54 అడుగుల పొడవు, 42 అంగుళాల వెడల్పుతో జాతీయ పక్షి నెమలి చెట్టు మీద కూర్చున్న ఆకృతిలో రూపొందించారు. దీనిని తయారుచేయడానికి 180 కిలోల జిలటిన్ పౌడర్, 20 కిలోల చక్కెరతోపాటు గుడ్లు వినియోగించారు. చెఫ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ భారీ కేకును రూపొందించారు. కలినరీ అకాడమీ ఆధ్వర్యంలో ఓటుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేకుల పోటీతో వినూత్న ప్రచారం చేపట్టింది. అందుకోసం 2015లో వినూత్నంగా కేకుల తయారీ పోటీ నిర్వహించారు. కలినరి అకాడమీ ఆఫ్ ఇండియా 2015లో మొదటిసారిగా భారీ కేకులను తయారు చేయడం మొదలు పెట్టింది. ఆ ఏడాది మాంసంతోపాటు వివిధ రకాల పండ్లు కూరగాయలతో 300కిలోల కేకును తయారు చేశారు. దీనిని తయారు చేయడానికి 100మంది చెఫ్‌లు దాదాపు 40 రోజులు శ్రమించారు. దీని పొడవు30 అడుగులు, వెడల్పు 8 అడుగులు. ఇది 2015 సంవత్సరానికిగాను 'లాంగెస్ట్ కోల్డ్ మీట్ ప్లాటర్ ఆఫ్ ది వరల్డ్'గా రికార్డు సాధించింది. 2016లో ఒకే చోట ఎక్కువ కేకులను ప్రదర్శించి మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నది. 2017లో అత్యంత పొడవైన క్రిస్మస్ కప్ కేక్‌ట్రీని తయారు చేసి ఘనతను సాధించింది. 2018లో బ్రెడ్‌తో తయారు చేసిన పలురకాల కేకులతో ఇంకో రికార్డును సీఏఐ దక్కించుకున్నది. ఇలా తయారు చేసిన కేకును ప్రతి ఏటా పేద పిల్లలకు పంపిణీ చేస్తున్నారు.

# 'తులసి'తో ఆరోగ్యం

**దేవతార్చనలో తులసి మొక్కది ప్రత్యేక స్థానం. తులసితో అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. తులసిని ఉపయోగించి ఎలాంటి సమస్యలను నయం చేసుకోవచ్చంటే..**



- పలురకాల జ్వరాల్లో ముఖ్యంగా వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ జ్వరం వ్యాప్తి తీవ్రంగా ఉన్నప్పుడు లేత తులసీ ఆకుల్ని నీళ్లలో వేసి మరిగించితాగితే వాటి జ్వరాల నుంచి ఉపశమనం పొందవచ్చు.
- పలురకాల ఆయుర్వేద దగ్గు మందుల్లో తులసిని వాడుతుంటారు. తులసి ఆకుల్ని నోట్లో పెట్టుకొని నమలడం వల్ల జలుబు, ఫ్లూ నుంచి ఉపశమనం లభిస్తుంది. చక్కెర మోతాదు తగ్గించగలిగే శక్తి తులసికి ఉంది. బీపీ కూడా నియంత్రణలో ఉంటుంది.
- రెండు స్పూన్ల తులసి రసాన్ని కొద్దిగా తేనె కలిపి తాగితే పైత్యం తగ్గుతుంది. మూత్ర విసర్జన సమయంలో మంటతో బాధపడేవారు తులసి ఆకుల్ని దంచి, ఆ రసానికి కొద్దిగా పాలు, చక్కెర కలిపి తాగడం వల్ల ఉపశమనం దొరుకుతుంది.
- తులసి ఆకులను నూరి ముఖానికి రాసుకుంటే మచ్చలు, మరకలు పోయి ముఖం అందంగా కాంతివంతంగా మారుతుంది. తులసి, తేనె కలిపి పరిగడుపున తీసుకోవడం వల్ల కొన్ని పోషకాలు, విటమిన్లు పుష్కలంగా అందుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం గుండెకు చాలామంచిది. రక్తప్రసరణ బాగా జరుగుతుంది. తులసి, తేనె రెండింటిలోనూ యాంటీ సెప్టిక్ గుణాలు ఎక్కువ. ఈ రెండింటినీ కలిపి తరచూ తీసుకుంటే చర్మ సమస్యలు రావు.

# 3డి మమోగ్రఫీతో.. రొమ్ముక్యాన్సర్‌కు చెక్!

**సలహా**

రొమ్ముక్యాన్సర్ అంటే గతంలో ఒక ఆందోళన.

మాతృత్వానికి పరిపూర్ణతనిచ్చే రొమ్ముకు అనారోగ్యం వస్తే గుండెకే గాయం అయినట్లవుతుంది.

అయితే తొలిదశలోనే గుర్తిస్తే రొమ్ముక్యాన్సర్ పూర్తిగా తగ్గుతుంది.

రొమ్ముక్యాన్సర్ నుంచి ప్రాణాపాయం తప్పిన తర్వాత రూపమూ బాగుండాలనే ఆశ ఎవరికైనా ఉంటుంది.

ఇలా ఆరోగ్యమూ అందమూ తిరిగి పొందే ఆశ.. ఆకాంక్ష నెరవేరే రోజులు వచ్చేశాయి.



**రొమ్ములో** గడ్డలనే శత్రువులను తెలుసుకోవడానికి ఇప్పుడు మరింత మెరుగైన ఉపకరణం అందుబాటులోకి వచ్చింది. అదే డిజిటల్ మామోగ్రఫీ. ఇది గతంలో ఉన్న పరిజ్ఞానమే. అయితే దీనికి ఆధునిక సాంకేతికత జోడై బ్రెస్ట్ టోమోసింథసిస్/3డి మామోగ్రఫీ అనే అత్యంత ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఒమేగా హాస్పిటల్స్‌లో నెలకొల్పిన ఈ అత్యాధునిక ఉపకరణంతో సంప్రదాయ పద్ధతుల్లో కంటే మరింత ముందుగానే గడ్డను చూడవచ్చు. ఇది 3డీ పరిజ్ఞానంతో రొమ్ములో క్యాన్సర్ ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని దాన్ని తొలగించడానికి వీలవుతుంది. పక్కనున్న కణజాలం క్యాన్సర్ గడ్డతో కలగలసిపోయి, రెండింటినీ స్పష్టంగా, నిర్దిష్టంగా గుర్తించలేని పరిస్థితి పూర్తిగా తొలగిపోయి, కాన్సర్ గడ్డ, కణితి ఉన్న భాగం మరింత స్పష్టంగా కనిపించి చికిత్స సులువు అవుతుంది. దీనివల్ల వ్యాధి తిరగబెట్టే అవకాశాలు 30 శాతం తగ్గుతాయి.

## సైబర్ నైఫ్

ఒక్క రొమ్ము క్యాన్సర్‌కు మాత్రమే కాదు అన్ని రకాల క్యాన్సర్లతో పాటు ఇక దాన్నీ రక్షించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కూడా ఒమెగా హాస్పిటల్లో లభ్యమవుతున్నది. అదే సైబర్ నైఫ్. ఇది కత్తి కాని కత్తి. క్యాన్సర్ ఉన్న భాగాన్ని మెత్తగా కోసే కత్తి. వాస్తవానికి రొమ్ము లాంటి ప్రదేశంలో అతి మెత్తగా గాటుకు గాయం కాకుండా, గాయానికి నొప్పి లేకుండా, సమస్య ఎప్పుడూ మళ్లీ రాకుండా (కనీసం గతంలో కంటే 30 శాతం అధికంగా) చేసే సాంకేతిక పరిజ్ఞానం. ఒకప్పుడు మెదడు, వెన్నెముక, ఊపిరితిత్తులు, కాలేయం, క్లోమగ్రంధి వంటి సున్నితమైన ప్రదేశాల్లో క్యాన్సర్ కణితి ఉంటే ఆందోళన పడేవారు.

## ఇమేజ్ గైడింగ్ టెక్నాలజీ

సైబర్ నైఫ్ అనే సునిశితమైన వైద్య పరిజ్ఞానంతో పాటు ఇమేజ్ గైడింగ్ టెక్నాలజీ అనే సాంకేతికత కూడా అందుబాటులోకి వచ్చింది. ఇమేజ్ గైడింగ్ అంటే మనం చూడలేని ప్రాంతాన్ని కూడా స్పష్టంగా అద్దంలో చూసినట్లుగా చూడటం. ఇక రొమ్ము క్యాన్సర్ విషయానికి వస్తే డిజిటల్ మామోగ్రఫీ విత్ బ్రెస్ట్ టోమోసింథసిస్/కిడి మామోగ్రఫీ పరిజ్ఞానంలోని కెమెరా సహాయంతో రొమ్ముకు అన్ని వైపులా తిప్పుతూ క్యాన్సర్ గడ్డను అన్ని కోణాలనుంచి చూస్తూ శస్త్రచికిత్స చేయడం సాధ్యమవుతుంది. పైగా దీనివల్ల ఇప్పుడు మనం చూసే క్యాన్సర్ గడ్డ గతంలో కంటే మరింత స్పష్టంగా, మరింత పెద్దగా, శస్త్రచికిత్స సమయంలో మిగతా భాగాలేవీ దెబ్బతినకుండా తీసేయడానికి వీలయ్యేంత పరిమాణంలో కనిపిస్తుంది.

## ఆక్సిలరీ క్లియరెన్స్


చికిత్స చేస్తున్నప్పుడు ఊపిరితిత్తుల్లా కదులుతుండే భాగాలు అలా కదులుతున్నా సరే ఇమేజ్ గైడింగ్ టెక్నాలజీ వల్ల, రోబోటిక్ సామర్థ్యం వల్ల క్యాన్సర్ ఉన్న భాగం తమ కిరణాలు తగిలే పరిధిలోకి వచ్చినప్పుడే వాటిని ఖచ్చితమైన చోట ప్రసరింపజేసి క్యాన్సర్‌ను కాల్చేసి మసి చేస్తాయి. అలాగే రొమ్ము కూడా ఊపిరితిత్తుల పైభాగంలో ఛాతీమీద ఉంటుంది. కాబట్టి శ్వాసిస్తూ ఉన్నప్పుడు రొమ్ము క్యాన్సర్‌కు కూడా పైవిధంగానే చికిత్స చేయవచ్చు. కొన్నిసార్లు రొమ్ము క్యాన్సర్ తొలి దశలను దాటి చంకల్లో ఉండే లింఫ్ గ్లాండ్స్‌కూ విస్తరించే అడ్వాన్స్‌డ్ దశలకూ వెళ్తుంది. అలాంటప్పుడు వ్యాధిగ్రస్తమైన లింఫ్‌గ్లాండ్స్‌ను శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియనే 'ఆక్సిలరీ క్లియరెన్స్' అంటారు. లింఫ్ గ్లాండ్స్‌లో జబ్బు ఉన్నదీ లేనిదీ తెలుసుకోడానికి సెంటినల్ నోడ్స్ బయాప్సీ ప్రక్రియ ద్వారా ఏయే గ్లాండ్స్ రోగగ్రస్తమయ్యాయో తెలుసుకోవచ్చు. అలా తెలుసుకున్న తర్వాత కేవలం రోగగ్రస్తమైన లింఫ్ గ్లాండ్స్ ఉంటే ఆక్సిలరీ క్లియరెన్స్ చేసి వాటిని వదిలేయవచ్చు.

## ఏయే భాగాల్లో?

శరీరంలోని ఏ భాగానికైనా సైబర్‌నైఫ్ నుంచి చికిత్స చేసే కిరణాలను ప్రసరింపజేసి, క్యాన్సర్ గడ్డను, కణితి ఉన్న భాగాన్ని తొలగింపజేయవచ్చు. క్యాన్సర్ పుట్టిన భాగంలోనే ఉండక క్రమంగా పాకేస్తుంది. ఇలా విస్తరించడాన్ని మెటాస్టాసస్ అంటారు. సైబర్ నైఫ్ ప్రత్యేకత ఏమిటంటే మెటాస్టాసస్ క్యాన్సర్లను సైతం తేలిగ్గా తొలగిస్తుంది. అంతే కాదు తల, మెడ, ముక్కు, గొంతు భాగాలలోని కణుతులు. సైబర్‌నైఫ్‌ను 360 డిగ్రీల్లో ఎటైనా తిప్పుతూ కిరణాలను ప్రసరింపజేయడం సాధ్యమవుతుంది. సైబర్ నైఫ్ ప్రయోజనాలు సాధారణంగా కరెంట్ చికిత్సగా పేర్కొనే గతంలోని లీనియర యాక్సిలరేటర్లను ఉపయోగించే సమయంలో గతంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని జాగ్రత్తలు అవసరం లేకుండానే సులువుగా చికిత్స జరిగిపోతుంది. నొప్పి ఉండదు. మత్తు ఇవ్వాల్సిన అవసరం లేదు. శరీరానికి గాటు పెట్టనవసరం లేదు. చికిత్స చేసే సమయంలో ఊపిరితిత్తులకు రేడియేషన్ ఇస్తుంటే ఊపిరిబిగబట్టాల్సిన అవసరం లేదు. సూదిమొనంత ఖచ్చితత్వంతో క్యాన్సర్ ఉన్న భాగానికే ఇవ్వవచ్చు. అత్యంత తక్కువ సైడ్ ఎఫెక్ట్స్. హాస్పిటల్లో ఉండాల్సిన సమయం చాలా చాలా తగ్గిపోతుంది.

క్యాన్సర్ కాని ఇతర వ్యాధుల్లోనూ ఉపయోగం సైబర్‌నైఫ్ సేవలను కేవలం క్యాన్సర్ కోసం మాత్రమే కాకుండా... క్యాన్సర్ కాని ఇతర వ్యాధుల్లోనూ ఉపయోగించుకోవడానికి వీలవుతుంది. వాటిలో కొన్ని.. మెనింజియోమాస్ పిట్యూటరీ అకౌస్టిక్ న్యూరోమాస్ మెదడులో ఉండే క్రేనియల్ నర్వ్ స్క్వానోమాస్ గ్లామస్జ్యుగులేర్ ఆపరేషన్‌కు వీలుకాని పారాగాంగ్లియోమాస్ హిమాంజియోమాస్ రక్తనాళాల అమరిక సరిగా లేని సందర్భాల్లో (వాస్క్యులార్ మాల్ ఫార్మేషన్) ఇటీవలే నమలడం సైతం కష్టమైనంతగా దవడ నొప్పితో సల్మాన్‌ఖాన్‌కు వచ్చిన ట్రైజెమినల్ న్యూరాల్జియా క్లస్టర్ హెడేక్ వంటి సంక్లిష్టమైన తలనొప్పులు తలలోని అత్యంత సంక్లిష్టమైన నరాలకు సర్జరీ చేయలేని సందర్భాల్లో సైబర్ నైఫ్ సేవలను ఉపయోగించుకోవచ్చు. ఇలా సైబర్ నైఫ్‌తో అన్ని రకాల క్యాన్సర్లనూ, అన్ని అవయవాల్లోని అత్యంత సంక్లిష్టమైన భాగాల్లో వచ్చిన గడ్డలను తొలగించుకోవడం సాధ్యమే. చివరకు రొమ్ముక్యాన్సర్ భాగాలు, రొమ్ములో వచ్చే గడ్డలతో సహా.

**డా. సీహెచ్ మోహన వంశీ**
**చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్**
**ఒమేగా హాస్పిటల్స్**
**హైదరాబాద్: 9848011421**
**కర్నూల్: 08518 273001**
**గుంటూర్: 08632 223300**



నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 25 డిసెంబర్ 2019

## ఏం డైలాగ్ గురూ..

గెలుపుతో ఫ్రెండ్‌షిప్ చేయండి. అది ఎప్పుడూ మీతోనే ఉంటుంది. ఓటమిని ప్రేమించండి అది ఎప్పుడూ మిమ్మల్ని గెలిపిస్తూనే ఉంటుంది.



సినిమా: మళ్లీ మళ్లీ ఇది రాని రోజు

## వాట్సప్ మెసేజ్

జీవితాన్ని ఎప్పుడూ పక్కవారితో పోల్చుకోవద్దు. ఎందుకంటే సూర్యచంద్రులు ఇద్దరూ మనకు వెలుగును ఇచ్చేవారే. కానీ ఎవరు గొప్ప అంటే సమాధానం లేదు. ఎవరి టైంలో వారే గొప్ప. మనం కూడా అంతే దేనికైనా టైం రావాలి.

## మంచిమాట

జీవితం అంటేనే పోరాటం. అలాంటప్పుడు స్వార్థం కోసమో, అధర్మం కోసమో ఎందుకు పోరాటం చేస్తావు. ఆ పోరాడేదేదో ధర్మం కోసం పోరాడు. జనం కోసం పోరాడు.



- గౌతమ బుద్ధుడు

## నవ్వుకొందాం

ఒక రూంలో ఇద్దరు ట్విన్స్ కూర్చుని ఉన్నారు. ఒకడేమో ఏడుస్తున్నాడు. ఒకడేమో పడి పడి నవ్వుతున్నాడు. అది చూసి వాళ్ల నాన్న అడిగాడు. 'ఒరేయ్, వాడు ఏడుస్తుంటే, నువ్వెందుకురా నవ్వుతున్నావ్? అందులో ఒకడు హ. హ. హ. ఇంత చలిలో మమ్మీ నేననుకొని వీడికి రెండోసారి స్నానం చేయించింది.

# ఒక్క క్లిక్‌తో.. ఇంటికే బియ్యం

ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేస్తాం. నిర్ణీత సమయంలో ఫుడ్ మన చేతికందుతుంది. డెలివరీ చార్జీలు వినియోగదారుడి నుంచే లాగేస్తారు. కానీ ఈ-రైస్ ద్వారా ఎన్ని క్వింటాళ్లంటే అన్ని క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తారు. కానీ ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోరు. ఒక్క క్లిక్ చేస్తే చాలు నాణ్యమైన బియ్యం ఇంటి వద్దకే చేరుస్తాం అంటున్నాడు ఈ- రైస్ నిర్వాహకుడు శివ. బంజారాహిల్స్‌కు బియ్యం సరఫరా చేయడానికొచ్చిన శివతో మాట్లాడితే మరిన్ని ముచ్చట్లు చెప్పాడు.



**పాలకుర్ల** శివ డిగ్రీ చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో విఫలమయ్యాడు. ఆ తర్వాత డబ్బులు లెక్కించే ఓ ప్రయివేటు ఉద్యోగంలో చేరాడు. రోజుకు ఎన్ని నోట్ల కట్టలు లెక్కించినా.. నెలాఖరికి మాత్రం చేతికొచ్చేది పదివేలే. ఆ జీవితం అతడికి ఎంతమాత్రం నచ్చలేదు. ఆ ఉద్యోగం మానేశాడు. ఇంటి దగ్గర ఖాళీగానే ఉన్నాడు. 'ఏ పనీ చేయవారా?' అంటూ ఇంట్లో వాళ్ల మందలింపు. 'నేనూ పనిచేస్తా కానీ ఒకరి దగ్గర అస్సలు చేయను. నాకు నేనే. నాది నేనే. ఒకరు చేసే పనిని నేను అస్సలు ఫాలో అవ్వను. ఇంకాస్త కొత్తదనం కావాలి' అని సమాధానమిచ్చాడు. 'నీ మొఖం లాగే ఉంది' అంటూ వాళ్లమ్మ ఇంట్లో కెళ్లిపోయింది. ఇలా ఆర్నెళ్లు గడిచాయి. అతడికి చెప్పీ చెప్పీ ఇంట్లో వాళ్లకే విసుగొచ్చింది. ఇక పని చేయమని చెప్పడమే మానేశారు. 'ఓ రోజు ఇంటికి బంధువులొచ్చారు. బియ్యం అయిపోయాయి. బియ్యం బస్తా తీసుకురమ్మని శివ చేతిలో డబ్బులు పెట్టింది తల్లి. బజార్ వెళ్దామని బైక్ తీశాడు. బైక్ పంచర్ కావడంతో ఓ వాహనం మాట్లాడుకొని బియ్యం బస్తాను ఇంటికి తీసుకొచ్చాడు. ఆ సమయంలో డ్రైవర్ కాస్త సహాయం కూడా చేయలేదు. తనే బియ్యం బస్తాను ఇంట్లోకి తీసుకెళ్లాడు. అతడికి అక్కడే దొరికిందో ఐడియా.. 'ఈరోజు నేను ఎదుర్కొన్న సమస్య.. ఈ నగరంలో ఎంతో మంది ఎదుర్కొంటూ ఉంటారు. నాలాగే బియ్యం తేవడానికి ఇబ్బందులు పడుతూ ఉంటారు. ఒక్క ఫోన్ కాల్ లేదా.. ఒక్క క్లిక్‌తో బియ్యం ఇంటికే తీసుకెళ్లి ఇస్తే'.. ఇదే విషయాన్ని స్నేహితులతో పంచుకున్నాడు. అప్పటివరకు ఇలాంటి సేవలేమైనా ఉన్నాయా అని తెలుసుకున్నాడు.

### అప్పు చేసి యాప్ తయారీ!

కిరాణా సామగ్రి తీసుకొచ్చేవి చాలానే ఉన్నాయి. కానీ ప్రత్యేకంగా బియ్యం తీసుకొచ్చే సంస్థలు లేవని తెలుసుకున్నాడు. బ్యాంకులో పర్సనల్ లోన్ తీసుకున్నాడు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని సంప్రదించాడు. తన కాన్సెప్ట్ చెప్పి యాప్ తయారు చేయాలని కోరాడు. అందుకు గాను వారు లక్ష రూపాయలడిగారు. చివరికి రూ. 60 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వారంలో యాప్ రెడీ అయ్యింది. మొదటిసారి మే 15న 'ఈ-రైస్' పేరుతో యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో ఉంచారు. వారం రోజుల నిరీక్షణ అనంతరం ఒకే ఒక్కరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

### ఎత్తు పళ్లాలు!

ఆలోచన కొత్తదే. కానీ దాన్ని మార్కెట్లోకి ఎలా తీసుకెళ్లాలో శివకు తెలియలేదు. రోజుకు కనీసం ఒక్క ఆర్డర్ కూడా రాకపోయేది. అదే విషయాన్ని ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకున్నాడు. వారి సలహా మేరకు సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టాడు. యూట్యూబ్ చానెల్స్‌లో యాడ్స్ ఇచ్చాడు. ఆ తర్వాత కొద్దికొద్దిగా వ్యాపారం పెరగసాగింది. ఆర్డర్స్ పెరిగిన కొద్దీ బైక్‌పై రైస్ డెలివరీ చేయడం కష్టతరమైంది. సులభ వాయిదాల్లో ఓ చిన్న ట్రక్కు కొనుగోలు చేశాడు.

### ఆర్డర్ చేయండిలా..

ప్లేస్టోర్ నుంచి 'ఈ-రైస్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అడ్రస్ సెట్ చేసుకోవాలి. ఆ తర్వాత స్క్రీన్‌పై వివిధ రకాల బియ్యం కనిపిస్తాయి. బాస్మతీ, సోనామసూరీ, హెచ్‌ఎంటీ, బ్రౌన్, స్టీమ్ రైస్, జేఎస్‌ఆర్, టాప్ రేటెడ్ రైస్ ఉంటాయి. ఆ బ్రాండ్లలో మళ్లీ ఒక్కోదాంట్లో నాలుగైదు రకాల బియ్యం కనిపిస్తాయి. ఆయా బ్రాండ్ల కిందనే 25 కిలోలకు ధర కనిపిస్తుంది. వాటి పక్కనే 'ఆడ్' అనే బటన్‌పై క్లిక్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఓటీపీతో లాగిన్ కావాల్సి ఉంటుంది. అనంతరం 'సీవోడీ'పై క్లిక్ చేసి ఆర్డర్ నౌ అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే ఆర్డర్ వెళ్లిపోతుంది. ఆర్డర్ చేసిన 24 గంటల్లో బియ్యం ఇంటికి తీసుకొస్తుంటారు. లేదా 99892 30176 నంబరుకు ఫోన్ చేసి అయినా ఆర్డర్ చేయవచ్చు.



**రైతులకు ఉపాధినిస్తా..**

భవిష్యత్‌లో నేరుగా రైతుల వద్దనే వడ్లు కొని బియ్యం పట్టించి విక్రయిస్తా. ఇలా కొందరు రైతులకైనా మేలు చేసిన వాడినవుతా. ఆర్డర్ చేసిన రోజే బియ్యం అందించేలా ప్రయత్నిస్తున్నాం. తక్కువ లాభం వచ్చినా పర్లేదనే ఉద్దేశ్యంతో నాణ్యమైన బియ్యం మాత్రమే విక్రయిస్తున్నాం.

– పాలకుర్ల శివ, ఈ-రైస్ వ్యవస్థాపకుడు

### బియ్యం అందిస్తారిలా..

యాప్‌లో ఆర్డర్స్‌ను ఎప్పటికప్పుడు యాక్సెప్ట్ చేస్తుంటాడు. నగరంలోని ఓ వ్యాపారి వద్ద నాణ్యమైన బియ్యం కొంటాడు. మరుసటి రోజు ఉదయం ఎక్కడెక్కడి నుంచి ఆర్డర్స్ వచ్చాయో దానికి తగినట్లుగా డెలివరీకి ప్లాన్ చేస్తాడు. మినీవ్యాన్‌లో ఉదయం ఏడింటికి ఇంట్లోంచి బయల్దేరుతాడు. తను వెళ్లే దారిలో ఆర్డర్స్ ఇచ్చేస్తూ సాయంత్రంకల్లా ఇంటికి చేరుకుంటాడు. ఎన్ని ఫ్లోర్లయినా బియ్యం బస్తాను మోసుకెళ్లి ఇస్తుంటాడు. నగరంలోని కొన్ని ఇరుకు గల్లీల్లో కిలోమీటర్ దూరం సైతం మోసుకెళ్లి రైస్ డెలివరీ చేస్తుంటాడు. ఇందుకు ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోడు. ప్రస్తుతం 11 వేల మంది ఈ యాప్‌ను వాడుతున్నారు. రోజుకు వందల్లో ఆర్డర్స్ వస్తున్నాయి. నగరంలోని ఏ మూలకైనా వెళ్లి బియ్యం సరఫరా చేస్తున్నాడు. ఇలా నెలకు రూ.50వేల వరకు సంపాదిస్తున్నాడు.

### బాగాలేకపోతే వాపస్!

బియ్యం తీసుకున్నవారు వాడుకుంటారు. నచ్చకపోతే వాపస్ తీసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నది ఈ-రైస్. బియ్యం డెలివరీ చేసిన తర్వాత వినియోగదారులు వంట చేశాక నచ్చకపోయినా ఇంటికొచ్చి మరీ వాపస్ తీసుకెళ్తారు. ఆ బియ్యానికి బదులు వేరే బియ్యం కావాలన్నా ఇస్తారు. ఇలా మార్చి తెచ్చి ఇచ్చినందుకుగాను ఒక్కరూపాయి కూడా అదనంగా తీసుకోరు. మౌత్ పబ్లిసిటీతో కూడా చాలామంది ఈ-రైస్‌ను వాడుతున్నారు. వేరే వాళ్లకు రిఫర్ చేస్తే యాప్‌లో క్యాష్ బ్యాక్ ఆఫర్లు కూడా పెట్టారు. ఇలా ఒక్క క్లిక్‌తో బియ్యం వంటింట్లోకి తీసుకొచ్చేస్తున్నారు.

... పడమటింటి రవికుమార్
విద్యాసాగర్

## టెక్నాలెడ్జీ

# సాధారణ బడ్జెట్ ఫోన్లు -2019

స్మార్ట్ ఫోన్ కొనాలని చూస్తున్నారా.. సాధారణ బడ్జెట్ ధరలో ఈ ఏడాది కాలంగా వచ్చిన ఫోన్లు చాలానే ఉన్నాయి. తక్కువ ధరతో ఎక్కువ ఫీచర్లను కలిగి ఉండి వినియోగదారులను ఆకట్టుకున్నాయి. అన్ని ఫోన్లూ ఫింగర్ ప్రింట్ సెన్సార్, నాణ్యమైన మెటల్, బాడీ డిజైనింగ్‌తో వచ్చినవే. ఈ ఏడాదిలో రూ.15 వేల లోపు ధరలో ఉన్న 7 స్మార్ట్ ఫోన్లు ఇవి.

### రెడ్ మీ నోట్ 6 ప్రో



నాలుగు కెమెరాలతో వచ్చిన ఈ స్మార్ట్‌ఫోన్ సాధారణ బడ్జెట్ ధరలో ప్రజలను ఆకట్టుకుంది. 6.53 అంగుళాల స్క్రీన్ సైజ్, 6 జీబీ ర్యామ్, 4500 బ్యాటరీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కెమెరా ఫీచర్లతోనే కీలకంగా మార్కెట్‌లోకి వచ్చిన ఈ ఫోన్ రూ. 15వేలకే అందుబాటులో ఉంది.

### రియల్ మీ 5 ప్రో



రియల్ మీ 5 ప్రో క్వాడ్ కెమెరా సెటప్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది. 6.3 అంగుళాల స్క్రీన్ సైజు, 4 జీబీ ర్యామ్, 48+8+2+2 ఎంపీల వెనక కెమెరాలున్నాయి. 16 ఎంపీలతో సెల్ఫీ కెమెరా ఉంది. 4035 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. రెండు వేరియేషన్లలో లభించే దీని ధర రూ.12000, రూ 14000గా ఉంది.

### స్యామ్‌సంగ్ గెలాక్సీ ఎం 30



స్యామ్‌సంగ్ గెలాక్సీ ఎం 30 స్మార్ట్‌ఫోన్ ఆకర్షణీయమైన లుక్‌తో వచ్చింది. అమోలెడ్ డిస్‌ప్లేను కలిగి ఉంది. 48 ఎంపీల ట్రిపుల్ కెమెరా, 4జీబీ ర్యామ్, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఫాస్ట్ చార్జింగ్ ఫీచర్‌తో రూ. 14 వేలకే అందుబాటులో ఉంది.

### షావోమీ రెడ్ ఎంఐ నోట్ 7



షావోమీ రెడ్ ఎంఐ నోట్ 7 గ్రేడియెంట్ కలర్స్‌లో విడుదలైంది. 48 ఎంపీల డబుల్ కెమెరాలతో అందరినీ ఆకర్షించింది. 6.3 అంగుళాల స్క్రీన్ సైజ్, 4 జీబీర్యామ్, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని ధర ఆయా ఆన్‌లైన్ స్టోర్‌లలో రూ. 10,500 లోపే ఉంది.

### షావోమీ ఎంఐ ఏ3



షావోమీ నుంచి రూ.15వేలలోపు బడ్జెట్ ధరలో లభించే ఈ స్మార్ట్ ఫాస్ట్ చార్జింగ్ ఫీచర్‌ను కలిగి ఉంది. 48+8+2 ఎంపీలతో మూడు ప్రైమరీ కెమెరాలను, 32 ఎంపీ సెల్ఫీ కెమెరాను కలిగి ఉంది. 6.01 అంగుళాల స్క్రీన్ సైజ్‌తో ఆకర్షణీయమైన డిజైన్‌తో అందుబాటులో ఉంది. 4030 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం ఉంది. దీని ధర రూ.12500.

### మోటొరోలా వన్ విజన్



లో-లైట్ మోడ్‌తో వచ్చిన ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ మోటొరోలా వన్ విజన్. ధరకు తగిన కెమెరా సామర్థ్యం, ఫీచర్లలో నాణ్యతను కలిగి ఉంది. 4 జీబీ ర్యామ్, 32 జీబీ మెమొరీ, 48+2 ఎంపీల ప్రైమరీ కెమెరా, 6.3 అంగుళాల స్క్రీన్ సైజ్‌తో ఆకట్టుకుంటున్నది. దీని ధర రూ.15వేలు.

### రియల్ మీ 3 ప్రో



హై ఎండ్ గేమ్స్‌ను సైతం సులభంగా సపోర్ట్ చేసే స్మార్ట్ ఫోన్‌లలో రియల్ మీ 3 ప్రో కూడా ఉంది. 16+5 ఎంపీ ప్రైమరీ కెమెరా, 25 ఎంపీల సెల్ఫీ కెమెరాను కలిగి ఉంది. 6.3 అంగుళాల స్క్రీన్ సైజ్‌తో మంచి డిజైన్ ఉంది. 4045 బ్యాటరీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ధర రూ.9999.



## హాట్ హాట్ చొక్కా..

బిగ్‌బాస్-3 తో పునర్నవికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. అందుకే ఆమె తరచూ వార్తల్లో నిలుస్తున్నది. ఇటీవల పునర్నవి ఓ ఫొటో షూట్‌లో పాల్గొన్నది. అందులో వల లాంటి చొక్కాను ధరించి ఆమె ఫొటోకు ఫోజిచ్చింది. ఈ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దాంతో ఆ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

# కుక్కకోసం విమానం అద్దెకు!

ఓ యువతి కొన్నేండ్లుగా ఒక శునకాన్ని పెంచుకుంటున్నది. ఆత్మీయుడిగా భావించి దాంతో స్నేహం చేస్తున్నది. తన కష్ట సుఖాల్ని పంచుకుంటున్నది. ఉన్నట్టుండి ఓ రోజు ఆ శునకాన్ని ఎవరో ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత ఆమె తిండీ, నిద్ర మానేసింది. దానికోసం ఓ విమానం అద్దెకు తీసుకొని మరీ తిరుగుతున్నది.



**శాన్‌**ఫ్రాన్సిస్కోకు చెందిన ఎమిలీ పదేండ్లుగా ఓ శునకాన్ని పెంచుకుంటున్నది. దాని పేరు జాక్సన్. అది ఆస్ట్రేలియన్ షెపర్డ్ జాతికి చెందింది. నీలం రంగు కళ్లతో, నలుపు, తెలుపు వెంట్రుకలతో చూడ ముచ్చటగా ఉంటుంది. పదిరోజుల క్రితం షాపింగ్‌కు వెళ్లినప్పుడు ఆ శునకాన్ని గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చింది. షాపు సీసీటీవీ ఫుటేజీల్ని పరిశీలించింది. ఎత్తుకెళ్లిన వ్యక్తి ముఖానికి ముసుగు ఉండడంతో గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉందని గ్రహించింది. తన కుక్కను వెతికి ఇచ్చిన వారికి ఏడు వేల డాలర్లు బహుమతిగా ఇస్తానని ప్రకటించింది. భారత కరెన్సీలో రూ.5 లక్షలు. జాక్సన్‌ను వెతికేందుకు ఓ చిన్నపాటి విమానాన్ని రోజుకు 1200 డాలర్లు ఇచ్చి అద్దెకు తీసుకున్నది. రోజూ రెండు గంటలు కొన్ని ప్రాంతాల్లో పెద్ద పెద్ద బ్యానర్లను వేలాడదీస్తూ జాక్సన్‌కోసం వెతుకుతున్నది. డబ్బులు సరిపోకపోవడంతో ఎమిలీ ఫండ్ రేజింగ్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. గోఫౌండ్‌మి అనే వెబ్‌సైట్‌ను లాంచ్ చేసి విరాళాలు సేకరిస్తున్నది. ఇప్పటివరకు 7 వేల డాలర్లు సేకరించింది. ఒకవేళ జాక్సన్ దొరికితే మిగిలిన డబ్బుల్ని రాకెట్ డాగ్ రెస్క్యూకి ఇస్తానని ప్రకటించింది.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఓఎంపీఎల్‌లో

**ఓఎన్‌జీసీ మంగళూరు పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఓఎంపీఎల్)లో గేట్ స్కోర్‌తో ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- ఇంజినీర్ (ఈ1 గ్రేడ్)
- **మొత్తం ఖాళీలు:** 16.
- **విభాగాలు-పోస్టులు:** కెమికల్-9, మెకానికల్-1, ఎలక్ట్రికల్-2, ఐటీ-1, ఇన్‌స్ట్రుమెంటేషన్-3.
- **గేట్ 2019 పేపర్లు-కోడ్:** కెమికల్ ఇంజినీరింగ్ (సీహెచ్), మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంఈ), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ (ఈఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్), ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ (ఐఎన్), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీ).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.750/-
- **ఎంపిక విధానం:** గేట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్/ గ్రూప్ టాస్క్, ఇంటర్వ్యూ ద్వారా
- **చివరితేదీ:** 2020, జనవరి 18
- **వెబ్‌సైట్:** https://www.ompl.co.in



**ఢిల్లీ పోలీస్ విభాగం కింది ఖాళీల భర్తీకి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.**

## హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

- **పోస్టు:** హెడ్ కానిస్టేబుల్
- **మొత్తం ఖాళీలు:** 585 (డిపార్ట్‌మెంటల్ మినహాయించి)
- వీటిలో పురుషులకు మొత్తం 392 (జనరల్-134, ఈడబ్ల్యూఎస్-40, ఓబీసీ-90, ఎస్సీ-76, ఎస్టీ-49). మహిళలకు మొత్తం 193 (జనరల్-67, ఈడబ్ల్యూఎస్-19, ఓబీసీ-45, ఎస్సీ-38, ఎస్టీ-24) ఉన్నాయి.
- **పేస్కేల్:** పేమ్యాట్రిక్స్ లెవల్-4 ప్రకారం రూ.25,500-81,100/-
- **అర్హతలు:** సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత/ సంబంధిత సబ్జెక్టులో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌టీసీ), టైపింగ్, కంప్యూటర్ నాలెడ్జ్.
- **వయస్సు:** 2019, జూలై 1 నాటికి 18-27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో డిసెంబర్ 28 నుంచి ప్రారంభం.
- **చివరితేదీ:** 2020, జనవరి 27.
- **వెబ్‌సైట్:** www.delhipolice.nic.in

## ఎన్‌ఆర్‌టీఐలో


**వడోదరలోని నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఆర్‌టీఐ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **పోస్టు:** ఫ్యాకల్టీలు
- **విభాగాలు:** స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ అప్లయిడ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్ అండ్ డిజైన్ తదితరాలు.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, పీజీ, యూజీసీ/సీఎస్‌ఐఆర్ నెట్‌లో అర్హత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా
- **చివరితేదీ:** 2020, జనవరి 18
- **వెబ్‌సైట్:** https://nrti.edu.in

## ఆర్మీలో 108 ఖాళీలు

**ఇండియన్ ఆర్మీకి చెందిన 17, 23 అమ్యునిషయన్ విభాగంలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 108
- **పోస్టులవారీగా ఖాళీలు:** ట్రేడ్స్‌మెన్ మేట్-62, ఫైర్‌మెన్-35, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-9, ఎంటీఎస్-2.
- **పేస్కేల్:** ట్రేడ్స్‌మెన్ మేట్, ఎంటీఎస్ పోస్టులకు- రూ.18,000-56,900/-, మిగిలిన పోస్టులకు రూ.19,900-63,200/-
- **అర్హతలు:** ట్రేడ్స్‌మెన్ మేట్, ఫైర్‌మెన్, ఎంటీఎస్ పోస్టులకు పదో తరగతి, ఎల్‌డీసీ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్, పీఈటీ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 12
- **వెబ్‌సైట్:** https://www.indianarmy.nic.in



వేములవాడలో అమ్మవారి దర్శనం కోసం బోనాలతో తరలివచ్చిన భక్తులు

## బద్దిపోచమ్మకు భక్తితో మొక్కులు

**వేములవాడ కల్చరల్:** వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొన్నది. రాజన్నను దర్శించుకున్న అనంతరం బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. మంగళవారం ఉదయం నుంచే బద్దిపోచమ్మ ఆలయానికి భక్తుల రాక మొదలైంది. వసతి గదుల వద్ద భక్తి శ్రద్ధలతో బోనం వండుకొని, డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు ఆలయానికి చేరుకొని బారులుతీరారు. అమ్మవారిని దర్శించుకుని కల్లు సాక పోసి, సారె పెట్టి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.



జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తుల సందడి

## కొండగట్టులో భక్తుల రద్దీ

**మల్యాల:** జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొన్నది. సమ్మక్క-సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో కొండగట్టులో భక్తుల సంఖ్య పెరిగింది. ఆలయ ప్రాకార మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అష్టోత్తర శతనామావళి పూజ, స్వామివారికి అభిషేకం, భజన, హారతి తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. భక్తుల సంఖ్య గణనీయంగా ఉండడంతో అదనపు లడ్డూ కౌంటర్లు ఏర్పాటుచేశారు. మంగళవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, ఆలయానికి వివిధ పూజలు, ప్రత్యేక దర్శనాలు, సేవల రూపంలో సుమారు రూ.మూడు లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకుడు వైరాగ్యం అంజయ్య, శ్రీనివాస్‌శర్మ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వర్‌రావు, సంపత్, ఆలయ సిబ్బంది రాజేందర్ రెడ్డి, ధర్మేందర్, కాసర్ల శ్రీనివాస్, పోలీస్ సెక్యూరిటీ సిబ్బంది ఇంచార్జి సముద్రాల రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



# ఉద్ధృతంగా పౌర నిరసన!

- సీఏఏ వ్యతిరేక ఆందోళనలకు మద్దతిచ్చిన 70 విద్యార్థి సంఘాలు
- జాదవ్‌పూర్ వర్సిటీలో బెంగాల్ గవర్నర్ జగదీప్ అడ్డగింత
- సీఏఏ, ఎన్నార్సీపై మోదీ, అమిత్‌షా విరుద్ధ ప్రకటనలు: మమత ఫైర్
- మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న రాహుల్, ప్రియాంకను అడ్డుకున్న యూపీ పోలీసులు

**న్యూఢిల్లీ/మీరట్(యూపీ)/కోల్‌కతా, డిసెంబర్ 24:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పలు చోట్ల కొనసాగుతున్న నిరసనలకు మద్దతు తెలుపుతున్నట్టు 70కి పైగా విద్యార్థి, యువజన సంఘాలు మంగళవారం ఢిల్లీలో ప్రకటించాయి. నూతన సంవత్సరం రోజున నేషనల్ యంగ్ ఇండియా కో-ఆర్డినేషన్ అండ్ క్యాంపేయిన్(వైఐఎన్‌సీసీ)తో పాటు మరికొన్ని మద్దతు సంఘాలతో రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తామని విద్యార్థి నాయకులు తెలిపారు. 'నూతన సంవత్సర తీర్మానం- రాజ్యాంగాన్ని రక్షిద్దాం' పేరిట నినాదాన్నిచ్చారు. ప్రస్తుతం తాము 70కి పైగా సంఘాలుగా ఉన్నామని, సీఏఏ, ఎన్నార్సీ, జాతీయ జనాభా రిజిస్టర్(ఎన్‌పీఆర్)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులను, సంఘాల్ని, సంస్థలను సమన్వయపర్చడానికి కృషి చేస్తామని వైఐఎన్‌సీసీ సభ్యుడు ఎన్ సాయి బాలాజీ తెలిపారు. ఎఫ్‌టీఐఐ స్టూడెంట్స్ యూనియన్-పుణే, బిల్‌ప్రదేశ్ విద్యార్థి మోర్చా-రాజస్థాన్, అశోకా యూనివర్సిటీ స్టూడెంట్ గవర్నమెంట్-ఢిల్లీ, డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్-పంజాబ్, భీంఆర్మీ, ఆల్ ఆదివాసీ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, ఐఐటీ-గాంధీనగర్ తదితర సంఘాలు ఈ ప్రచారోద్యమంలో ఉన్నాయి.

### గవర్నర్‌ను తాకిన నిరసన సెగలు

పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధంకర్‌కు సీఏఏ నిరసన సెగలు తగిలాయి. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలోని జాదవ్‌పూర్ వర్సిటీలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన జగదీప్ ధంకర్‌ను విద్యార్థులు, వర్సిటీ అధ్యాపకేతర సిబ్బంది అడ్డుకున్నారు. నల్లజెండాలతో గవర్నర్ కారుకుఅడ్డుగా నిల్చున్న విద్యార్థులు సీఏఏకు వ్యతిరేకంగా నినాదాలుచేశారు. కారు దిగి గవర్నర్ సభావేదిక వద్దకు వెళ్తున్న క్రమంలో గో బ్యాక్, ఎన్నార్సీ వద్దు, సీఏఏ వద్దు అని నినదించారు. నిరసనకారుల తీరుపై ఒకింత అసంతృప్తికిలోనైన ధంకర్.. వర్సిటీ వీసీ సురంజన్‌దాస్‌కు ఫోన్ చేసే ప్రయత్నం చేశారు. నిర్వాహుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆందోళనలను వర్సిటీ అదుపు చేయలేకపోవడం దారుణమన్నారు. వీసీ ప్రేక్షక పాత్ర పోషించారని ఆరోపించారు. స్నాతకోత్సవంలో పాల్గొనకుండానే వర్సిటీ నుంచి తిరుగు ప్రయాణం అయ్యే ముందు మీడియాతో గవర్నర్ మాట్లాడుతూ.. 'ఇలాంటి పరిస్థితులను వర్సిటీల్లో మేము ఎంత మాత్రం అంగీకరించం. ఇక్కడ చట్టం పూర్తిగా పతనమైంది' అని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వాళ్లు విద్యార్థులు కారని, పట్టుమని 50 మంది కూడా లేని నిరసనకారులను అదుపుచేయడంలో వర్సిటీ పాలన విభాగం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.





పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఢిల్లీలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

### ఆ పార్టీనే పెద్ద మోసం

బీజేపీ కంటే పెద్ద మోసం మరొకటి లేదని, ఆ పార్టీ ఉద్దేశాల్ని ప్రజలు గమనించాలని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. సీఏఏ, ఎన్నార్సీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని, ఎవరి మాటలు నిజమో తెలియని పరిస్థితి తలెత్తిందని ఆమె దుయ్యబట్టారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా కోల్‌కతాలో చేపట్టిన నిరసన ర్యాలీలో మంగళవారం పాల్గొన్న ఆమె మాట్లాడారు. 'నేను బతికి ఉన్నంత వరకూ బెంగాల్‌లో సీఏఏ, ఎన్నార్సీని అమలు కానివ్వను. మత ప్రాతిపదికన దేశాన్ని విడదీయడానికి అనుమతించను. బెంగాల్‌లో ఎలాంటి డిటెన్షన్ సెంటర్‌ను నిర్మించడానికి ఒప్పుకోను' అని అన్నారు. దురహంకారంతో విర్రవీగుతున్న బీజేపీకి జార్ఖండ్ ప్రజలు బుద్ధి చెప్పారని తెలిపారు.

### ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలి?

సీఏఏకి వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలపై ఢిల్లీలో నివసిస్తున్న పాకిస్థాన్‌కు చెందిన హిందువులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ బాధను అర్థం చేసుకోవాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. 'మేము ఇండ్లు, భూములు వదిలి పాక్ నుంచి ఇక్కడికి వచ్చాం. ఇప్పుడు భారతదేశమే మా ఇల్లు. సీఏఏను మీరు అంగీకరించకపోతే, మళ్లీ మేము ఎక్కడికి వెళ్ళాలి? మా బాధను అర్థం చేసుకోండి. ఇప్పుడే మానుతున్న మా గాయాల్ని నిరసనల పేరుతో మళ్లీ రేపొద్దు' అని ఢిల్లీలో నివసిస్తున్న పాకిస్థాన్‌కు చెందిన ఓ 40 ఏండ్ల మహిళ పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో డిటెన్షన్ కేంద్రాలుండవ్!

- ముస్లింలు ఆందోళన చెందవద్దు.. సీఎం ఉద్ధవ్‌ఠాక్రే హామీ



**ముంబై, డిసెంబర్ 24:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. మహారాష్ట్రలో నిర్బంధ శిబిరాలు (డిటెన్షన్ కేంద్రాలు) ఉండబోవని ఆ రాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. తన హయాంలో రాష్ట్రంలోని ముస్లిం పౌరులు ఆందోళన చెందనవసరం లేదని హామీ ఇచ్చారు. కొందరు ముస్లిం ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం సోమవారం ఉద్ధవ్ ఠాక్రేతో సమావేశమైంది. రాష్ట్రంలోని ముస్లింలకు ఎటువంటి అన్యాయం జరుగదని చెప్పారు. మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్న విదేశీయుల కోసమే నవీ ముంబైలో ఖార్ఘర్ డిటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం ఖర్ఘర్ డిటెన్షన్ సెంటర్‌లో 38 మందిని మాత్రమే నిర్బంధించారు. జైలు నుంచి విడుదలైన విదేశీయులను వారి సొంత దేశానికి పంపే వరకు వారి బస కోసం ఈ డిటెన్షన్ కేంద్రం ఏర్పాటు చేశారు. 'రాష్ట్రంలోని ఏ సామాజిక వర్గానికి చెందిన, మతానికి చెందిన పౌరుల హక్కులను ఉల్లంఘించేందుకు మా ప్రభుత్వం అనుమతించదు. రాష్ట్రంలో శాంతి, సామరస్యం కాపాడాలని నేను ప్రజలను అభ్యర్థిస్తున్నా' అని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు.

## రాహుల్‌ను ప్రియాంకను అడ్డుకున్న పోలీసులు

సీఏఏకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో చేపట్టిన నిరసనల్లో భాగంగా రేగిన హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు ఢిల్లీ నుంచి బయల్దేరిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాను యూపీలోని మీరట్‌లో పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. దీంతో రాహుల్, ప్రియాంక ఢిల్లీకి తిరుగు ప్రయాణం అయ్యారు. సున్నిత ప్రాంతమైన మీరట్‌లో 144 సెక్షన్ విధించామని, పర్యటన వల్ల జిల్లాలో ఏమైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే మీరే(రాహుల్, ప్రియాంక) బాధ్యత వహించాలని వాళ్లతో చెప్పామని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు. అయితే రాహుల్, ప్రియాంక తమ పర్యటనను రద్దు చేసుకున్నారని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, తమను ఆపేందుకు కావాల్సిన ఆదేశాల్ని చూపించాలని పోలీసులను అడిగామని, అయితే, వాళ్లు ఎలాంటి ఆర్డర్ కాపీలను చూపించకుండానే తమను వెనక్కి వెళ్లాలని సూచించారని మీడియాతో రాహుల్ పేర్కొన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా ఇటీవల యూపీ వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో 17 మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీళ్లలో దాదాపు ఐదుగురు మృతులు మీరట్ జిల్లాకు చెందినవారే. మరోవైపు, ఉత్తరప్రదేశ్ బిజ్నూర్‌లో సీఏఏకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో గత శుక్రవారం మృతి చెందిన 22 ఏండ్ల సులేమాన్ మరణంపై ఆ జిల్లా ఎస్పీ వివరణ ఇచ్చారు. సీఏఏకి వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనల్లో తనను తాను రక్షించుకోవడానికి ఓ కానిస్టేబుల్ కాల్పులు జరిపాడని, ఈ ఘటనలో సులేమాన్ చనిపోయినట్టు ఆయన తెలిపారు.

❖ సీఏఏకి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం చేపట్టిన నిరసనల్లో జేఎన్‌యూ, జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు పాల్గొని 'హల్లా బోల్', 'ఛాత్రా ఏక్తా జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. మండి హౌజ్ నుంచి ప్రారంభమైన ఈ నిరసనలు జంతర్‌మంతర్ వరకు కొనసాగాయి.

❖ సీఏఏకి వ్యతిరేకంగా కేరళలో నిరసనలు హోరెత్తాయి. అధికార సీపీఎం పార్టీ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సీఏఏకి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. కోజికోడ్‌లో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన కేంద్రమంత్రి వీ మురళీధరన్‌ను ఆందోళనకారులు అడ్డుకొని నల్ల జండాలు చూపుతూ సీఏఏకి వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేశారు. కన్నూర్ పర్యటనకు వెళ్లడానికి తిరువనంతపురం విమానాశ్రయానికి వచ్చిన కర్ణాటక సీఎం బీ ఎస్ యడియూరప్పకు కూడా సీఏఏ నిరసన సెగలు తాకాయి. ఆయన్ని వెనక్కు వెళ్లాలంటూ నల్ల జండాలతో నిరసనకారులు ఆందోళనలు చేపట్టారు.

## అన్నీ ఒకేచోట మంచిది కాదు

- మూడు రాజధానులను పరోక్షంగా సమర్థించిన ఉపరాష్ట్రపతి

**తాడేపల్లిగూడెం / విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరుగాలంటే అన్నీ ఒకే చోట పెట్టడం మంచిది కాదన్నారు. తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మొదటి స్నాతకోత్సవానికి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నీ రాజధానిలోనే ఉంటే మిగతాప్రాంతాల అభివృద్ధి జరుగదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం నెలకొన్న రాజధాని వివాదానికి, తాను చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి సంబంధం లేదని వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. తెలంగాణకు వెళ్లినా, ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినా సొంతింటికి వచ్చినట్టు ఉంటుందని వెంకయ్య అన్నారు. మాతృభాషను మర్చిపోవద్దని.. భాష, భావం రెండు కలిసి నడుస్తాయని పేర్కొన్నారు. ఇంగ్లిషు నేర్చుకోవటంలో తప్పు లేదని.. కానీ మాతృభాషలోనే మాట్లాడాలని సూచించారు.

### రాజధానికి అనువైన నగరం విశాఖ: మాజీ మంత్రి గంటా

ఏపీ రాజధానిని అమరావతినుంచి మార్చొద్దు అంటూ టీడీపీ నేతలంతా ఒకేమాటపై ఉంటే.. ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాత్రం జగన్ నిర్ణయాన్ని స్వాగతించారు. విశాఖపట్నంలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటును స్వాగతిస్తున్నామని మంగళవారం గంటా శ్రీనివాసరావు స్పష్టంచేశారు. విశాఖవాసిగా సీఎం వైఎస్ జగన్ ప్రకటనపై తాను స్పందిస్తున్నానని, ఇది మంచి ఆలోచన కావడంతో హర్షం వ్యక్తంచేశానని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నా.. విశాఖవాసిగానే తన స్పందన తెలియజేస్తున్నానని చెప్పుకొచ్చారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం విశాఖ సిటీ ఆఫ్ డెస్టినీ అని అన్నారు. జీఎన్‌రావు కమిటీ సిఫారసులవల్ల రాష్ట్రంలోని అన్నిప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు.అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారానే అన్నిప్రాంతాల్లో సమాన అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

### రాజధానుల విషయంలో టీడీపీది రాద్ధాంతం: మంత్రి బొత్స

ఏపీ రాజధాని విషయంలో టీడీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. వైఎస్ హయాంలోనే విశాఖపట్నం అభివృద్ధి చెందిందన్నారు. తానే విశాఖను అభివృద్ధి చేశానని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉన్నదని చెప్పారు. రాజధాని అభివృద్ధి చెందాలంటే ఐటీ, అభివృద్ధి, కనెక్టివిటీ, యాక్టివిటీ ఉండాలని గతంలో చంద్రబాబు అనలేదా? అని మంత్రి బొత్స ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పిన అంశాలన్నీ విశాఖలో ఉన్నాయి కదా అని అన్నారు. ఇదే సమయంలో భీమిలిలో రాజధానిని ఏర్పాటు చేస్తారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. అక్కడ రాజధానిని ఏర్పాటు చేస్తామని ఎవరూ చెప్పలేదని మంత్రి బొత్స స్పష్టం చేశారు.

## కృష్ణా, గోదావరి జలాలను తరలిస్తాం

- ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

**వైఎస్సార్ కడప:** వెనుకబడిన రాయలసీమ జిల్లాలను కృష్ణా, గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని కడప జిల్లా రాయచోటి, చిత్తూరు జిల్లాకు తరలిస్తామని తెలిపారు. కనీసం సాగు, తాగునీరు కూడా అందుబాటులోలేని రాయచోటి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. కడప జిల్లా రాయచోటి నియోజకవర్గంలో సీఎం జగన్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఆరునెలలు కూడా కాకముందే రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు


## సిరియాలో రష్యా దాడులు.. ఎనిమిది మంది మృతి

- మృతుల్లో ఐదుగురు పిల్లలు

**బీరూట్, డిసెంబర్ 22:** సిరియాలోని ఇడ్లిబ్ రాష్ట్రంలో ఉన్న జుబాస్ గ్రామంపై రష్యా వైమానిక దాడులకు దిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించారు. వీరిలో ఐదుగురు పిల్లలు ఉన్నారు. సిరియాలోని మానవహక్కుల పరిశీలకులు మాట్లాడుతూ జుబాస్ గ్రామంపై రష్యా వైమానిక దాడులు జరుపడంతో తాత్కాలిక గుడారాల్లో తలదాచుకుంటున్న వారితో పాటు దాని సమీపాన ఉన్న పాఠశాలకు చెందిన విద్యార్థులు మొత్తం కలిపి ఎనిమిది మంది మరణించారని చెప్పారు. ఈ నెల 16 నుంచి దక్షిణ ఇడ్లిబ్ ప్రాంతంపై రష్యా జరిపిన వైమానిక, ఇతర దాడుల వల్ల ఇప్పటి వరకు దాదాపు 80 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. మరోవైపు సిరియాలో వైమానిక దాడులు జరుగడం వల్ల మరింత మంది నిరాశ్రయులయ్యే ప్రమాదముందని, ఈ దాడులకు అడ్డుకట్ట వేయాలని ఐక్యరాజ్యసమితి సూచించినప్పటికీ రష్యా మాత్రం దాడులు కొనసాగిస్తూనే ఉన్నది.

## భారత్, పాక్ వైరమే సార్క్‌కు అడ్డంకి

- బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి మొమెన్ వ్యాఖ్య



**ఢాకా, డిసెంబర్ 24:** దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) పురోభివృద్ధి చెందకపోవడానికి భారత్, పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న వైరం ఓ ప్రధాన కారణమని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఏకే అబ్దుల్ మొమెన్ పేర్కొన్నారు. బిమ్‌స్టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో-ఆపరేషన్), బీబీఐఎన్ (బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్) లాంటి ప్రాంతీయ సహకార సంఘాలు చక్కగా పనిచేయగలవని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సార్క్ సభ్యదేశాల మధ్య సహకారం లోపించడానికి మీరంటే మీరు కారణమని భారత్, పాక్ పరస్పరం విమర్శించుకొంటున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢాకాలో బంగ్లాదేశ్ విదేశాంగశాఖ నిర్వహించిన 'విజిట్ నేపాల్-బంగ్లాదేశ్ ప్రోగ్రామ్-2019' ముగింపు కార్యక్రమంలో మొమెన్ విదేశీ జర్నలిస్టుల బృందంతో మాట్లాడుతూ.. భారత్, పాక్ మధ్య కొనసాగుతున్న వైరం సార్క్ పురోభివృద్ధిని అడ్డుకొంటున్నదన్నారు. 'సార్క్ ఎందుకు పురోగమించడంలేదో మీకు తెలుసు. దీనికి గల ప్రధాన కారణాల్లో భారత్, పాక్ మధ్య నెలకొన్న శతృత్వం ఒకటి. కానీ బీబీఐఎన్, బిమ్‌స్టెక్, ఇతర ప్రాంతీయ సహకార సంఘాలు చక్కగా పనిచేయగలవని ఆశిస్తున్నా. అందుకు మేము కష్టపడి పనిచేయడంతోపాటు పరిస్థితులు కూడా కలిసిరావాలి' అని మొమెన్ పేర్కొన్నారు. నేపాల్, భూటాన్ లాంటి పొరుగుదేశాలతో బంగ్లాదేశ్ సంబంధాలు మెరుగుపడుతున్నాయని, భారత్‌తో బంగ్లాదేశ్ ఎప్పుడు మాట్లాడినా నేపాల్, భూటాన్ సమస్యల గురించి కూడా చర్చిస్తున్నదని చెప్పారు. సార్క్ సభ్యదేశాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఉగ్రవాద చర్యలతో పదేపదే అడ్డంకులు ఎదురవుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్న కొన్ని వారాలకే మొమెన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## లోయలో పడ్డ బస్సు 27 మంది మృతి

- ఇండోనేషియాలో ఘోరం

**పాలెంబంగ్ (ఇండోనేషియా), డిసెంబర్ 24:** ఇండోనేషియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి దక్షిణ సమత్రా ప్రాంతంలో ఓ బస్సు 150 మీటర్ల లోతైన లోయలో పడింది. ఈ ప్రమాదంలో 27 మంది మృతిచెందారు. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు నదిలో గల్లంతైనట్టు భావిస్తున్నారు. బెంగ్‌కులు ప్రావిన్స్ నుంచి పగర్‌ఆలం వెళ్తున్న బస్సు.. రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో అదుపు తప్పి, నది చివరి భాగంలో ఉన్న లోయలో పడింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులున్నారు. గాయపడ్డవారిని దవాఖానకు తరలించారు. గల్లంతైనవారి ఆచూకీ కనుగొనేందుకు డైవర్లు ప్రయత్నిస్తున్నారు.ఇండోనేషియాలోని పశ్చిమ జావా ప్రాంతంలో సెప్టెంబర్‌లో ప్రమాదంలో 21 మం ది మృతిచెందగా, కొద్దినెలల ముందు మరో ప్రమాదంలో 12 మంది చనిపోయారు.

## ఖమ్మం డీఎంహెచ్‌వో కళావతిబాయి బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా పనిచేస్తున్న బీ కళావతిబాయిని బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆమెను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ దవాఖానకు సీఎస్ఆర్‌ఎంవోగా ఖమ్మం నుంచి బదిలీ చేస్తూ వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సూర్యాపేట జీజీహెచ్‌లో పరిపాలనా పరంగా ఉన్న ఖాళీలో ఆమెను బదిలీ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఖమ్మం అదనపు డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న బీ మాలతికి పూర్తిస్థాయి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వులో వెల్లడించారు.



మంగళవారం కరీంనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## పేదలకు అండ సీఎంఆర్ఎఫ్

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- 98 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**ధర్మపురి, నమస్తే తెలంగాణ:** ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలిచి భరోసా ఇస్తున్నదని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, పెగడపల్లి, ధర్మారం, వెల్గటూర్, గొల్లపెల్లి, బుగ్గారం మండలాలకు చెందిన 98 మంది లబ్ధిదారులకు రూ.31లక్షల 10వేల 500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర చికిత్స కోసం దరఖాస్తు చేసుకున్న పేదవారికి నేనున్నానంటూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యఖర్చులు చెల్లిస్తున్నదని చెప్పారు. ఉమ్మడిరాష్ట్రంలో సీఎంలుగా పనిచేసిన ఆంధ్రా నాయకులు ఏనాడూ తెలంగాణ ప్రాంత బాధితులను పట్టించుకోలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి సహాయనిధి సహాయం కోసం సచివాలయంలో ప్రత్యేక సెక్షన్ ఏర్పాటుచేశామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు అందిన వెంటనే అధికారులు వెరిఫికేషన్ పూర్తిచేసి లబ్ధిదారుల పేరిట చెక్కులు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా దవాఖాన ఖర్చులు చెల్లించుకోలేని వారికి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ)అందజేస్తున్నామని వివరించారు.



వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామసభలో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

## మిషన్ అంత్యోదయను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర బృందం సభ్యుల సూచన
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటన

**వేములవాడ రూరల్:** మిషన్ అంత్యోదయ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పథకం కేంద్ర బృందం సభ్యులు జ్ఞాన సుందర్, ఉదయ్‌కుమార్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని ఎదురుగట్ల, మర్రిపెల్లి, అనుపురం, చంద్రగిరి గ్రామాల్లో వారు మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో అభివృద్ధి, గ్రామసభల నిర్వాహణ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న హరితహారం తదితర పథకాలపైనా చర్చించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణలో మిషన్‌అంత్యోదయ పథకం అమలు తీరును పరిశీలిస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం అనేక నిధులను అందజేస్తున్నదని, వాటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మిషన్‌అంత్యోదయ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్పీవో మల్లికార్జున్, ఎంపీవో శ్రీధర్, పశువైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి, ఏపీవో ఆనంద్, సర్పంచ్‌లు సోయినేని కరుణాకర్, కట్కం మల్లేశం, వెంకటరమణ, రాజేశం, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





గుజరాత్‌లో అవార్డు అందుకున్న పీసీబీ అధికారి మురళీమోహన్

## బొల్లారం ప్రభుత్వ పాఠశాల ఎకోక్లబ్‌కు అవార్డు

- గుజరాత్‌లో అవార్డు అందుకున్న టీఎస్‌పీసీబీ అధికారి మురళీమోహన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని బొల్లారం ప్రభుత్వ పాఠశాలలోని ఎకో క్లబ్‌కు జాతీయస్థాయిలో తృతీయ పురస్కారం లభించిందని టీఎస్‌పీసీబీ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్టు ఎన్ మురళీ మోహన్ తెలిపారు. పురస్కారంతోపాటు రూ.15 వేల నగదు బహుమతిని గెలుచుకున్నట్టు చెప్పారు. పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన చర్యలను గుర్తించి, డిసెంబర్ 20, 21 తేదీల్లో గుజరాత్‌లోని కేవాడియాలో జరిగిన ఓ కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేశారు. ఎకోక్లబ్బును విజయవంతంగా అమలు చేసినందుకు నేషనల్ గ్రీన్ క్రాప్స్ (ఎన్జీసీ), కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ టీఎస్‌పీసీబీకి సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ ప్రకటించింది.

## అక్రమ మైనింగ్ కేసు సీబీఐకి

- యరపతినేని చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

**అమరావతి:** ఏపీలోని గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అక్రమ మైనింగ్ కేసులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ కేసులను సీబీఐకి అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీచేసింది. కోనంకి, కేతానపల్లి, నడికుడి గ్రామాల్లో అక్రమ మైనింగ్‌పై 18 కేసులు నమోదయ్యాయి. కాగా, అక్రమ మైనింగ్‌పై మాజీ ఎమ్మెల్యే డీజీవీ కృష్ణా రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై విచారించిన ధర్మాసనం.. అక్రమ మైనింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈనేపథ్యంలో కేసులపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్‌తో పాటు, మరో 18 మంది పేర్లను జీవోలో పేర్కొంది ప్రభుత్వం.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 25 డిసెంబర్ 2019

## బుట్ట బొమ్మా నన్ను సుట్టూ కుంటివే..


పూజాహెగ్డే, అల్లు అర్జున్

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అల వైకుంఠపురములో'. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మాతలు. పూజాహెగ్డే కథానాయిక. జనవరి 12న ప్రేక్షకులముందుకురానుంది. తమన్ స్వరపరచిన ఈ సినిమాలోని మరో పాటను మంగళవారం విడుదల చేశారు. 'బుట్టబొమ్మా...బుట్టబొమ్మా..నన్ను సుట్టూకుంటివే..జిందగీకే అట్ట బొమ్మై జంట కట్టూకుంటివే' అనే పల్లవితో సాగే ఈ గీతాన్ని రామజోగయ్య శాస్త్రి రచించారు. యువగాయకుడు అర్మాన్‌మాలిక్ ఆలపించారు. 'ఇటీవలే ఈ పాట తాలూకు టీజర్‌ను విడుదల చేశాం. దాంతో ఈ గీతం కోసం సంగీతప్రియులు ఆత్రుతగా ఎదురుచూశారు. ప్రస్తుతం ఈ పాట ప్రేక్షకుల మనసుల్ని దోచుకుంటున్నది. సోషల్‌మీడియాలో రికార్డ్ వీక్షణ దిశగా దూసుకుపోతున్నది' అని చిత్రబృందం తెలిపింది.


కాలభైరవ

**చిత్రసీమలో స్వరాలే సంగీత దర్శకుల ప్రతిభకు కొలమానాలుగా నిలుస్తాయి. అందుకే వినూత్న బాణీల ద్వారా ప్రేక్షకుల్ని అలరించేందుకు మ్యూజిక్ డైరెక్టర్స్ తపిస్తుంటారు. కాలభైరవ మాత్రం పాటలు లేని థ్రిల్లర్ సినిమాతో సంగీత దర్శకుడిగా తెలుగు చిత్రసీమలో అడుగుపెడుతున్నారు. కథను నమ్మి తాను ఈ సినిమా చేశానని అంటున్నారాయన. కీరవాణి తనయుడు కాలభైరవ సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'మత్తు వదలరా'. శ్రీ సింహా హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రితేష్‌రానా దర్శకుడు. నేడు ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళ వారం హైదరాబాద్‌లో కాలభైరవ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి..**

# సంగీత దర్శకుడిగా ఆల్‌రౌండర్ అనిపించుకోవాలి!

**పాటలు లేకుండా నేపథ్య సంగీతంతో కూడిన ఈ సినిమాను ఎంచుకోవడానికి కారణం ఏమిటి?**

• ఇండస్ట్రీలో తొలి అవకాశం రావడం గొప్ప అన్నది నా సిద్ధాంతం. పెద్ద కుటుంబం నుంచి వచ్చినా ఆ నియమం నాకు వర్తిస్తుంది. లక్కీగా తొలి ప్రయత్నంలోనే బలమైన కథ, కథనాలున్న సినిమాకు సంగీతాన్ని అందించే అవకాశం దొరికింది. అందువల్లే సినిమాలో పాటలు లేవు అన్న ఫీలింగ్ ఎప్పుడూ కలగలేదు.

**సంగీత దర్శకుడిగా నాన్నగారి ప్రభావం మీపై ఎంత ఉందని అనుకుంటున్నారు?**

• దర్శకుడు సన్నివేశం చెప్పినప్పటి నుంచి పాట ప్రయాణం ఎలా ఆరంభమవుతుంది? ట్యూన్ ఎలా కంపోజ్ చేస్తారు? దర్శకుడు చేసే మార్పులు, వాటికి స్పందించే తీరుతో పాటు నాన్న నుంచి చాలా నేర్చుకున్నాను. తెలిసో తెలియకో నాన్న ప్రభావం నాపై వందశాతం ఉంది.

**సోదరుడు శ్రీసింహాకు నటన పట్ల ఉన్న ఆసక్తిని మీరు ఎప్పుడూ గ్రహించారు?**

• శ్రీసింహాకు చిన్నతనం నుంచే నటన అంటే ఇష్టం ఉంది. యాక్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకోవడానికి కొంత టైమ్ తీసుకున్నాడు. నటుడవ్వాలని నిశ్చయించుకున్న తర్వాత ఆ దిశగానే ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

**నేపథ్య గాయకుడిగా మీ ప్రయాణం పట్ల సంతృప్తిగా ఉన్నారా?**

• ఇప్పటివరకు దాదాపు ముప్పై పాటలు పాడాను.'బాహుబలి-2'లోని 'దండాలయ్యా..' పాట మంచి పేరుతీసుకొచ్చింది. 'అరవిందసమేత'లోని 'పెనిమిటి..' గీతం ఆ పేరును రెట్టింపుచేసింది. చిన్నతనం నుంచి సంగీత దర్శకుడినవ్వాలనేది నా కల.

**మీ నాన్నగారి దారిలోనే మీరు అడుగులు వేయాలని అనుకుంటున్నారా? మ్యూజిక్ డైరెక్టర్‌గా మీకు ఎలాంటి సినిమాలు చేయాలనుంది?**

• ఐదు, పదేళ్ల తర్వాత నా పేరు చెబితే ప్రత్యేకంగా ఒకటే రకమైన సంగీతం గుర్తురాకుండా ఏదైనా చేయగలడని చెప్పుకోవాలి. సంగీత దర్శకుడిగా ఆల్‌రౌండర్ అనిపించుకోవాలి. అదే నా లక్ష్యం.

**సెలబ్రిటీ పిల్లల్లా కాకుండా నా తనయుల్ని సాధారణంగా పెంచానని మీ నాన్నగారు అన్నారు? ఎందుకలా?**

• మేము సంపాదించే పరిజ్ఞానం కంటే మంచి బుద్ధి కలిగి ఉండటం ముఖ్యమనే భావంతో అమ్మనాన్న చిన్నతనం నుంచి మమ్మల్ని పెంచారు. మేము అలాగే పెరిగాం.

**థ్రిల్లర్ సినిమాకు నేపథ్య సంగీతాన్ని అందించడం ఎంతవరకు ఛాలెంజింగ్‌గా అనిపించింది?**

• నాపై ఒత్తిడి ఉందనే ఫీలింగ్‌తో ఈ సినిమాకు ఏ రోజు పనిచేయలేదు. ఆ క్రెడిట్ నాది కాదు. టీమ్ అందరం కొత్తవాళ్లం కావడంతో స్నేహితుల్లా కలిసిపోయి కాలేజీ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నట్లుగా కష్టపడ్డాం.

**ఈ సినిమా విషయంలో నాన్నగారు మీకు ఏమైనా సలహాలు ఇచ్చారా?**

• సంగీతాన్ని సమకూర్చే విషయంలో నాన్న నాకు ఎలాంటి సలహాలు ఇవ్వలేదు. రీరికార్డింగ్ సమయంలో కొన్ని సీన్స్ చూపించి నేనే నాన్న ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాను.

**సగటు ప్రేక్షకుడిగా ఈసినిమా చూసినప్పుడు ఏమనిపించింది?**

• సెట్‌కు వెళితే నాకు బోర్ కొడుతుంది. అందుకే షూటింగ్‌లకు దూరంగా ఉంటాను. ఈ సినిమా షూటింగ్‌కు ఒక్కరోజు కూడా వెళ్లలేదు. రీరికార్డింగ్ కోసం రఫ్ కట్‌ను నాకు పంపించారు. నా తొలి సినిమా కావడం, పరిమిత బడ్జెట్‌లో తెరకెక్కించడంతో ఎలా ఉంటుందోననే ఉత్సుకతతో తమ్ముడు నటించిన సినిమా అన్నది మర్చిపోయి ప్రేక్షకుడిననే మైండ్‌సెట్‌తో సినిమా చూశాను. ఆ రోజు నా జీవితంలో మర్చిపోలేని థ్రిల్‌ను అనుభవించాను. నేను ఊహించిన దానికంటే అద్భుతంగా సినిమా ఉండటంతో నేను బాగా సంగీతాన్ని అందించాలని ఫిక్సయ్యాను.

**ఈ సినిమా కోసం మీరు అందుకున్న బెస్ట్ కాంప్లిమెంట్ ఏది?**

• చాలా కొత్తగా ఉంది. ఇదివరకు ఎక్కడ ఇలాంటి సన్నివేశాలు చూడలేదని చాలా మంది అన్నారు.

**రాజమౌళి తనయుడు కార్తికేయతో మీరు సినిమా చేయబోతున్నట్లు తెలిసింది?**

• కార్తికేయ నిర్మాణ సంస్థలో 'ఆకాశవాణి' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నాను.





